www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 16-11-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 211 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి తె. 4:48 తదుపరి త్రయోదశి, నక్షత్రం: హస్త రా.2:11 తదుపరి చిత్త, వర్జ్యం: ఉ.8:52-10:39, దుర్ముహూర్తం: సా.4:05-4:50, అమృతఘడియలు: రా.7:31-9:18, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:24, సూర్యాస్తమయం: 5:35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

● థాంక్యూ ఇన్వెస్టర్స్..



విశాఖలో విదేశీ ప్రతినిధులతో ముగింపు సభలో సీఎం చంద్రబాబు. సీఐఐ చైర్మన్ రాజేంద్ర మోహాని, ఉపాధ్యక్షురాలు సుచిత్ర ఎల్లా

సదస్సు సూపర్ హిట్

సీఐఐ సదస్సుల్లో ఇదే బెస్ట్.. వచ్చే ఏడాది కూడా విశాఖలోనే: సీఎం

ఎంవోయూలను 100 శాతం సాకారం చేస్తాం.. మూడేళ్లలోనే సాధిస్తాం

మా మంత్రులు, అధికారులు వెంటబడతారు.. దావోస్‌కు హైబ్రిడ్ మోడల్‌గా విశాఖ సదస్సు

భారీ పెట్టుబడులతోపాటు చర్చలకూ చోటు.. రికార్డుస్థాయిలో 4,975 మంది హాజరు

గత ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీసింది.. విద్యుత్తు పీపీఏలను రద్దు చేసింది

అలాంటివి పునరావృతం కానివ్వం.. ఇస్రో ఖాతాలను తెస్తున్నాం.. ముగింపు సభలో బాబు

"కేవలం పెట్టుబడుల ఆకర్షణకే కాకుండా, అవగాహనలను పరస్పరం పంచుకోడానికి కూడా విశాఖ సదస్సును ఉపయోగించుకున్నాం. దావోస్ పెట్టుబడుల సదస్సులో ఎంవోయూలు ఉండవు. ప్రపంచం భవిష్యత్తులో ఏయే రంగాల్లో ఏ విధంగా ముందుకు పోతుందనే దానిపై చర్చలు మాత్రమే ఉంటాయి. విశాఖ సదస్సు దాని హైబ్రిడ్ మోడల్. రాష్ట్రానికి పెట్టుబడులు కూడా అవసరం కాబట్టి పారిశ్రామికవేత్తలతో ఎంవోయూలు చేసుకున్నాం. అదే సమయంలో చర్చలకు కూడా ప్రాధాన్యం ఇచ్చాం."

- సీఎం చంద్రబాబు

₹13.25 లక్షల కోట్ల పెట్టుబడులు

613 ఎంవోయూలతో 16 లక్షలకు పైగా ఉద్యోగాలు!

రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం వెల్లువెత్తింది. విశాఖ మహానగరంలో శుక్ర, శనివారాల్లో సీఐఐ నిర్వహించిన 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ఇందుకు వేదికైంది. రూ.13,25,716 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ పారిశ్రామిక సంస్థలు రాష్ట్రప్రభుత్వంతో ఏకంగా 613 అవగాహనా ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నాయి. ఇవి సాకారమైతే 16,31,188 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. సహజంగా సదస్సు ప్రారంభమయ్యాక పారిశ్రామికవేత్తలు ఒప్పందాలు చేసుకుంటారు. కానీ విశాఖ సదస్సుకు ఒకరోజు ముందే.. గురువారం సీఎం చంద్రబాబు సమక్షంలో 35 సంస్థలు రూ.3,65,304 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకోవడం గమనార్హం. అన్నిటికీ మించి.. ఒప్పందాలు చేసుకున్న వెంటనే.. ఆయా పారిశ్రామిక సంస్థలకు ప్రోత్సాహకాలిస్తూ ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయడం పారిశ్రామికవేత్తల్లో ఉత్తేజం నింపింది. ఈ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం.. వారిలో సంతృప్తితో పాటు నమ్మకాన్ని కూడా పెంచింది.

12 13 14



సీఐఐ సదస్సు ప్రాంగణం నుంచి శ్రీసిటీలో వివిధ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి టీజీ భరత్, శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, సీఎస్ విజయానంద్

విశాఖ సదస్సుకు వెల్లువెత్తిన కంపెనీలు

3 రోజులుగా పారిశ్రామికవేత్తలతో సీఎం విస్తృత సమావేశాలు

సదస్సును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం

లోకేశ్, భరత్ సహా పలువురు మంత్రుల మోహరింపు

కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు.. కేంద్ర మంత్రి గోయల్ రాక

జగన్ హయాంలో వెళ్లిపోయిన కంపెనీలూ తరలివచ్చాయి

ఓవైపు ఎంవోయూల మార్పిడి.. ఆ వెంటనే ప్రోత్సాహక జీవోలు

పరిశ్రమల్లో నమ్మకం పెంచిన 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'



సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ఎండీ జెరేమీ జర్గన్స్. చిత్రంలో మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ తదితరులు

ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దాం

ఉద్యోగాల కోతపై భయాలు అవసరం లేదు

'క్వాంటమ్'లో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుంది

2029 కల్లా ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా మారుస్తాం: లోకేశ్

సైబర్ దొంగల్లా లిక్కర్ ముఠా!



విజయవాడ జీజీహెచ్‌లో వైద్య పరీక్షలకు హాజరైన అనిల్ చోఖ్రా

ముడుపుల సొమ్ము 77 కోట్లు వైట్‌మనీగా మార్పు

కసిరెడ్డి డైరెక్షన్‌లో మొదట 4 డొల్ల కంపెనీల్లోకి బదిలీ

అక్కడి నుంచి 32 ఖాతాల్లోకి మళ్లింపు

ఆ తర్వాత వైట్‌మనీగా విత్ డ్రా

గత ప్రభుత్వ పెద్దలకు అందజేసిన అనిల్ చోఖ్రా

ముంబైలో ఆర్థిక మోసాలు, ఈడీ కేసుల్లో నిందితుడు

ఏ-49 రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి

21 వరకు రిమాండ్.. విజయవాడ జిల్లా జైలుకు

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో తవ్వేకొద్దీ కొత్తకొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. మద్యం వ్యాపారుల నుంచి వసూలు చేసిన ముడుపులను రకరకాల మార్గాల్లో మళ్లించిన మాఫియా.. కమీషన్లలో కొంత సొమ్మును వైట్‌మనీగా మార్చుకునేందుకు సైబర్ నేరగాళ్ల తరహాలో ఎత్తుగడ వేసింది. ఇందుకు ముంబైకి చెందిన ఆర్థిక మోసాల నిందితుడు అనిల్ చోఖ్రా సహకరించినట్టు తాజాగా వెల్లడైంది. ప్రతి నెలా రాష్ట్రంలో 60 కోట్లకు పైగా కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లు ఆ సొమ్మును మొదట మ్యూల్ ఖాతాలకు బదిలీ చేయడం, తర్వాత వీలైనన్ని ఎక్కువ బ్యాంకు ఖాతాల్లోకి మళ్లించి విత్ డ్రా చేయడం, బాధితులు ఫిర్యాదు చేసి పోలీసులు గుర్తించే లోపే ఆ ఖాతాల లావాదేవీలను

మిగతా 3వ పేజీలో...

స్మగ్లర్లలో భయం పుట్టిస్తాం



ఎర్ర చందనాన్ని తాకే సాహసం చేయకుండా చేస్తాం

కొన్నేళ్లుగా జరిగిన దోపిడీకి భయంకరమైన సాక్ష్యాన్ని మంగళం గోడౌన్లలో చూశా

స్మగ్లర్లు, కింగ్‌పిన్లు అందరినీ గుర్తిస్తున్నాం.. అరెస్టులే కాదు.. ఆస్తులూ జప్తు చేస్తాం: పవన్

శేషాచలం నుంచి ఒక్క దుంగా బయటికి పోకూడదు.. టాస్క్‌ఫోర్స్‌కు మళ్లీ జీవం పోసేలా సీఎంతో మాట్లాడతా.. నిఘా పెంచాలి.. చెక్‌పోస్టులు కట్టుదిట్టం చేయాలి

సమీక్షలో అటవీ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

అమరావతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని శేషాచలం అడవుల్లో లభ్యమయ్యే ఎర్రచందనం చెట్ల అక్రమ నరికివేత, రవాణాను నిరోధించేందుకు త్వరలో 'ఆపరేషన్ కగార్' తరహా ప్రత్యేక, పూర్తిస్థాయి ఆపరేషన్ ప్రారంభించనున్నట్లు ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. మళ్లీ ఎర్రచందనం చెట్లను తాకడానికి ఎవరూ ధైర్యం చేయకుండా స్మగ్లర్లలో భయం పుట్టిస్తామని హెచ్చరించారు. శనివారం ఆయన 'ఎక్స్'లో ఈ విషయాన్ని వెల్లడించారు. శేషాచలం కేవలం అడవి మాత్రమే కాదని, ఏడు కొండలతో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి పవిత్ర నివాసమని పేర్కొన్నారు. ఇటీవల మంగళంలోని ఎర్రచందనం డిపో గోడౌన్లలో తనిఖీ చేసినప్పుడు.. కొన్నేళ్లుగా జరిగిన దోపిడీకి ఒక భయంకరమైన

మిగతా 2వ పేజీలో...

రేవంత్ కా కమాల్!



బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపుగా మట్టి కరచినా తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ సాధించడం ద్వారా రాజకీయాలు చేయడంలో తాను ఆరితేరానని రేవంత్ రెడ్డి రుజువు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, అదే జరిగితే పార్టీలో, ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి బలహీనపడతారని చాలా మంది భావించారు.

ఈ నియోజకవర్గంలో ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. దీంతో ఆ వర్గం ఓట్లపై సీఎం దృష్టి పెట్టారు. వారందరూ తెలుగుదేశం పార్టీ అభిమానులు అయినందున అటు నుంచి నరుక్కొచ్చారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రదర్శన నిర్వహించినప్పుడు అప్పటి మంత్రి కేటీఆర్ హేళనగా మాట్లాడడాన్ని రేవంత్ రెడ్డి గుర్తుచేయించారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే జగన్‌రెడ్డికి బలం చేకూర్చినట్టేనని ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేయించారు.

ఆంధ్రప్రదేశ్‌లో తాము అభిమానించే జగన్ రెడ్డికి పట్టిన గతి చూసి కూడా కేసీఆర్ కుటుంబం తమ వైఖరి మార్చుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేసి సీట్లు గెలుచుకోలేకపోవచ్చు. కానీ ఆ పార్టీకి పలు నియోజకవర్గాలలో గణనీయంగా ఓట్లు ఉన్నాయి. అయినా కేసీఆర్ కుటుంబం జగన్ రెడ్డే మాకు ముద్దు అని భావించడం వింతగా ఉంది.

గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 16 వేల ఓట్ల మెజారిటీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలవడానికి ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కారణం కాదా? కేసీఆర్ అండ్ కో జగన్ రెడ్డితో అంటకాగడం వల్ల ఈ వర్గం ఓటర్లు అందరూ బీఆర్‌ఎస్‌కు దూరమయ్యారు. అయినా జగన్ రెడ్డే మాకు ముఖ్యం అని కేసీఆర్ అండ్ కో అనుకుంటున్నారు. ఇది గమనించిన రేవంత్ రెడ్డి ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిస్తే జగన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో బలపడతారని తెలుగుదేశం ఓటర్లకు నచ్చజెప్పి తన వైపునకు తిప్పుకొన్నారు.

మీడియా అయినా, సోషల్ మీడియా అయినా రాజకీయ పార్టీలకు కొంత నష్టం చేయగలవే గానీ, ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించలేవు. ప్రజలకు అన్నీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డి కూడా సోషల్ మీడియా వారియర్స్‌ను నమ్ముకొని పదకొండు సీట్లకు పరిమితం అయ్యారు. కేటీఆర్ ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కూడా ఫలితాలు ఇంతకు భిన్నంగా ఉంటాయని భావించలేం.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



బంగాళాఖాతంలో అల్పపీడనం

రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తా, సీమకు భారీ వర్షాలు! 2

కొనసాగుతున్న చలి తీవ్రత

అరకులో 7 డిగ్రీల ఉష్ణోగ్రత

హత్య కోణంలోనే దర్యాప్తు

సీఐ సతీశ్ మరణంపై హత్య కేసు నమోదు.. జీఆర్పీ నుంచి తాడిపత్రి డివిజన్‌కు కేసు బదిలీ

పోలీసు, వైద్యాధికారులతో సీఐడీ డీజీ భేటీ

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అయ్యన్నార్

రైలు నుంచి బొమ్మలను తోసి.. 'సీన్ రీకన్‌స్ట్రక్షన్'

గుంతకల్లులో మరో పోలీసు బృందం దర్యాప్తు

ప్రయాణికుల వివరాలు, కాల్ డేటా, ఫుటేజీ పరిశీలన

బోగీలో రక్తపు మరకలు కనిపించాయన్న సిబ్బంది

రేపు ఘటనా స్థలానికి వెళ్లనున్న ఫోరెన్సిక్ వైద్యులు

పత్తికొండలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



అనంతపురం/గుంతకల్లు/గుత్తి/తాడిపత్రి/తిరుపతి/పత్తికొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిని పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సతీశ్ సోదరుడు హరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హత్య కేసు నమోదు చేశారు. శ్రీవారి పరకామణి లెక్కింపు సమయంలో జరిగిన చోరీ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న సతీశ్ కుమార్ మృతిని ప్రభుత్వం, పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యన్నార్

మిగతా 14వ పేజీలో...



ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్

ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెబ్‌సైట్ అడ్మిన్

కూకట్‌పల్లిలో అరెస్టు చేసిన పోలీసులు

అతడి ఖాతాలోని రూ.3 కోట్లు ఫ్రీజ్

పైరసీకి హైఎండ్ టెక్నాలజీ వినియోగం

ఇందుకు హ్యాకర్లకు లక్షల్లో చెల్లింపులు

తమను అడ్డుకోలేరంటూ పోస్టులు 14

పెట్టిన రోజుల వ్యవధిలోనే అదుపులోకి

20న వైవీ విచారణ!

కల్తీ నెయ్యి కేసులో ఇప్పటికే సిట్ నోటీసులు

ఆరోగ్యం సహకరించనందున తిరుపతి రాలేనని సుబ్బారెడ్డి సమాచారం

విచారణకు హైదరాబాద్ వెళ్లనున్న సిట్



2



3

ఐదేళ్ల తర్వాత మళ్లీ సింగపూర్‌కు విమానం

వారంలో 3 రోజుల సర్వీసు

స్మార్ట్‌గా 'ఉగ్ర' కుట్ర!

నిఘా సంస్థలు వాడే టెక్నాలజీతో పరస్పరం మెయిల్ సంభాషణ

ఎవరూ ట్రాక్ చేయకుండా ఎత్తుగడ.. ఫరీదాబాద్‌తో ఉమర్ లింకు బహిర్గతం.. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉగ్ర వేట

హరియాణాలో మరో ముగ్గురు, పంజాబ్, బెంగాల్‌లో చెరొకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు 11



వారణాసి నా డ్రీమ్ ప్రాజెక్ట్

- మహేశ్‌బాబు

సినీ ప్రియులు.. మహేశ్‌బాబు, రాజమౌళి అభిమానులు వేయికళ్లతో ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. వారి కలయికలో రూపొందుతున్న 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. మన ఇతిహాసాల్లో ఎంతో ప్రాముఖ్యం గల చారిత్రక నగరం 'వారణాసి'ని టైటిల్‌గా ఖరారు చేశారు. శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ఈ వేడుకలో టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. మునుపెన్నడూ కనిపించనంత రఫ్, మాస్ లుక్‌లో ఉన్న మహేశ్‌బాబు అభిమానులకు థ్రిల్ ఇచ్చారు. త్రిశూలం పట్టుకుని నందిపై స్వారీ చేస్తూ ఓ భీకర పోరాటానికి సిద్ధమవుతున్న ఆయన లుక్, విజువల్స్, నేపథ్య సంగీతం, రాజమౌళి మేకింగ్ అన్నీ కలసి.. ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న అంచనాలను మరింత పెంచేశాయి. ఇది వరకే విడుదల చేసిన మహేశ్‌బాబు ప్రీ లుక్‌లో మెడకు లాకెట్‌గా చూపించిన నంది, త్రిశూలాన్ని గ్లింప్స్‌లోనూ పరిచయం చేయడంతో అభిమానులు రాజమౌళి విజన్‌కు ఫిదా అయిపోతున్నారు. ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బేనర్‌పై కేఎల్ నారాయణతో రాజమౌళి తనయుడు కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ఈ సినిమాలోని యాక్షన్, మహేశ్ నటననూ చూస్తూ అలాగే ఉండిపోయా. సీజీ లేదు, డబ్బింగ్ లేదు, రీ రికార్డింగ్ లేదు. అయినా నన్ను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. కొన్ని సినిమాలను మనుషులు తెరకెక్కిస్తారు. కానీ ఈ సినిమా మాత్రం దైవ నిర్ణయం. రాజమౌళి గుండెల్లో భగవంతుడు హనుమాన్ ఉండి ఏం చేయాలో చెబుతూ వచ్చాడు. రాముడు వారధి కడితే ఉడతా భక్తిగా కొందరు రాళ్లు ఎలా అందించారో.. అలాగే మాకు ఈ సినిమాలో భాగమయ్యే సదవకాశం, అదృష్టం కలిగాయి' అని పేర్కొన్నారు. కేఎల్ నారాయణ మాట్లాడుతూ '15 ఏళ్ల క్రితం రాజమౌళిగారితో సినిమా చేద్దామని అడిగా. వెంటనే అంగీకరించారు. ఇంత సమయం పడుతుందని ఆయన, నేను అస్సలు అనుకోలేదు. ఈ గ్యాప్‌లో ఆయనకు 'ఈగ' 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి అమోఘమైన హిట్స్ వచ్చాయి. దర్శకుడిగా అంతర్జాతీయ స్థాయికి ఎదిగినా, అప్పుడెలా ఉన్నారో, ఇప్పుడూ అలానే ఉన్నారాయన. ఇది ఆయన గొప్పతనం. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నందుకు రాజమౌళికి కృతజ్ఞతలు' అని తెలిపారు. కార్తికేయ మాట్లాడుతూ 'నిర్మాతగా చిన్న చిన్న సినిమాలు చేసుకుంటూ ఉన్న నాకు ఇంత భారీ ప్రాజెక్ట్ వస్తుంది అని ఊహించలేదు. ఇందులో పనిచేస్తున్న వారంతా లెజెండ్స్. ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించడం నేను చేసుకున్న అదృష్టం. భారతీయ సినిమాను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి.. ప్రపంచ సినీ ప్రేక్షకుల దృష్టిని మనవైపు తిరిగేలా చేస్తున్నాం' అని అన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ 'నా పాతికేళ్ల కెరీర్‌లో ఎన్నో సినిమాలు చేశాను. ఇలాంటి సినిమా చేయలేదు. నేను చూసిన తొలి మహేశ్‌బాబు చిత్రం 'పోకిరి'. కృష్ణగారి వారసత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు' అని



చెప్పారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ 'నన్ను ఇంత గొప్పగా స్వాగతించినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు. రాజమౌళిగారు భారతీయ సినిమాను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి. మీ అందరికీ తెలిసిన మహేశ్‌బాబుకు ఎన్ని ముద్దు పేర్లు, ఎంత మంది అభిమానులు ఉన్నారో నాకు తెలుసు. నాకు తెలుగు పూర్తిగా రాకున్నా.. సినిమా పూర్తయ్యేలోపు నేర్చుకుంటా' అని అన్నారు. అలాగే 'మైండ్‌లో ఫిక్స్ అయితే బ్లైండ్‌గా వెళ్లిపోతా' అనే మహేశ్‌బాబు డైలాగ్ చెప్పి అందర్నీ అలరించారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ 2027 వేసవికి సినిమా విడుదలవుతుందని తెలిపారు. రాజమౌళి మాట్లాడుతూ 'నన్నూ, మహేశ్‌నూ కలిపిన కేఎల్ నారాయణగారికి కృతజ్ఞతలు. ఇలాంటి సినిమా కథను మాటల్లో చెప్పలేను. అందుకే నా ముందు చిత్రాలకు చెప్పినట్లు ముందే ఈ సినిమా కథ చెప్పలేదు. కేవలం ఈ చిత్ర స్థాయిని తెలిపేలా గ్లింప్స్ విడుదల చేశాం. కృష్ణగారు తెలుగు సినిమాకు ఎంతో చేశారు. ఎన్నో కొత్త రకాల సాంకేతికతను పరిచయం చేశారు. ఆయన వారసుడు మహేశ్ నటిస్తున్న ఈ సినిమా ద్వారా తెలుగు సినిమాకు పూర్తి స్థాయి ఐమాక్స్ ఫార్మాట్‌ను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు.

శ్రీరాముడి పాత్రలో మహేశ్

'వారణాసి' చిత్రంలో శ్రీరాముడి పాత్రలో మహేశ్ కనిపించనున్నారని ఈ వేడుకలో రాజమౌళి వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'మహేశ్ కృష్ణుడి పాత్రలో బాగుంటాడని నాకు ఓ నమ్మకం. అయితే ఈ సినిమా కోసం రాముడి గెటప్ వేసి ఫొటో సూట్ చేసినప్పుడు మహేశ్‌ను చూసి మైమరిచిపోయాను. ఆ గెటప్ స్టిల్‌ను నా వాల్ పేపర్‌గా పెట్టుకున్నా. కానీ ఎవరన్నా చూస్తారేమోనని తర్వాత తీసేశాను. శ్రీరాముడికి సంబంధించిన ఎపిసోడ్‌ను 60 రోజుల పాటు తీశాం' అన్నారు రాజమౌళి.

మహేశ్ ఎంట్రీ అదరింది

చివరిగా మహేశ్ మాట్లాడారు. వేదిక దిగువన ఉన్న ఆయన పోస్టర్‌లో ఉన్నట్లుగా అదిరిపోయే లెవల్‌లో ఎద్దును అధిరోహించి వేదిక మీదకు రాగానే ఆయన అభిమానులు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. అభిమానులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'నేను మామూలుగానే వస్తానని చెప్పా. కానీ రాజమౌళిగారు ఇలా స్పెషల్‌గా తీసుకువచ్చారు. నాన్నగారు ఎప్పుడూ చెబుతుండేవారు.. ఒక్క పౌరాణిక చిత్రంలోనైనా చేయరా అని. కానీ ఆయన మాట నేను వినలేదు. ఇప్పుడు పై నుంచి ఆయన నా మాటలు వింటుంటారు. 'వారణాసి' నా డ్రీమ్ ప్రాజెక్ట్. జీవితంలో ఒక్క సారి మాత్రమే వచ్చే ప్రాజెక్ట్. దీనికోసం ఎంత కష్టపడాలో అంతా పడతా. అందరూ గర్వించేలా చేస్తా. 'వారణాసి' చిత్రం చూసి దేశమంతా గర్వపడుతుంది. ఈ రోజు జరిగింది టైటిల్ ప్రకటన మాత్రమే. సినిమా ఎలా ఉంటుందనేది మీ ఊహకే వదిలేస్తున్నా' అన్నారు.

స్మగ్లర్లలో భయం పుట్టిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సాక్ష్యాన్ని చూసినట్లుందని అన్నారు. 'అది ఒక నిశ్శబ్ద శ్మశాన వాటిక. దాదాపు 2.6 లక్షల దుంగలు ఉన్నాయి. ఈ దొంగతనం విలువ రూ.5 వేల కోట్లు ఉండొచ్చు. ఇది రాష్ట్ర ఖజానా నుండి, మన జాతీయ భవిష్యత్ నుంచి నేరుగా దొంగిలించిన సొత్తు. ఇది మన ప్రజలకు చెందిన డబ్బు, రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించాల్సిన సొమ్ము' అని పవన్ పేర్కొన్నారు. 'కొంతమంది అటవీ భూములను అంత సులువుగా ఎలా ఆక్రమించగలరు? గతంలో వ్యవస్థాగతమైన వైఫల్యం, రాజకీయ సంకల్పం లేకపోవడం వల్ల యథేచ్ఛగా ఎర్ర చందనం చెట్ల నరికివేత, అక్రమ రవాణా జరిగింది' అన్నారు. దోషులందరూ చట్టాన్ని, దాన్ని పర్యవసానాలను ఎదుర్కొనే సమయం వచ్చిందని స్పష్టం చేశారు. స్మగ్లర్లు, కింగ్‌పిన్‌లు, ఈ అక్రమ వ్యవహారంలో పాల్గొన్న అందరినీ గుర్తిస్తున్నామని, వారిని అరెస్ట్ చేయడమే కాదు, అటవీ చట్టం కింద వారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటామని, శేషాచలం పవిత్రతను కాపాడతామని పవన్ స్పష్టం చేశారు.

అక్రమార్కుల ఆట కట్టించాలి

శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమార్కుల ఆట కట్టించాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అడవి నుంచి ఒక్క దుంగ కూడా బయటకు పోకుండా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని నిర్దేశించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై శనివారం అటవీ అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. పవన్ మాట్లాడుతూ ఎర్రచందనం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత శాతం ఎర్రచందనం విత్తనాలు చల్లడానికి, ఆ వనాల సంరక్షణకు కేటాయించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. అక్రమ రవాణా కింగ్‌పిన్‌లను చట్టం ముందు నిలిపేందుకు పోలీసు, అటవీ అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2019-24 మధ్య లక్షలాది ఎర్రచందనం చెట్లు నరికి అక్రమంగా తరలించారని పేర్కొన్నారు. ఇక నుంచి ఒక్క దుంగ బయటకు పోకుండా మళ్లీ టాస్క్‌ఫోర్స్‌కు జీవం పోసేలా సీఎంతో మాట్లాడతానని పేర్కొన్నారు.

డ్రోన్లతో నిఘా పెంచాలి

వైసీపీ హయాంలో ఎర్రచందనం సరిహద్దులు దాటినా పట్టించుకోలేదని పవన్ సమీక్షా సమావేశంలో అన్నారు. కర్ణాటకలో రూ.140 కోట్ల ఎర్ర చందనం పట్టుకున్నారని, దీనిపై కేంద్ర అటవీ మంత్రితో చర్చించానని, దేశంలో ఎక్కడ ఎర్రచందనం దుంగలు దొరికినా మనకే చెందేలా ఆదేశాలు ఇప్పించామని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పట్టుబడిన 407 టన్నుల ఎర్రచందనం వెనక్కి తెప్పిస్తున్నామన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల వద్ద థర్మల్ డ్రోన్లతో నిఘా పెంచాలని, చెక్‌పోస్టులు కట్టుదిట్టం చేయాలని, బేస్‌క్యాంప్‌లు, వాచ్ టవర్లలో గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రత్యేక ఇంటెలిజెన్స్ ఏర్పాటు చేసి, అక్రమార్కులకు సహకరించే వారినీ పట్టుకుంటామని స్పష్టం చేశారు.

'ప్లానెట్ కిల్లర్స్'లో శేషాచలం విధ్వంసం!



శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను భారీ ఎత్తున నరికి, అక్రమంగా రవాణా చేసి, అడవిని ఎలా నాశనం చేశారో 'ప్లానెట్ కిల్లర్స్' అనే డాక్యుమెంటరీ కళ్లకు కట్టినట్టు వివరిస్తుందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై రూపొందించిన ప్లానెట్ కిల్లర్స్ డాక్యుమెంటరీపై శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఎర్రచందనం మాఫియా వెనుక ఉన్న అంతర్జాతీయ కింగ్‌పిన్‌లను, శేషాచలంలో జరిగిన క్రూరమైన హింసను, మనం కోల్పోయిన అటవీ అమరవీరులను ఈ డాక్యుమెంటరీ బహిర్గతం చేస్తుంది. ఎర్రచందనం స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో రాజకీయ ముసుగుల వెనుక దాక్కున్న నేరస్థులు సమాజానికి అత్యంత ప్రమాదకరం. స్మగ్లర్లతో సన్నిహిత సంబంధాలు కొనసాగించడం ద్వారా వారు ఎర్ర చందనం అక్రమ రవాణాను తమ రాజకీయ భవిష్యత్‌కు ఇంధనంగా మార్చుకున్నారు. క్రూరమైన విధ్వంసంపై వాస్తవాలను ధైర్యంగా వెలుగులోకి తెచ్చి శేషాచలం అడవిని, దానిలో అంతరించిపోతున్న ఎర్ర చందనం గురించి ప్లానెట్ కిల్లర్స్ డాక్యుమెంటరీలో చూపిన నిర్మాతలకు నా కృతజ్ఞతలు" అని పవన్ పోస్టు చేశారు. కాగా, విశాఖలోని మిత్ర గోడౌన్లో గో మాంసం అక్రమ నిల్వ చేసిన ముఠాల అసలు మూలాలు గుర్తించాలని పోలీసులను పవన్ ఆదేశించారు. ఈ నిల్వల వెనుక ఎవరున్నా ఉపేక్షించవద్దని స్పష్టంచేశారు. ఈ అంశంపై విశాఖ పోలీస్ కమిషనర్ నుంచి వివరాలు తెలుసుకున్నారు.

అది దుష్ప్రచారమే.. నిజం లేదు

శనివారం 'సాక్షి' మీడియాలో ప్రచురితమైన 'జనసేనలో భూమి గోల' అనే వార్తను డిప్యూటీ సీఎం కార్యాలయం ఖండించింది. సురేశ్ అనే వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పేషీలో ఉన్నారని రాశారని, అసలు ఆ పేరుతో పేషీలో ఎవరూ లేరని స్పష్టం చేసింది. సివిల్ వివాదానికి, డిప్యూటీ సీఎం పేషీకి లింక్ పెట్టడం దుష్ప్రచారమేనని పేర్కొంది.

20న వైవీ సుబ్బారెడ్డి విచారణ!

కల్తీ నెయ్యి కేసులో ఇప్పటికే సిట్ నోటీసులు

- ఆరోగ్యం సహకరించనందున తిరుపతి రాలేనన్న సుబ్బారెడ్డి
- విచారణకు హైదరాబాద్ వెళ్లనున్న సిట్



తిరుపతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో దేవస్థానం మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని సిట్ విచారించనుంది. విచారణకు హాజరు కావాల్సిందిగా దర్యాప్తు అధికారులు ఆయనకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. అయితే తిరుపతి రావడానికి తనకు ఆరోగ్యం సహకరించడం లేదంటూ ఆయన సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. దీంతో 20న సిట్ అధికారులు హైదరాబాద్ వెళ్లి అక్కడే ఆయనను విచారించనున్నట్టు సమాచారం. కల్తీనెయ్యి కేసులో దర్యాప్తు మొదలయ్యాక గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులను ఇప్పటి దాకా విచారించలేదు. టీటీడీకి నెయ్యి ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? కల్తీ ఎక్కడ జరిగింది? కల్తీ ఎలా చేశారు? అన్న కోణంలోనే విచారణ కొనసాగింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసిన డెయిరీపైనే దర్యాప్తు బృందం దృష్టి కేంద్రీకరించింది. ఇప్పుడు దర్యాప్తు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో కీలక వ్యక్తులను విచారించడంపై సిట్ దృష్టి సారించింది. నెయ్యి సరఫరాకు సంబంధించి ఎలా నిర్ణయాలు తీసుకున్నారు? ఎవరు తీసుకున్నారు? వాటిని అమలు చేసిన అధికారులు ఎవరు? అన్న అంశాలపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో ఎక్కువ కాలం పాటు టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డికి నోటీసులు జారీ చేసింది. వాస్తవానికి కల్తీ నెయ్యి కేసులో 6నెలలకు పైగా సిట్ ఆయనపై దృష్టి పెట్టింది. లోతుగా ఆరా తీస్తే భోలేబాబా డెయిరీ డైరెక్టర్లతో ఆయన పీఏ కడూరు చిన్న అప్పన్న మంతనాలు సాగించినట్టు, ఆర్థిక లావాదేవీలు నడిపినట్టు వెల్లడైంది. అతడిని రెండుసార్లు విచారించిన సిట్ గత నెల 29న అరెస్టు చేసి రిమాండుకు పంపింది. 20న సిట్ సుబ్బారెడ్డిని ప్రశ్నించే అవకాశం ఉండడంతో దర్యాప్తు కీలక మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెయ్యి సేకరణకు టెండరు నిబంధనలు సడలించడం దగ్గర నుంచీ కల్తీ నెయ్యి గురించి తెలిశాక కూడా సరఫరా కొనసాగించడం వరకూ గత ప్రభుత్వంలో టీటీడీ తీసుకున్న కీలక నిర్ణయాలలో వైవీ పాత్ర ఎంతవరకూ ఉందనే విషయంపై సిట్ ప్రశ్నించే అవకాశముంది. అలాగే బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వడానికి అభ్యంతరం వ్యక్తం చేస్తుండడం, పీఏ చిన్న అప్పన్న బ్యాంకు ఖాతాల్లో భారీ మొత్తాలు డిపాజిట్ కావడం వంటి వాటిపై కూడా ఆయన ప్రశ్నలు ఎదుర్కొనే ఆస్కారముంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రేపు, ఎల్లుండి దక్షిణ కోస్తా, సీమకు భారీ వర్షాలు!
- కొనసాగుతున్న చలి తీవ్రత.. అరకులో 7 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపాన నైరుతి బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి తమిళనాడు వైపు వెళ్లనుంది. దీని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమ వైపు వీస్తున్నాయి. ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయి. సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతి భారీ, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, 18వ తేదీన నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. వాయవ్య భారతం నుంచి గాలులు కోస్తా, రాయలసీమ వరకు వీస్తుండడంతో శనివారం చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అరకులోయలో 7, డుంబ్రిగుడలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, అల్పపీడనం రాగల 24గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, ఈనెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 24-27 తేదీల మధ్య కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.



సత్యసాయి మహా సమాధికి నమస్కరిస్తున్న చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్

సత్యసాయి మార్గంలో పయనించాలి

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- మహా సమాధిని దర్శించుకున్న చీఫ్ జస్టిస్ గవాయ్



పుట్టపర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవ, ప్రేమ మార్గంలో పయనించి దేశ నిర్మాతలుగా ఎదగాలని యువతకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి శతజయంతి వేడుకలకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. కరువు ప్రాంతానికి సత్యసాయి ఎనలేని సేవలు అందించారన్నారు. సత్యసాయి బోధించిన 'అందరినీ ప్రేమించు-అందరినీ సేవించు', 'అందరికీ సహాయం చేయి.. ఎవరినీ బాధపెట్టకు' సూత్రాలను పాటించాలని కోరారు. సత్యసాయి అతి ఖరీదైన వైద్యాన్ని అందరికీ ఉచితంగా అందించారని అన్నారు. ప్రపంచ శాంతి వేదికగా ప్రశాంతి నిలయం పేరొందిందంటూ.. ట్రస్టు సేవలను ప్రశంసించారు. అనంతరం ఆయనను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఘనంగా సన్మానించారు. కాగా.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ శనివారం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించారు. ప్రధాన న్యాయమూర్తి దంపతులను ఆర్‌జే రత్నాకర్ సత్కరించారు.

18న టీటీడీ బోర్డు అత్యవసర సమావేశం

తిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం ఈ నెల 18న జరుగనుంది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. మంగళవారం ఉదయం చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో సభ్యులందరూ తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశం కానున్నారు. దీనికి సంబంధించి అజెండా అంశాలను రూపొందించే పనిలో బోర్డు సెల్ అధికారులు నిమగ్నమయ్యారు.

సైబర్ దొంగల్లా లిక్కర్ ముఠా!

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా ఆపేయడం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో మనీ రూటింగ్ అచ్చం ఇలానే జరిగింది. మద్యం ముడుపుల్లో 77.55 కోట్లను మళ్లించి వైట్‌మనీగా మార్చుకున్నారు. మద్యం వ్యాపారుల నుంచి ప్రతి నెలా రూ.60 కోట్లు వసూలు చేసిన లిక్కర్ సిండికేట్.. అందులో పలు దఫాలు కోట్లాది రూపాయలను వైట్‌మనీగా మార్చుకోవడానికి నాలుగు డొల్ల కంపెనీల ఖాతాల్లోకి జమ చేసింది. ఆ తర్వాత అడ్రస్‌లేని 32 ఖాతాల్లోకి బదిలీ చేసి వైట్‌మనీగా విత్ డ్రా చేసుకుంది. గత ప్రభుత్వ పెద్దలకు ఆ డబ్బులు చేర్చిన తర్వాత ఆ ఖాతాల్లో లావాదేవీలు ఆగిపోయాయి. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ఐదు నెలల పాటు లాగిన తీగతో ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి(ఏ-1)తో వ్యవహారం నడిపిన ముంబై వాసి అనిల్ చోఖ్రా (ఏ-49)ను సిట్ అధికారులు అరెస్టు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్టులో ముడుపుల బదిలీ వ్యవహారాన్ని పేర్కొన్నారు.



విజయవాడ జైలు వద్ద మద్యం కేసు నిందితుడు అనిల్ చోఖ్రా

రాజ్ కసిరెడ్డి స్కెచ్

గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంలో డిస్టిలరీల నుంచి కమీషన్లు వసూలు చేసేందుకు అప్పటి సీఎం జగన్‌కు ఐటీ సలహాదారుగా వ్యవహరించిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి) పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశాడు. ముడుపుల సొమ్మును వివిధ మార్గాల్లో వైట్‌మనీగా మార్చేందుకు ముంబైకి చెందిన దళారీ అనిల్ చోఖ్రాను సంప్రదించాడు. అప్పటికే రెండు ఆర్థిక నేరాల కేసుల్లో చోఖ్రా నిందితుడు. మరో మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపగా బెయిలుపై బయట ఉన్నాడు. దేశంలోని పలు ప్రాంతాల్లో పేదలు, నిరక్షరాస్యుల ఆధార్, పాన్‌కార్డులు తీసుకుని షెల్ కంపెనీలు సృష్టించి మనీ లాండరింగ్ చేయడంలో అనిల్ చోఖ్రా సిద్ధహస్తుడు. అనిల్ చోఖ్రాతో రాజ్ కసిరెడ్డి చేసుకున్న ఒప్పందం ప్రకారం.. మూడు డిస్టిలరీల నుంచి కోట్లాది రూపాయల సొమ్మును అనిల్ చెప్పిన నాలుగు డొల్ల కంపెనీల ఖాతాల్లోకి బదిలీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అత్యధిక జే బ్రాండ్ లిక్కర్ సరఫరా చేసిన రాజ్ కసిరెడ్డి బినామీ కంపెనీలైన అదాన్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా నుంచి రూ.18.20 కోట్లు, ఎస్‌పీవై ఆగ్రో డిస్టిలరీస్ నుంచి రూ.39 కోట్లు, లీలా డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతా నుంచి రూ.20.28 కోట్లు.. పలు దఫాల్లో మొత్తం రూ.77.55 కోట్లు చోఖ్రా సూచించిన నాలుగు ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఓల్విక్ మల్టీవెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, క్రిపటి ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, నైసనా మల్టీ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశాల్ ఎంటర్ ప్రైజెస్ ఖాతాల్లోకి చేర్చారు. ఆ మొత్తాన్ని పలు దఫాలుగా 32 అడ్రస్ లేని వ్యాపారాల ఖాతాల్లోకి మళ్లించారు. మొత్తం నగదు రూపంలో విత్ డ్రా చేసిన కోట్లాది రూపాయల నగదును గత ప్రభుత్వంలోని పెద్దలకు చేర్చిన తర్వాత బ్యాంకు అకౌంట్లు మూసేశారు.

చోఖ్రా సిమ్‌లు.. అన్నీ ఆఫ్‌లోనే

మద్యం కుంభకోణంలో ముడుపులు వసూలు చేసిన రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ పదుల సంఖ్యలో సిమ్ కార్డులు వాడింది. రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఆ సిమ్ కార్డులన్నీ పడేసింది. ముంబైకి చెందిన దళారీ అనిల్ చోఖ్రా కూడా పదుల సంఖ్యలో సిమ్‌కార్డులు వినియోగించాడు. డొల్ల కంపెనీలకు ఇచ్చిన నంబర్లన్నీ చోఖ్రాకు సంబంధించినవేనని సిట్ గుర్తించింది. 2015లో కనికా జెమ్స్ పేరిట ఓ బ్యాంకు నుంచి రూ.304 కోట్లు రుణం పొందిన కేసులో ఆయన్ను ఈడీ అరెస్టు చేసింది. అంతకుముందు 2013లో రూ.24 కోట్ల జీఎస్టీ మోసం కేసులో, 2016లో మరో ఆర్థిక నేరంలో ఎకనామిక్ అఫెన్స్ వింగ్ పోలీసులు చోఖ్రాపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అప్పటి నుంచి కొత్తకొత్త సిమ్‌లు వాడుతూ పని పూర్తికాగానే వాటిని పడేసి జాగ్రత్తలు తీసుకునేవాడు. ఏపీ మద్యం ముడుపుల సొమ్మును వైట్‌మనీగా మార్చిన తర్వాత ఆ వ్యవహారానికి సంబంధించి వాడిన సిమ్‌కార్డులన్నీ ఆగిపోయాయి. సిట్ దర్యాప్తులో లభించిన రూ.221 కోట్లకు సంబంధించిన పలు వ్యాపార ఇన్వాయిస్‌లపై ఉన్న నంబర్లు ఏవీ ఇప్పుడు మనుగడలో లేవని అధికారులు గుర్తించారు. నకిలీ ఇన్వాయిస్‌లు, ఈ-వే బిల్లుల్లో పేర్కొన్న దుస్తులు ఇతరత్రా గూడ్స్ రవాణా అయినట్లు రికార్డుల్లో లేదు. టోల్ గేట్లలోనూ ఆయా వాహనాలు దాటి వెళ్లినట్లు సీసీ ఫుటేజీ రికార్డులు లేవు.

చిరునామా లేని వ్యాపారాలు

లిక్కర్ స్కామ్ దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు డిస్టిలరీల యజమానుల్ని మొదట్లో ప్రశ్నించారు. ముడుపుల సొమ్ము హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో లిక్కర్ మాఫియాకు నగదు రూపంలో ఇవ్వడంతో పాటు ముంబైలోని బులియన్ ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై ఆరా తీయగా నాలుగు డొల్ల ఖాతాల్లోకి అదానీ, ఎస్పీవై, లీలా డిస్టిలరీల నుంచి రూ.77.55 కోట్లు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి. లోతుగా విచారించగా అనిల్ చోఖ్రా పాత్ర బయటపడింది. ముంబైలో మనీ లాండరింగ్ చేసే చోఖ్రా ఏపీ మద్యం ముడుపుల్ని వైట్‌మనీగా మార్చేలా ఒప్పందం చేసుకున్నట్లు తేలింది. అందుకు ఉపయోగించిన 32 వ్యాపార అడ్రస్‌లు వెతుక్కొని వెళ్లిన సిట్ అధికారులు 25 చిరునామాల్ని గుర్తించారు. ఆ అడ్రస్‌లలో అటువంటి కంపెనీల్లేవని, అలాంటి పేర్లు కూడా ఎన్నడూ వినలేదని ఆ భవనాల యజమానులు చెప్పారు. ఈ కంపెనీల సృష్టి, బ్యాంకుల్లో ఖాతాలన్నీ నల్లధనం మార్పిడి కోసమేనని సిట్‌కు పూర్తి స్పష్టత వచ్చింది.

21 వరకు చోఖ్రాకు రిమాండ్

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ-49 నిందితుడు అనిల్ చోఖ్రాకు ఈ నెల 21 వరకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం అతడిని విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. చోఖ్రాను ముంబైలో సిట్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతడిని ముందుగా అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చారు. శనివారం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

భుజాలు తడుముకుంటున్నారెందుకు?

- సాక్షులను చంపడం వైసీపీకి అలవాటే
- సతీశ్‌కుమార్ హత్యపై నీలాయపాలెం విమర్శలు

తిరుపతి/అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో ఫిర్యాదుదారుడు, టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్‌కుమార్ హత్య కేసులో వైసీపీ నాయకులు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారో చెప్పాలని బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'శుక్రవారం మధ్యాహ్నం 11 గంటలకు సతీశ్‌కుమార్ మరణవార్త బయటకు వచ్చిన వెంటనే వైసీపీ నాయకులు ఆ పార్టీ ఎక్స్ ఖాతాలో ఆత్మహత్యగా పేర్కొన్నారు. పరకామణి కేసు నిందితుడు రవికుమార్‌తో సతీశ్‌కుమార్ రాజీ చేసుకోవడంలో అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్‌గా ప్రముఖ పాత్ర పోషించిన కరుణాకరరెడ్డి.. ఆ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించి సాయంత్రం 4 గంటలకు ఉపన్యాసం ఇచ్చారు. భూమన ప్రెస్‌మీట్‌కు ముందు కనీసం సతీశ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం కూడా కాలేదు. దాని తర్వాత సతీశ్‌కుమార్‌ను హత్య చేశారని పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ప్రకటించారు. దీనికన్నా ముందే ఆత్మహత్యగా పేర్కొన్న కరుణాకరరెడ్డి చర్యలు అనుమానం కలిగిస్తున్నాయి. పరకామణి కేసులో వీరి బాగోతం వెనుక ఎంత కథ లేకుంటే సతీశ్‌కుమార్‌ను హత్య చేస్తారు? సాక్షులను హత మార్చడం వైసీపీ నాయకులకు, అప్పటి కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదు. నిందితుడు రవికుమార్ నుంచి అప్పటి బోర్డు పెద్దలు ఎంత ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు? కేసు మాఫీ చేయడానికి ఎందుకు అంత ఉత్సాహం చూపారు? ఇవన్నీ బయటకు రాకూడదనే సతీశ్‌కుమార్‌ను హత్య చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిందితుడు రవికుమార్‌ను తక్షణం సిట్ అదుపులోకి తీసుకోవాలి. అప్పటి ఈవో ధర్మారెడ్డికి కూడా రక్షణ కల్పించాలి. ధర్మారెడ్డికి కేవలం పరకామణి, కల్తీ నెయ్యి కేసులే కాదు...ఆయన జమానాలో జరిగిన ప్రతి అవినీతి, అక్రమాల్లోనూ పాత్ర ఉంది' అని పేర్కొన్నారు. సతీశ్‌కుమార్‌కు ఎన్ని రహస్యాలు తెలిసి ఉండకపోతే అతన్ని అంత దారుణంగా చంపేస్తారనే అనుమానం ప్రజల్లో ఉందన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రవికుమార్‌ను సిట్ అదుపులోకి తీసుకోవాలని, అతని ప్రాణాలకు రక్షణ కల్పించాలని విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. టీటీడీ ఈవోగా చేసిన ధర్మారెడ్డి అప్రూవర్‌గా మారే అవకాశం ఉండటంతో ఆయన ప్రాణాలకూ ముప్పు పొంచి ఉందన్న ఆందోళనను విజయ్‌కుమార్ వ్యక్తం చేశారు.

నాకూ ప్రాణహాని.. రక్షణ కల్పించండి!

- 'పరకామణి' రాజీపై హైకోర్టులో పిటిషన్ వేసిన శ్రీనివాసులు విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'పరకామణి' కేసులో సూత్రధారుల నుంచి తనకూ ప్రాణహాని ఉందని తిరుపతికి చెందిన మాచర్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ చోరీ కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకోవడంపై ఆయన హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో సీఐడీ విచారణ మొదలైన విషయం తెలిసిందే. పరకామణి కేసు ఫిర్యాదుదారుడు, అప్పటి టీటీడీ ఏవీఎస్వో సతీశ్‌కుమార్ మృతిచెందిన నేపథ్యంలో తనకూ భద్రత కల్పించాలని శనివారం ఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినట్లు శ్రీనివాసులు తెలిపారు. తక్షణం తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించి ఆదుకోవాలని కోరారు.

సతీశ్‌కుమార్‌ది ముమ్మాటికీ హత్యే: వర్ల రామయ్య

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసు ఫిర్యాది సతీశ్‌కుమార్‌ది ముమ్మాటికీ హత్యేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సతీశ్ మృతిపై వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో ఆత్మహత్య అని పేర్కొనడం, భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఆత్మహత్య అనే విధంగా మాట్లాడటంపై అనుమానాలు ఉన్నాయన్నారు. గుమ్మడికాయ దొంగలు భుజాలు తడుముకున్నట్టుగా ఉందని విమర్శించారు. వివేకానందరెడ్డి హత్య సమయంలోనూ తొలుత గుండెపోటు అని ప్రచారం చేసింది జగన్ మీడియానేనన్నారు. వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతాను ఎవరు ఆపరేట్ చేస్తున్నారు? ఎవరు పెట్టమంటే ఆ పోస్టు పెట్టారో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



గన్నవరం విమానాశ్రయంలో ప్రయాణికుడికి బోర్డింగ్ పాస్ అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఐదేళ్ల తర్వాత మళ్లీ సింగపూర్‌కు విమానం

- వారంలో 3 రోజుల సర్వీసు.. ప్రయాణికుల హర్షం, సీఎంకు కృతజ్ఞతలు

గన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగపూర్‌కు విమాన సర్వీస్ పునఃప్రారంభమైంది. గత టీడీపీ హయాంలో సింగపూర్‌కు సర్వీస్ ఉండేది. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ సర్వీసును రద్దు చేశారు. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ సింగపూర్ సర్వీసు ప్రారంభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. శనివారం సింగపూర్‌కు ఇండిగో విమాన సర్వీసును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించి పలువురు ప్రయాణికులకు బోర్డింగ్ పాస్ అందించారు. మంగళ, గురు, శనివారాల్లో ఈ విమానం ఉదయం 7.30కు వచ్చి 10.30కి బయలుదేరి సింగపూర్ వెళుతుంది. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు పలువురు విమాన ప్రయాణికులు ధన్యవాదాలు తెలిపారు.

కామన్‌వెల్త్, యూఎన్‌వో సమావేశాల్లో భాగస్వామ్యం అరుదైన గౌరవం: ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కామన్‌వెల్త్, ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో పాల్గొనడం తనకు దక్కిన అరుదైన గౌరవాలు అని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కామన్‌వెల్త్ సమావేశాల్లో మహిళా సాధికారత గురించి వివరించానని తెలిపారు. తాజాగా ఐక్యరాజ్య సమితి సమావేశాలకు వెళ్లిన బృందానికి నాయకత్వం వహించడం, జనరల్ అసెంబ్లీలో అణుశక్తి గురించి మాట్లాడడం ఆనందంగా ఉందని అన్నారు. అణుశక్తిని వినాశనానికి కాకుండా ప్రజాహితానికి ఎలా వినియోగించుకోవాలో ఈ సమావేశాల్లో వివరించినట్టు చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 200 స్థానాలకు పైగా గెల్చుకోవడంపై పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. సుపరిపాలనకు, అభివృద్ధి, సంక్షేమానికి బిహార్ ప్రజలు స్పష్టమైన సంకేతం ఇచ్చారని తెలిపారు. మొంథా తుఫాను కారణంగా వరి, మినుము పంటల నష్టంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో మాట్లాడానని, అలాగే రంగు మారిన ధాన్యం కొనుగోలు విషయంలో వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్టు వెల్లడించారు.

మహిళలను దురుద్దేశంతో తాకితేనే 'సెక్షన్ 354'

- ఘర్షణలో అనుకోకుండా తాకడం అవమానించినట్లు కాదు
- నలుగురు యువకులను నిర్దోషులుగా ప్రకటిస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు హైకోర్టు సమర్థన

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఘర్షణ సమయంలో అనుకోకుండా మహిళలను తాకడం లేదా నెట్టడం వంటి చర్యలను వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించే చర్యగా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. మహిళను తాకడం వెనుక నిందితుడికి దురుద్దేశం ఉందని నిరూపితమైనప్పుడే ఐపీసీ సెక్షన్ 354(మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం) వర్తిస్తుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 'ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు పోలీసులు నమోదు చేసిన కేసులో నలుగురు యువకులను నిర్దోషులుగా ప్రకటిస్తూ ఒంగోలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి 2006లో ఇచ్చిన తీర్పును సమర్థించింది. తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. వివరాలివీ.. ప్రకాశంజిల్లా, ఎన్‌జీ పాడులో 2005 జూన్ 16న రాత్రి 8.30 గంటలకు నలుగురు యువకులు మద్యం మత్తులో ఒంగోలు- చీరాల రోడ్డులో వాహనరాకపోకలకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఎన్‌జీ పాడు రాణా హోంగార్డు మస్తాన్‌వలీ అక్కడికి వెళ్లారు. వారిని నియంత్రించే క్రమంలో యువకులకు హోంగార్డుకు మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న హోంగార్డు తల్లి కూడా తోపులాటలో కింద పడిపోయారు. దీంతో విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం, మహిళల ఆత్మగౌరవం దెబ్బతీయడం వంటి సెక్షన్ల కింద పోలీసులు ఆ యువకులపై కేసు పెట్టారు. అనంతరం దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన ఒంగోలు అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఆ నలుగురు యువకులనూ నిర్దోషులుగా ప్రకటిస్తూ 2006లో తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు 2009లో హైకోర్టులో అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి.. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని తేల్చిచెప్పారు. రికార్డులను పరిశీలిస్తే ఘటన అకస్మాత్తుగా జరిగినట్లు స్పష్టమవుతోందని, ఎవరికీ గాయాలు కూడా కాలేదని పేర్కొంది. నేర నిరూపణకు ప్రాసిక్యూషన్ హాజరుపర్చిన ప్రధాన సాక్షులందరూ కోర్టులో మాట మార్చారని గుర్తు చేసింది. 'క్రిమినల్ కేసు విచారణలో అనుమానం ఎంత బలంగా ఉన్నప్పటికీ దానిని రుజువుగా పరిగణించడానికి వీల్లేదు. ఎలాంటి సందేహాలకూ తావులేకుండా సాక్ష్యాధారాలను సమర్పించి నేరాన్ని నిరూపించాల్సిన బాధ్యత పోలీసులదే. నిందితుడి ప్రమేయంపై ఏ చిన్నపాటి అనుమానం ఉన్నా అతడిని దోషిగా ప్రకటించడానికి వీల్లేదు. బదులుగా అతడిని నిర్దోషిగా ప్రకటించడమే సరైనది. సెషన్స్ కోర్టు సాక్ష్యాధారాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి నిర్ణయం వెల్లడించిన తర్వాత ఆ తీర్పు అసమంజసం, అన్యాయమైతే తప్ప జోక్యం చేసుకొనే అధికారం అప్పీల్ కోర్టుకు లేదు' అని హైకోర్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు.

తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్

- ఐదు రోజులుగా ఓపెన్ చేస్తుంటే సమస్యలు
- పీడీఎఫ్ ఫైల్స్ అప్‌లోడ్ చేస్తుంటే బెట్టింగ్ యాప్ ఓపెన్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హైకోర్టు ఐటీ రిజిస్ట్రార్

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌ను గుర్తు తెలియని దుండగులు హ్యాక్ చేయడం కలకలం సృష్టించింది. గత ఐదు రోజులుగా వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయడంలో సమస్యలు ఎదురవుతుండటంతో పాటు 'బీడీజీ స్లాట్' అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ఓపెన్ అవుతుండటంతో హ్యాక్ అయినట్లు గుర్తించారు. హైకోర్టు వెబ్‌సైట్‌లో ఉండే పీడీఎఫ్ ఫైల్స్‌కు దుండగులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో అనుసంధానం చేశారు. ఈనెల 10న కోర్టు తీర్పుల పీడీఎఫ్ ఫైల్స్‌ను అప్‌లోడ్ చేస్తుండగా బెట్టింగ్ సైట్ ఓపెన్ అవుతుండటంతో హైకోర్టు రిజిస్ట్రార్ (ఐటీ విభాగం) టి.వెంకటేశ్వరరావు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే సైబర్ క్రైం పోలీసులు ఐటీ చట్టం, బీఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి హ్యాకింగ్ పాల్పడిన దుండగులను గుర్తించే పనిలో పడ్డారు. ఇటు అక్రమంగా హైకోర్టు ఫైల్స్‌ను యాక్సెస్ చేసిన ఘటనపై అధికారిక వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) సైతం విచారణ చేపట్టింది. ఎన్‌ఐసీ నుంచి వివరాలు అందితే హ్యాకింగ్‌కు సంబంధించి మరింత స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు. హ్యాకింగ్ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరించేందుకు సైబర్ క్రైం పోలీసులు హైకోర్టును సందర్శించారు.

డాక్టర్, టెక్నీషియన్లే సూత్రధారులు

కిడ్నీ ర్యాకెట్ కేసులో వీడిన మిస్టరీ డీసీహెచ్‌ఎస్ సహా ఆరుగురి అరెస్టు

- 6 సెల్‌ఫోన్లు స్వాధీనం.. డాక్టర్ పరార్
- మరో ఎనిమిది మంది పాత్ర గుర్తింపు
- 'గ్లోబల్'లో ఒకేరోజు ఇద్దరికి కిడ్నీ మార్పిడి
- విశాఖకు చెందిన మహిళ యమున మృతి
- వివరాలు వెల్లడించిన మదనపల్లె డీఎస్పీ



కిడ్నీ మార్పిడి కేసులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మదనపల్లె డీఎస్పీ మహేందర్, ఇతర పోలీసులు. చిత్రంలో నిందితులు(ముసుగు)

మదనపల్లె, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగుచూసిన కిడ్నీ రాకెట్ కేసులో మిస్టరీ వీడింది. డయాలసిస్ కేంద్రాల్లో పనిచేసే ఇద్దరు మేనేజర్లు, విశాఖ ప్రాంతానికి చెందిన ఇద్దరు మధ్యవర్తులతో అన్నమయ్య జిల్లా డీఎసీహెచ్‌ఎస్, బెంగళూరుకు చెందిన కిడ్నీ మార్పిడి డాక్టర్లు దీనిలో కీలకపాత్ర పోషించినట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మంది నిందితులను గుర్తించారు. ఈ కేసులో కీలకంగా మారిన బెంగళూరుకు చెందిన వైద్యుడు పరారీలో ఉన్నారు. ఈ కిడ్నీ రాకెట్ ముఠా కేసుకు సంబంధించిన వివరాలను మదనపల్లె డీఎస్పీ మహేందర్.. శనివారం మీడియాకు వివరించారు.

డబ్బు ఆశ చూపి..

విశాఖపట్నానికి చెందిన ఎస్. యమున(29) ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ విషయాన్ని గ్రహించిన అదే ప్రాంతానికి చెందిన పిల్లి పద్మ, సత్య కిడ్నీ ఇస్తే డబ్బులు వస్తాయని ఆశ చూపారు. ఇదే విషయాన్ని యమునతో సహజీవనం చేస్తున్న సూరిబాబుకు కూడా చెప్పారు. ఈ ముగ్గురూ కలసి యమున కిడ్నీ ఇచ్చేలా ఒప్పించారు. అనంతరం.. మదనపల్లె, సత్యసాయి జిల్లా కదిరి డయాలసిస్ కేంద్రాల్లో మేనేజర్లుగా పనిచేస్తున్న బాల రంగడు అలియాస్ బాలు, మోహరాజ్‌లను పద్మ, సత్యను సంప్రదించారు. వారి సూచన మేరకు యమునను మదనపల్లెకు తీసుకొచ్చి గ్లోబల్ ఆసుపత్రి యజమాని, డీసీహెచ్‌ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె. ఆంజనేయులును సంప్రదించారు. ఈ నెల 9న గ్లోబల్ ఆసుపత్రిలో యమునను చేర్చారు. అప్పటికే బెంగళూరు నుంచి వచ్చిన కిడ్నీ ఆపరేషన్ స్పెషలిస్టు, ఇద్దరు సాంకేతిక సిబ్బందితో కలిసి గ్లోబల్ ఆసుపత్రిలో ఒక డోనర్ నుంచి కిడ్నీ తొలగించి, రిసీవర్‌కు ఆపరేషన్ చేశారు. అదే రోజురాత్రి యమున నుంచి కిడ్నీ తొలగించి మరో రిసీవర్‌కు సర్జరీ చేశారు. తర్వాత యమున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పదో తేదీ ఉదయం మృతి చెందారు. కిడ్నీ ముఠా బృందం యమున మృతదేహాన్ని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ పోస్టుమార్టానికి సరైన వసతులు లేకపోవడంతో తిరిగి తిరుపతి రుయాకు తరలించి ప్రక్రియ పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

ఇతర రాష్ట్రాలకు బృందాలు

యమున తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. గ్లోబల్ ఆసుపత్రి యజమాని డాక్టర్ కె. ఆంజనేయులు, డయాలసిస్ కేంద్రాల మేనేజర్లు బాలరంగడు, మోహరాజ్, మధ్యవర్తులు పిల్లి పద్మ, సత్య సహా యమున వెంట వచ్చిన సూరిబాబులను అరెస్టు చేశారు. ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన బెంగళూరు వైద్యుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇదే కేసులో మరో ఎనిమిది నిందితులను గుర్తించామని, వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. వీరిలో మొదటి రిసీవర్‌కు కిడ్నీ ఇచ్చిన వ్యక్తి, ఇద్దరు కిడ్నీ రిసీవర్లు, బెంగళూరు డాక్టర్‌కు సహకరించిన ఇద్దరు టెక్నీషియన్లు, యమున మృతదేహాన్ని తిరుపతి, మదనపల్లెకు తరలించిన అంబులెన్స్ డ్రైవర్‌తో సహా మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసును ఛేదించడానికి 4 ప్రత్యేక బృందాలను నియమించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ బృందాలు ఏపీ, గోవా, కర్ణాటక, తెలంగాణలో నిందితులకోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కిడ్నీ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.

పాస్‌పోర్ట్ ఉన్నంత మాత్రాన నిందితులు దేశం వీడలేరు

- విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే..
- ధర్మాన పాస్‌పోర్ట్ రెన్యువల్‌కు సీబీఐ కోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ ఉన్నంత మాత్రాన నిందితులు దేశం విడిచి వెళ్లిపోవచ్చని అర్థం కాదని నాంపల్లి సీబీఐ కోర్టు వ్యాఖ్యానించింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ నిందితులు విదేశాలకు వెళ్లాలంటే ప్రత్యేక అప్లికేషన్ దాఖలు చేసి కోర్టు అనుమతి తీసుకోవాలని.. అప్పుడే విదేశాలకు వెళ్లగలరని స్పష్టం చేసింది. ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఒక నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు పాస్‌పోర్ట్‌ను పదేళ్లకు కాకుండా ఐదేళ్ల పాటు రెన్యువల్ చేయాలని హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్ట్ అథారిటీకి సీబీఐ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తన పాస్‌పోర్ట్ రెన్యువల్ చేయడానికి అధికారులు తిరస్కరిస్తున్నారని.. అక్రమాస్తుల కేసులో తాను అరెస్ట్ లేదా జ్యుడీషియల్ రిమాండ్‌కు వెళ్లలేదని ధర్మాన సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను విదేశాలకు వెళ్లకుండా ఎలాంటి నిషేధం లేదని.. తన పాస్‌పోర్ట్‌ను కూడా దర్యాప్తు అధికారులు సీజ్ చేయలేదన్నారు. వాదనలు విన్న కోర్టు.. పాస్‌పోర్ట్ రెన్యువల్ చేసుకున్నంత మాత్రాన నిందితుడు ముందస్తు అనుమతి లేకుండా దేశం వీడలేరని తేల్చి చెప్పింది. ధర్మాన పాస్‌పోర్ట్‌ను ఐదేళ్లకు రెన్యువల్ చేయాలని.. ఆ తర్వాత ఆ పాస్‌పోర్ట్‌ను తమ ఎదుట డిపాజిట్ చేయాలని ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టి.రఘురాం ఆదేశించారు.

అమరావతిలో బేసిల్ వుడ్స్ స్కూల్

- ఇస్కాన్ బెంగళూరుతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం

మంగళగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో బేసిల్ వుడ్స్ స్కూల్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ప్రపంచ స్థాయి పాఠశాల స్థాపన కోసం ఏపీ ప్రభుత్వం, ఇస్కాన్ బెంగళూరు బృందం మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం నాలుగు ఎకరాల భూమిని కేటాయించింది. ఈ మేరకు ఎంవోయూ పత్రాలను టచ్ స్టోన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వంశీధర దాస.. రాష్ట్ర మంత్రి నారాయణ నుంచి అందుకున్నారు. బేసిల్ వుడ్స్ స్కూల్స్ భారతీయ సంప్రదాయ విలువలతోపాటు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విలువ ఆధారిత విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తాయని వంశీధర దాస తెలిపారు. బహుభాషా నైపుణ్యం, భారతీయ జ్ఞాన వ్యవస్థలను అంతర్జాతీయ పాఠ్యక్రమాలతో మిళితం చేయడం, జీవిత నైపుణ్యాలు, విద్యార్థుల సహజ ప్రతిభను అభివృద్ధి చేసేలా బోధన ఉంటుందని చెప్పారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

- శాసనమండలి సభ్యుడు బొర్రా గోపి..
- ఒంగోలులో ప్రారంభమైన మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 15వ రాష్ట్ర మహాసభలు



ఒంగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమరశీల పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని శాసనమండలి సభ్యుడు బొర్రా గోపి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) 15వ రాష్ట్ర మహాసభలు శనివారం ఒంగోలులో ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్త మార్కెట్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం అధ్యక్షత వహించారు. గోపి మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా ఉద్యోగ, కార్మిక, కర్షకుల జీవితాల్లో మార్పులు రావడం లేదన్నారు. మహాసభల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన యూనియన్ నాయకులు, కార్మికులు ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

•ఆర్కే RK

నిజానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ ఇప్పటికిప్పుడు వచ్చే గుణాత్మకమైన మార్పులు ఏమీ ఉండవు. అయితే రేవంత్‌రెడ్డికి మాత్రం ఈ విజయం ఎంతో ముఖ్యం. తాను బలహీన ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేస్తున్న వారికి దీటైన జవాబు చెప్పే అవకాశం ఆయనకు లభించింది. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రాజకీయాలలో మరింత ఎత్తుకు ఎదగడానికి ఆయనకు ఈ విజయం అవసరం. పార్టీలోనే ఒక వర్గం ఆశలు వదులుకున్న సీటును భారీ మెజారిటీతో గెలుచుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం వద్ద కూడా ముఖ్యమంత్రి ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా పార్టీ అధిష్ఠానం ఇష్టపడటం లేదన్న ప్రచారం నిజమే అనుకుందాం. ఈ ఫలితం తర్వాత పార్టీ అధిష్ఠానం రేవంత్‌రెడ్డిని కాదనుకోగలదా? ఒక్క మాటలో చెప్పాలంటే రేవంత్‌రెడ్డి నాయకత్వానికి ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఇప్పట్లో తిరుగుండదు.

రేవంత్ కా కమాల్!



"నాకు రాజకీయాల్లో లోతులు తెలియవు అనుకోవద్దు.. రాజకీయం చేయడం రాదు అని కూడా అనుకోవద్దు".. కొంతకాలం క్రితం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. "జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం కష్టం. మాకు, భారత రాష్ట్ర సమితికి మధ్య పది శాతానికి పైగా ఓట్ల తేడా ఉంది. ముఖ్యమంత్రి ఒక్కరికే గెలుస్తామన్న నమ్మకం ఉంది" ..ఎన్నికల ప్రచారం ప్రారంభమయ్యాక కొందరు మంత్రులు చేసిన వ్యాఖ్యలివి. "రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. నమ్మి ముఖ్యమంత్రి పదవి కట్టబెడితే రేవంత్ రెడ్డి పార్టీని నాశనం చేస్తున్నాడు అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిరాకుపడుతున్నారు" ..గత కొద్ది రోజులుగా రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా ఆయన ప్రత్యర్థులు చేసిన ప్రచారం ఇది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఫలితం వెల్లడైంది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా దాదాపు 51 శాతం ఓట్లు సాధించింది. దాదాపు 25 వేల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించారు. తనకు రాజకీయాల్లో లోతులు తెలియవని హేళన చేసిన వారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విజయం ద్వారా తానేమిటో సమాధానం చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దాదాపుగా మట్టి కరచినా తెలంగాణలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భారీ మెజారిటీ సాధించడం ద్వారా రాజకీయాలు చేయడంలో తాను ఆరితేరానని రేవంత్‌రెడ్డి రుజువు చేసుకున్నారు. గత శాసన సభ ఎన్నికల్లో హైదరాబాద్ మహా నగరంలో కాంగ్రెస్ పార్టీ చతికిలపడిన విషయం తెలిసిందే. అంతకుముందు జరిగిన గ్రేటర్ మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పది శాతం దిగువకు పడిపోయింది. పార్టీ కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో వచ్చిన ఉప ఎన్నిక ముఖ్యమంత్రి నాయకత్వ పటిమకు అగ్నిపరీక్షగా మారింది. గోపీనాథ్ భార్యకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చినందున సానుభూతి కూడా తోడై ఆ పార్టీనే గెలుస్తుందని విశ్లేషకులు కూడా భావించారు. సంస్థాగతంగా బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, అదే జరిగితే పార్టీలో, ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి బలహీనపడతారని చాలా మంది భావించారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనలోని రాజకీయ చతురతను ప్రదర్శించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే మజ్లిస్ పార్టీతో అవగాహన కుదుర్చుకున్నారు. ఆ పార్టీ సూచన మేరకు నవీన్ యాదవ్‌కు పార్టీ టికెట్ ఇవ్వాలని చెప్పి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒప్పించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి విషయమై మీడియాలో వచ్చిన ఊహాగానాలతో నిమిత్తం లేకుండా నవీన్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని సైలెంట్‌గా చాలా ముందుగానే ఖరారు చేయించుకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే పార్టీ అభ్యర్థిని ఖరారు చేయించడం రేవంత్ సాధించిన తొలి విజయం. అధిష్ఠానం సూచన మేరకు క్షేత్ర స్థాయిలో పనిచేసుకోవలసిందిగా నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి సూచించారు. పార్టీలో చాలామందికి ఈ విషయం తెలియదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ అడ్డు పడకుండా ఉండడం కోసం ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి అనుమతించాలని పార్టీ అధిష్ఠానానికి చెప్పి ఒప్పించుకున్నారు. తాము సూచించిన అభ్యర్థికే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో మజ్లిస్ పార్టీ ఈ ఎన్నికల్లో గట్టిగా పనిచేసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు గణనీయంగా ఉన్న విషయం తెలిసిందే. అదే సమయంలో ఈ నియోజకవర్గంలో ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. దీంతో ఆ వర్గం ఓట్లపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారు. వారందరూ తెలుగుదేశం పార్టీ అభిమానులు అయినందున అటు నుంచి నరుక్కొచ్చారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లో తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రదర్శన నిర్వహించినప్పుడు అప్పటి మంత్రి కేటీఆర్ హేళనగా మాట్లాడడాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుచేయించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే జగన్‌రెడ్డికి బలం చేకూర్చినట్టేనని ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లలో విస్తృతంగా ప్రచారం చేయించారు. తాను ముఖ్యమంత్రిననీ, ఉప ఎన్నిక కోసం ప్రచారం చేయడం ఏమిటీ అనీ భావించకుండా కాలికి బలపం కట్టుకుని విస్తృతంగా ప్రచారం చేశారు. మొత్తంగా సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించి బీఆర్ఎస్ సీటును కాంగ్రెస్ ఖాతాలోకి వేసుకున్నారు. అది కూడా 25 వేల మెజారిటీతో! ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్ అతి విశ్వాసంతో ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ మాత్రం గెలుపే లక్ష్యంగా పనిచేశారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను కార్యక్షేత్రంలో మోహరింపజేశారు. ఈ ఎన్నిక గెలవడం కష్టమని భావించిన మంత్రులు, ఇతరులకు కూడా తన సత్తా ఏమిటో రుజువు చేసి చూపారు. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద రేవంత్‌రెడ్డి పరపతి పడిపోతోందని ప్రచారం చేసిన వారికి కూడా ఈ విజయంతో సమాధానం చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్న ప్రచారం గత కొంత కాలంగా జోరుగా జరుగుతోంది. ఈ పరిస్థితులలో ఈ ఘన విజయం కాంగ్రెస్ పార్టీకి ఏమో గానీ, రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠ అమాంతం పెరగడానికి దోహదం చేసింది. ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో రేవంత్ పట్టు సడలుతోందన్న అభిప్రాయం కూడా ఈ మధ్య కాలంలో బలంగా వినిపించింది. వైఎస్ రాజశేఖరరెడ్డి వలె రేవంత్‌రెడ్డి పార్టీ పైనా, ప్రభుత్వం పైనా పట్టు సాధించలేకపోయారన్న అభిప్రాయం కూడా వ్యాపించింది. నిజానికి రాజశేఖరరెడ్డి నాటి పరిస్థితులు వేరు.. ఇప్పటి పరిస్థితులు వేరు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ బలంగా ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున పార్టీ అధిష్ఠానం మాటకు తిరుగులేకుండా ఉండేది. దీంతో అధిష్ఠానం ఆశీస్సులతో రాజశేఖరరెడ్డి బలంగా ఎదిగారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అందరికీ తెలిసిందే. పదకొండున్నరేళ్లుగా కేంద్రంలో అధికారానికి దూరంగా ఉంది. రెండు మూడు రాష్ట్రాలు మినహా అన్నిచోట్లా అధికారాన్ని కోల్పోయింది. పార్టీ అధిష్ఠానానికే దశా దిశా లేకుండా పోయింది. అధిష్ఠానాన్ని లెక్క చేసే స్థితిలో రాష్ట్రాల నాయకులు లేరు. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పరిస్థితి మరింత దీనంగా మారే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి పార్టీపైనా, ప్రభుత్వంపైనా పట్టు సాధించడం ఆషామాషీ విషయం కాదు. ఆయన ముఖ్యమంత్రి కావడమే పెద్ద విజయం. ఈ రెండేళ్లుగా తనను ఎవరు ఎన్ని విధాలుగా విమర్శించినా, హేళన చేసినా రేవంత్ రెడ్డి ఆవేశపడలేదు. అవకాశం కోసం ఎదురుచూస్తూ వచ్చారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రూపంలో ఆయనకు ఆ అవకాశం వచ్చింది. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేశారు. పదునైన వ్యూహ రచనతో విజయాన్ని అందుకున్నారు.

ఇంతింతై.. వటుడింతై..

నిజానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితంతో రాష్ట్ర రాజకీయాలలో గానీ, ప్రజల జీవితాలలో గానీ ఇప్పటికిప్పుడు వచ్చే గుణాత్మకమైన మార్పులు ఏమీ ఉండవు. అయితే రేవంత్ రెడ్డికి మాత్రం ఈ విజయం ఎంతో ముఖ్యం. తాను బలహీన ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేస్తున్న వారికి దీటైన జవాబు చెప్పే అవకాశం ఆయనకు లభించింది. ఇంతింతై వటుడింతై అన్నట్టుగా రాజకీయాలలో మరింత ఎత్తుకు ఎదగడానికి ఆయనకు ఈ విజయం అవసరం. పార్టీలోనే ఒక వర్గం ఆశలు వదులుకున్న సీటును భారీ మెజారిటీతో గెలుచుకోవడం ద్వారా పార్టీ అధిష్ఠానం వద్ద కూడా ముఖ్యమంత్రి ప్రతిష్ఠ అమాంతం పెరుగుతుంది. అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి కూడా పార్టీ అధిష్ఠానం ఇష్టపడటం లేదన్న ప్రచారం నిజమే అనుకుందాం. ఈ ఫలితం తర్వాత పార్టీ అధిష్ఠానం రేవంత్ రెడ్డిని కాదనుకోగలదా? "సోనియాగాంధీ అపాయింట్‌మెంట్ కుదరదు.. జూబ్లీహిల్స్ ఫలితం తర్వాత చూద్దాం" అని కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి కసురుకున్నట్టుగా కేసీఆర్ సొంత మీడియాలో రాసుకొని మురుసుకున్నారు. అయితే వారి ఆనందం ఎంతోసేపు నిలవలేదు. శుక్రవారం మధ్యాహ్నానికల్లా ఫలితం వచ్చింది. ఈ దశలో రేవంత్‌ను చిన్న చూపు చూడగలరా? బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధిష్ఠానం పైనే ఆ పార్టీ నాయకులు, శ్రేణులకు నమ్మకం పోయే పరిస్థితి ఏర్పడింది. జూబ్లీహిల్స్‌లో ఓడిపోయి ఉంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోయి ఉండేదని చెప్పలేం. కాకపోతే పార్టీలో, ప్రభుత్వంలో ఆయన పరిస్థితి మరింత బలహీనపడేది. పార్టీలోని ఆయన ప్రత్యర్థులు కూడా జూలు విదిలించేవారు. ఇప్పుడు ముఖ్యమంత్రికి ఆ బెడద లేదు. రేవంత్‌రెడ్డి అల్లాటప్పాగా గాలికి కొట్టుకొచ్చిన ముఖ్యమంత్రి కాదు.. శక్తివంతమైన నాయకుడు అని తనను అందరూ గుర్తించేలా ఆయన చేసుకోగలిగారు. ఒక్క మాటలో చెప్పాలంటే రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో ఇప్పట్లో తిరుగుండదు. ప్రభుత్వంలోనే కాదు.. పార్టీలోనూ క్రమశిక్షణ నెలకొల్పే శక్తి రేవంత్‌రెడ్డికి ఇప్పుడు లభిస్తుంది. అధిష్ఠానం వద్ద ఆయన మాటే చెల్లుబాటవుతుంది. కాంగ్రెస్ పార్టీ మహా అయితే ఐదారు వేల కంటే మెజారిటీ దాటదని విశ్లేషకులు కూడా భావించారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతం లోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారు శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదు శాతం ఓట్లు కాంగ్రెస్‌కు కలసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లలో ఐదు శాతం వరకు తగ్గిపోవడం ఏమిటి? బీజేపీ ఈ దుస్థితికి అంతర్గత కలహాలు ప్రధాన కారణమని భావించవచ్చు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మినహా మిగతా పార్టీ ముఖ్యులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనలేదు. కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ముఖం చాటేశారు. బిహార్ ఎన్నికల్లో అంచనాలకు మించి స్వీప్ చేసిన బీజేపీకి తెలంగాణలో ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆ పార్టీ అధిష్ఠానం ఆలోచించుకోవాలి. ఉత్తరాదిన తిరుగులేని శక్తిగా ఎదిగిన బీజేపీ దక్షిణాదిలో ఎందుకు ఆపసోపాలు పడుతోందో ఆలోచించుకోవాలి. ఉత్తరాది ప్రజల నాడిని దొరకపుచ్చుకున్న మోదీ–షా ద్వయం దక్షిణాది జన నాడిని ఎందుకు అందుకోలేకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. బీజేపీకి దక్షిణాదిన చోటు దొరకని విషయం అటుంచితే కాంగ్రెస్ పార్టీకి ఉత్తరాదిన పట్టుచిక్కడం లేదు. దక్షిణాది ప్రజల ఆశీస్సులు అడపాదడపా అయినా పొందుతున్న కాంగ్రెస్ పార్టీ, ఉత్తరాది ప్రజలకు ఎందుకు దూరమైందో ఆత్మపరిశీలన చేసుకోవాలి. దక్షిణాదిన బీజేపీకి పట్టు దొరకనప్పటికీ కేంద్రంలో ఆ పార్టీకి మద్దతు ఇచ్చే పార్టీలకు కొదవ లేదు. కాంగ్రెస్ పార్టీకి ఆ అవకాశం కూడా లేదు. బిహార్ ఫలితాలు చూశాక ఇండియా కూటమిలోని పార్టీలు కూడా కాంగ్రెస్‌కు దూరం కావొచ్చు. కాంగ్రెస్ పార్టీ బతికి బట్టకట్టాలంటే, ఆ పార్టీకి కాదు.. ఆ పార్టీ అధిష్ఠానానికి కాయకల్ప చికిత్స జరగాలి. కళ్ల ఎదురుగా పతనమైన పార్టీల నినాదాలు, విధానాలను అందిపుచ్చుకోవడమే ఆ పార్టీ అధిష్ఠానం చేస్తున్న ఘోర తప్పిదం. కాంగ్రెస్ నాయకత్వ వైఖరిలో మార్పు రానంత వరకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి తిరుగుండదు. ఆయన అంతట ఆయనకు విసుగు వచ్చి ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకొంటే తప్ప మోదీని సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ గానీ, మరొక పార్టీ గానీ ఓడించలేదు. మహాభారతంలో భీష్ముడికి తన చావుకు తానే ముహూర్తం పెట్టుకొనే వరం ఉన్నట్టుగా వర్తమాన రాజకీయాలలో నరేంద్ర మోదీ కూడా పదవీ విరమణ ఎప్పుడు చేయాలి అన్నది తానే నిర్ణయించుకొనే విధంగా అలాంటి వరమే పొందారేమో!

> **చంద్రబాబు, రాజశేఖరరెడ్డి, కేసీఆర్ రాజకీయాలు చూసి ఎదిగిన రేవంత్‌రెడ్డికి రాజకీయాల్లోని లోతులు గురించి వేరే వాళ్లు చెప్పాల్సిన అవసరం ఉంటుందనుకోకూడదు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రికి బెస్టాఫ్ లక్ చెబుదాం. జూబ్లీహిల్స్‌లో లభించిన విజయంతో మరింత మెరుగైన పాలన అందిస్తారని ఆశిద్దాం!**

ఇంకా భ్రమల్లోనే..

ఇప్పుడు మళ్లీ జూబ్లీహిల్స్ ఎన్నికల విషయానికి వద్దాం. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తామే అధికారంలోకి వస్తామన్న అతి విశ్వాసంతో ఉన్న బీఆర్ఎస్‌కు ఈ ఫలితం అశనిపాతమే! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యంగా కేటీఆర్ తక్కువగా అంచనా వేశారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రిని కేటీఆర్ తరచుగా కించపరుస్తూ రెచ్చగొట్టారు. రాజకీయంగా ఉండాల్సిన వైరాన్ని వ్యక్తిగత వైరంగా మార్చారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తించడానికి కూడా కేటీఆర్ నిరాకరిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అంతులేని వ్యతిరేకత నిజమే అయితే జూబ్లీహిల్స్‌లో 51 శాతం ఓట్లు రావడం ఎలా సాధ్యం అని బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం ఎలా ఉంది? అన్న విషయం పక్కనపెడితే, కేసీఆర్ కుటుంబం ఇంకా నేల మీదకు దిగి రాలేదన్న అభిప్రాయం మాత్రం ప్రజల్లో ఉంది. కేసీఆర్ ఆరోగ్యం కొంత దెబ్బతిని ఉన్నందున పార్టీలో అంతా తానే అన్నట్టుగా గత రెండేళ్లుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారు. అయినా ప్రజల అభిమానాన్ని మాత్రం ఆయన చూరగొనలేకపోతున్నారు. కేటీఆర్‌లో ఇంకా అహంభావం ఛాయలు పోలేదని ప్రజలు అనుకుంటున్నారు. మరుగుజ్జు లాంటి నాయకులను చుట్టూ పెట్టుకుని కాబోయే ముఖ్యమంత్రిని తానేనని ఆయన భ్రమల్లో బతుకుతున్నారు. చుట్టూ ఉన్నవాళ్లు హై హై నాయకా అంటూ చిడతలు కొడుతున్నారు. అదే నిజమని కేటీఆర్ నమ్ముతున్నారు. పోలింగ్‌కు ముందు వరకు పరిస్థితి తమకే అనుకూలంగా ఉందని, చివరి మూడు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడటంతో ఓడిపోయామని ఆయన చెప్పుకొచ్చారు. అదే నిజం అనుకుందాం. 2014–2023 మధ్య అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడలేదా? ఓటర్లకు డబ్బు పంచలేదా? 'జో జీతా వహీ సికందర్' అని అంటారు. ఎలా గెలిచామన్నది కాదు, ఎన్నికల్లో గెలిచామా లేదా అన్నదే ముఖ్యం అని కేటీఆర్‌కు తెలియదా? 2023 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ గెలవలేదు. పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదు. కొన్నిచోట్ల పోటీ కూడా చేయలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నిక. కర్మ మనల్ని వెంటాడుతుందని కేటీఆర్ సొంత చెల్లి కవిత తాజాగా వ్యాఖ్యానించారు. గతంలో అహంభావంతో వ్యవహరించినందునే ఇప్పటి దుస్థితి అని తెలుసుకోకుండా ఇప్పటికీ "త్వరలోనే అధికారంలోకి వస్తాం, మీ సంగతి తేలుస్తాం" అని బీరాలు పోవడం ఏమిటి? ఆంధ్రప్రదేశ్‌లో తాము అభిమానించే జగన్‌రెడ్డికి పట్టిన గతి చూసి కూడా కేసీఆర్ కుటుంబం తమ వైఖరి మార్చుకోకపోవడం ఆశ్చర్యంగా ఉంది. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సొంతంగా పోటీ చేసి సీట్లు గెలుచుకోలేకపోవచ్చు. కానీ ఆ పార్టీకి పలు నియోజకవర్గాలలో గణనీయంగా ఓట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును అవమానించినా, ఆయనకు రాజకీయంగా నష్టం చేయాలనుకున్నా ఆ పని చేసిన వారికి ఈ వర్గం ఓటర్లందరూ వ్యతిరేకం అవుతారు. ఈ విషయం తెలిసి కూడా కేసీఆర్ కుటుంబం జగన్‌రెడ్డే మాకు ముద్దు అని భావించడం వింతగా ఉంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో 16 వేల ఓట్ల మెజారిటీతో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలవడానికి ఆంధ్రా మూలాలు ఉన్న ఓటర్లు కారణం కాదా? కేసీఆర్ అండ్ కో జగన్‌రెడ్డితో అంటకాగడం వల్ల ఈ వర్గం ఓటర్లు అందరూ బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. అయినా జగన్‌రెడ్డే మాకు ముఖ్యం అని కేసీఆర్ అండ్ కో అనుకుంటున్నారు. ఇది గమనించిన రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే జగన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో బలపడతారని తెలుగుదేశం ఓటర్లకు నచ్చజెప్పి తన వైపునకు తిప్పుకొన్నారు. ఈ వర్గం ఓట్లతో పాటు ముస్లింలు కూడా ఇప్పుడు బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. భారతీయ జనతా పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి బీఆర్ఎస్ సిద్ధపడిందని కేసీఆర్ కుమార్తె కవిత బహిరంగంగా చెప్పిన తర్వాత ముస్లింలు బీఆర్ఎస్‌కు దూరమయ్యారు. ఒకవైపు తెలుగుదేశం ఓటర్లు, మరోవైపు ముస్లింలు దూరమవడం వల్ల దాదాపు 50కి పైగా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు దెబ్బ పడుతుంది. అయినా ఆ పార్టీ నాయకత్వం తమ విధానాలను సమీక్షించుకోవడానికి సిద్ధంగా లేదు. అదే సమయంలో వాపును చూసి బలుపు అనుకుంటోంది. అధికారంలో ఉన్నప్పుడు వెనకేసుకున్న సొమ్ముతో యూట్యూబ్ చానళ్లు పెట్టించి, వాటిల్లో అనుకూలంగా ప్రచారం చేయించుకుంటూ అదే నిజమని కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నారు. ప్రస్తుత ఉప ఎన్నిక సందర్భంగా కూడా బీఆర్ఎస్ అనుకూల సోషల్ మీడియా వేదికలు ఊదరగొట్టాయి. అయినా ప్రయోజనం కలగలేదు. మీడియా అయినా, సోషల్ మీడియా అయినా రాజకీయ పార్టీలకు కొంత నష్టం చేయగలవే గానీ, ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించలేవు. ప్రజలకు అన్నీ తెలుసు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డి కూడా సోషల్ మీడియా వారియర్స్‌ను నమ్ముకొని పదకొండు సీట్లకు పరిమితం అయ్యారు. కేటీఆర్ ఇదే వైఖరితో ఉంటే భవిష్యత్తులో కూడా ఫలితాలు ఇంతకు భిన్నంగా ఉంటాయని భావించలేం. కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ మనుగడకు ఢోకా ఉండదు. ఏ కారణం వల్లనైనా కేసీఆర్ క్రియాశీలంగా వ్యవహరించలేకపోతే బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి? అన్నది ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులను వేధిస్తున్నది. దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది. కవిత అన్నట్టుగా బీఆర్ఎస్‌ను, ముఖ్యంగా కేటీఆర్‌ను కర్మ వెంటాడుతోందని ప్రస్తుతానికి సరిపెట్టుకుందాం.

> **2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో వచ్చిన ఓట్లు 35 శాతం మాత్రమే. అప్పుడు బీఆర్ఎస్‌కు దాదాపు 44 శాతం ఓట్లు వచ్చాయి. అంటే, కాంగ్రెస్ కంటే దాదాపు 9 శాతం అధికం. గత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి 14 శాతం పైగా ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 9 శాతంలోపే. ఈసారి బీజేపీ డిపాజిట్ కూడా కోల్పోయింది. 2023 ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీకి దాదాపు పదహారు శాతం ఓట్లు అధికంగా వచ్చాయి. అప్పటితో పోలిస్తే బీఆర్ఎస్, బీజేపీలకు కలిపి 11 శాతం ఓట్లు తగ్గాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయని భావించాలి. గత ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేయగా, ఇప్పుడు ఆ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. దీంతో మరో ఐదు శాతం ఓట్లు కాంగ్రెస్‌కు కలసి వచ్చాయి. అధికారంలో ఉన్న పార్టీలకు ఉప ఎన్నికల్లో కొన్ని అనుకూలతలు ఉంటాయి. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 51 శాతం ఓట్లు లభించడం విశేషమే అని అంగీకరించాలి. ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి ఐదు శాతం వరకు అనుకూలతల వల్ల లబ్ధి చేకూరుతుంది. కాంగ్రెస్‌కు 16 శాతం వరకు పెరిగినందున ఆ విజయాన్ని గుర్తించవలసిందే.**

ఇక జనాభిమానమే టార్గెట్!

ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విషయానికి వద్దాం. ఇల్లు అలకగానే పండగ కాదు. ఒక ఉప ఎన్నికను సర్వశక్తులూ ఒడ్డి గెలవొచ్చు గాక. అంత మాత్రాన అంతా పచ్చగా ఉందని భావిస్తే పప్పులో కాలేసినట్టే. రాజకీయ పరీక్షలో ప్రస్తుతానికి రేవంత్‌రెడ్డి పాసయ్యారు. ఇకపై జనాభిమానాన్ని చూరగొనడానికి ఆయన ప్రయత్నించాలి. ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వసనీయత పెంచేలా ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలి. పార్టీలో క్రమశిక్షణ నెలకొల్పడానికి ఇంతకంటే మంచి అవకాశం మళ్లీ ఆయనకు లభించదు. ప్రస్తుత పరిస్థితులలో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వొచ్చు. ఈ రెండేళ్ల పాలనలో మంచి చెడులను ఆయన ఇప్పుడు సమీక్షించుకోవాలి. హైదరాబాద్ మహానగరంలో మధ్య తరగతి, ఆపై వర్గాల ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉంది. గణనీయమైన సంఖ్యలో అసెంబ్లీ సీట్లు ఉన్న హైదరాబాద్ ప్రజల మనసు గెలుచుకోవడంపై ఆయన దృష్టి పెట్టాలి. ఉప ఎన్నిక అంటే పార్టీ యంత్రాంగం అంతా మోహరిస్తుంది. సాధారణ ఎన్నికల్లో అలా చేయడం సాధ్యం కాదు. వనరులు కూడా అంతంత మాత్రంగానే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత ఉంది. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల వ్యవధి ఉన్నందున ఈ పరిస్థితిని అధిగమించడానికి అవకాశం లేకపోలేదు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్ వంటి స్థానాన్ని గెలుచుకోగలిగిన ముఖ్యమంత్రికి రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాల ప్రజల మనోగతం తెలియదని అనుకోలేం. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ తన స్థానం పటిష్ఠం అయినందున ప్రజల్లో ఫీల్ గుడ్ భావన కల్పించడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి దృష్టిసారించాలి. చంద్రబాబు, రాజశేఖరరెడ్డి, కేసీఆర్ రాజకీయాలు చూసి ఎదిగిన రేవంత్‌రెడ్డికి రాజకీయాల్లోని లోతులు గురించి వేరేవాళ్లు చెప్పాల్సిన అవసరం ఉంటుందనుకోకూడదు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రికి బెస్టాఫ్ లక్ చెబుదాం. జూబ్లీహిల్స్‌లో లభించిన విజయంతో మరింత మెరుగైన పాలన అందిస్తారని ఆశిద్దాం!

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

భ్రమలు.. భయాలు...



'న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో జోహ్రాన్ మమ్దానీ గెలుపు– యావత్ ప్రపంచానికే ఒక మలుపు' అంటూ వివిధ పత్రికల్లో వ్యాసాలు, టీవీలో ఒకటే చర్చలు. సోషల్ మీడియాలో అయితే లెక్కలేనంత హైప్ జరుగుతోంది. మమ్దానీ గెలుపును వేడుక చేసుకుంటున్న వారిలో సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు ఉన్నారు. వీరంతా పెట్టుబడిదారులను వ్యతిరేకించే వామపక్ష భావజాలం ఉన్నవారు, సెక్యులర్ల ముసుగులోని ముస్లింలు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన నోటి దురుసు కారణంగానే రెండోసారి ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే, జోబైడెన్ ఉదారవాదం మొత్తం అమెరికా ఉనికికే ప్రమాదమని భావించినందునే అమెరికన్లు మళ్లీ ట్రంప్‌కే పట్టం కట్టారు. మమ్దానీ గెలుపు అమెరికా గడ్డపై నాన్ అమెరికన్ల ఏకీకరణతో సాధించిన విజయం. న్యూయార్క్ నగరంలో పెరిగిన ముస్లింల జనాభా, ఆయన తండ్రి మహమూద్ మమ్దానీ కావడం, ఇస్లామిక్ సంప్రదాయ వివాహం, పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధ నేపథ్యం, భారతీయురాలైన తల్లి, ఇస్లామిక్ తీవ్రవాదంపై తండ్రి రాసిన సాహిత్యం, క్రైస్తవ అభ్యుదయవాదుల మద్దతు వంటివి కలగలిసిన విజయం ఇది. ఇలాంటి విజయాలు భవిష్యత్తులో అమెరికా అంతటా పునరావృతమవుతాయనే ఆశలు, భ్రమలు వద్దు. గెలుపు ఏకపక్షంగా కూడా ఏమీ లేదు. న్యూయార్క్ పట్టణం ప్రపంచ సంస్కృతికి ప్రతిబింబం. ఇటీవలికాలంలో అక్కడ క్రైస్తవుల జనాభా తగ్గి ముస్లింల జనాభా గణనీయంగా పెరిగింది. 51 లక్షల మంది ఓటర్లలో 30 లక్షల మంది ఓటర్లు (60శాతం) ఓటింగులో పాల్గొనలేదు. నగరంలోని ధనవంతులెవరూ పోలింగ్ బూత్‌లకు రాలేదు. పోలైన ఓట్లలో మమ్దానీకి 10,36,051 (50.6 శాతం) ఓట్లు, రిపబ్లికన్ అభ్యర్థికి 8,54,995 (41.7శాతం) వచ్చాయి. మొత్తం ఓటర్లలో కేవలం 20.3శాతం, న్యూయార్క్ జనాభాలో 10శాతం మమ్దానీకి మద్దతు పలికినా అతనిని మేయర్ పీఠంపై కూర్చోపెట్టింది అక్కడి ప్రజాస్వామ్యం. ధనవంతులే తన ప్రత్యర్థులంటూ మమ్దానీ చేసిన ప్రచారంతో పేదల ఓట్ల ఏకీకరణ జరిగింది.

సామ్యవాద వ్యతిరేకతతో వాణిజ్య సామ్రాజ్యవాదం విస్తరించే పనిలో ఉండే అమెరికా గతంలో ముస్లిం దేశాల్లో ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపులను సృష్టించి, పెంచి, పోషించింది. అవి తమకే ద్రోహం చేస్తున్నాయని 9/11 దాడులతో తెలిసొచ్చాక, ఆయా ఉగ్రగ్రూపులను అంతమొందించేందుకు పూనుకుంది. లాడెన్, అల్ జవహరీ వంటి ఇస్లామిక్ ఉగ్రవాద నేతలను మట్టుబెట్టింది. పెట్టుబడిదారీ విధానం అవలంబించే దేశాలకు పెద్దన్న అయిన అమెరికాలో పెట్టుబడిదారుల లాభాలకు నష్టం కలిగించే పరిపాలన ఎప్పటికీ ఉండదు. అయితే.. మమ్దానీ సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అంతకన్నా కాదు. కానీ ఆయన గెలుపు పట్ల అమెరికాకే కాదు, యావత్ ప్రపంచానికే అనేక భయాలు ఉన్నాయి.

ఎన్నికల ప్రచారంలో 'గ్లోబలైజ్ ఇంతిఫాదా' అంటూ ఇస్లాం వ్యాప్తిని మమ్దానీ ప్రస్తావించారు. విజయోత్సవ ర్యాలీలో ఆయన తనను తాను ముస్లింగా ప్రకటించుకుంటూ చేసిన ప్రసంగం లోతుగా గమనించాల్సిందే. 'సౌండ్ పెంచుకొని విను, ఇక్కడ ఎవ్వరిని తాకాలన్నా మా అందరినీ దాటుకుంటూ రావాలి' అని ట్రంప్‌కు ఆయన ఘాటైన హెచ్చరిక చేశారు. తన భార్యకు అరబ్బు దేశాలతో ఉన్న అనుబంధం నేపథ్యంలో, ప్రపంచ ముస్లిం రాజ్యాలు తనకు అండగా నిలవాలని పరోక్షంగా వ్యాఖ్యానించాడు. ఆయన ఎప్పుడూ, ఎక్కడా ఇస్లామిక్ తీవ్రవాదంపై మాట్లాడలేదు. ఇస్లామిక్ ఉగ్రవాదులకు శాంతి సందేశం ఇవ్వలేదు.

అమెరికా అండతో పాలస్తీనాపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును యుద్ధ నేరస్థుడంటూ, 'న్యూయార్క్ వస్తే అరెస్టు చేయిస్తా'నన్నారు. కానీ, యూదు స్త్రీలపై, పిల్లలపై హమాస్ చేసిన అమానుష నరమేధంపై మమ్దానీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. గతంలో ఇస్లామిక్ టెర్రరిస్టులకు అమెరికా అంటే కాస్తో కూస్తో భయం ఉండేది. కానీ, ఇప్పుడు ఆ వేదికమీద ఉన్నవారి ప్రసంగాలతో ఆ భయం కూడా మిగలకపోవచ్చు.

మమ్దానీ గెలుపుతో ఆయన అభిమానులు భ్రమ పడుతున్నట్లుగా... అట్లాంటిక్ మహాసముద్రానికి ఇరువైపులా గానీ, యూరప్‌లో గానీ అనూహ్య మార్పులేమీ రావు. న్యూయార్క్ నగర ఎన్నికలు క్యాపిటలిస్టులకు, సోషలిస్టులకు మధ్య పోటీ కాదు. క్రైస్తవ ఛాందసవాదులకు, సెక్యులర్ ముసుగులో ఉన్న ఇస్లామిక్ ఛాందసవాదులకు మధ్య జరిగిన ఎన్నికల పోరు ఇది. క్రైస్తవ ఛాందసవాదులతో ప్రపంచానికి ప్రమాదమేమీ ఉండకపోవచ్చు కానీ, ఇస్లామిక్ ఛాందసవాదులతో నిత్యం సమస్యే. మమ్దానీ గెలుపుతో ఇస్లామిక్ ఛాందసులు తమకు ఒక ఆసరా దొరికినట్లుగా భావిస్తారు. అమెరికాను మరో ఇస్లామిక్ రాజ్యంగా చేస్తామని ప్రకటించిన సంస్థలకు ఉత్సాహం లభిస్తుంది. ఇప్పటికే యూరప్ దేశాలు వలసవచ్చిన ముస్లింలతో ఎంత ఇబ్బంది పడుతున్నాయో అమెరికా గమనిస్తోంది. ఒకవైపు అమెరికా ఔన్నత్యాన్ని పొగుడుతూనే న్యూయార్క్‌లో ముస్లిం జనాభా పెరుగుదలను ఇతడు అనుమతిస్తాడన్న అనుమానం అమెరికాలో లేకపోలేదు.

'ఇస్లామోఫోబియా' అంటూ యూరప్‌లో అబద్ధపు ప్రచారం జరుగుతోందని బాధపడిపోతున్న మమ్దానీ అభిమాన ముస్లిం మేధావులు ఇక్కడ కొందరున్నారు. కానీ, అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, భారత్ వంటి దేశాల్లో జరిగే అధిక ఉగ్రదాడుల్లో ఉన్నది ఈ మతంవారే. 'లజ్జ' రచయిత్రి తస్లీమా నస్రీన్‌పై హైదరాబాద్‌లో జరిగిన అమానుష దాడిని ఈ కుహనా ముస్లిం మేధావులు ఖండించరు, తమ మతంలో స్త్రీ వివక్షను ఎదుటివారు ప్రశ్నించకూడదనీ అంటారు. కానీ, మమ్దానీ తల్లి మీరానాయర్ దర్శకత్వం వహించిన 'India Cabaret' డాక్యుమెంటరీలోని ఒక యువతి పాత్రపై మాత్రం పొగడ్తల వర్షం, సానుభూతి ఒలకబోస్తారు. ఆఫ్రికన్ దేశాల్లో క్రైస్తవులపై ఇస్లామీయులు సాగిస్తున్న మారణకాండ వీరికి కన్పించదు.

మమ్దానీ గెలుపుతో అమెరికా వాణిజ్య, సామ్రాజ్యవాదానికి బ్రేకులేమీ పడవు. పెట్టుబడిదారీ విధానంలో మార్పులేమీ రావు. ఈ మాత్రం దానికే అదేదో ప్రపంచ వింతనీ, అద్భుతమనీ, మొత్తం ప్రపంచాన్నే మలుపుతిప్పే తీర్పు అనీ... ఇలా ఏవేవో భ్రమల్లో తేలియాడేవారు అసలు విషయాలను ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.

▪ మామిడి నారాయణ




మూలపాడు నగరవనం మెయిన్ గేటు వద్ద పర్యాటకుల సెల్ఫీలు


ఫస్ట్ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన జిప్‌లైన్

నగరవనం

మూలపాడు నగరవనంలో జిప్‌లైన్ అడ్వెంచర్

ట్రయల్ రన్ సక్సెస్.. డిసెంబరుకు అందుబాటులోకి.. • దొంగమర్ల బావి వద్దకు వెళ్లేందుకు రెండు సఫారీలు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : మూలపాడు నగరవనంతో పాటు కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను వీక్షించేందుకు జిప్‌లైన్ అడ్వెంచర్ రెడీ అవుతోంది. గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సౌజన్యంతో పర్యాటక, అటవీశాఖ అధికారులు దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. నగరవనంలోని రెండో గేటుకు 50 మీటర్ల ముందు ఉన్న మొదటి వ్యూ పాయింట్ కుడి, ఎడమ కొండల మధ్య ఈ జిప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఎడమ నుంచి కుడివైపు వరకు ఉన్న ఎత్తయిన కొండ మీదకు 170 మీటర్లు, కుడి నుంచి ఎడమ వరకు ఉన్న మరో ఎత్తయిన కొండ మీదకు 180 మీటర్లు జిప్‌లైన్ ఏర్పాటు చేశారు. మొత్తం కలిపి 350 మీటర్ల మేర ప్రయాణం చేయవచ్చు. నగరవనంలోని అందమైన ప్రదేశాలతో పాటు దట్టమైన, సుందరమైన కొండపల్లి రిజర్వు ఫారెస్టు అందాలను వీక్షించేందుకు దీనిని ఏర్పాటు చేశారు. డిసెంబరు నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సఫారీ వాహనాలు సిద్ధం

నగరవనం నుంచి కొండపల్లి రిజర్వు ఫారెస్టులోని దొంగమర్ల బావితో పాటు అక్కడ ఉన్న ఆంజనేయస్వామి ఆలయం, పలు జలపాతాలను పర్యాటకులు కుటుంబ సమేతంగా, స్నేహితులతో కలిసి వీక్షించేందుకు మొదటి గేటు వద్ద రెండు సఫారీ వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. అక్కడి నుంచి దొంగమర్ల బావి ప్రాంతం సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. అధిక వర్షాల వల్ల జలపాతాలు రహదారిపై పారడంతో ఘాట్‌రోడ్డు బురదమయంగా మారింది. పర్యాటకులు సొంత వాహనాల్లో వీల్లేని పరిస్థితి. పర్యాటకుల సౌలభ్యం కోసం రెండు సఫారీ వాహనాలను అధికారులు సిద్ధంగా ఉంచారు. ఒక్కోదానిలో సుమారు 15 మంది వరకు ప్రయాణం చేయవచ్చు. ఇప్పటికే నేరేడు వనంలో సైకిల్ ట్రాక్స్ ఏర్పాటుచేసి పర్యాటకులకు ఆరు సైకిళ్లను సిద్ధంగా ఉంచారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు స్వాగతం

మర్యాదపూర్వకంగా కలిసిన సీపీ, జేసీ


సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు, జేసీ ఇలక్కియా

విజయవాడ/గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. గుంటూరు జిల్లా మంగళగిరి పర్యటన నిమిత్తం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆయన శనివారం విమానాశ్రయానికి విచ్చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ రమేశ్, ఏపీ అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్, కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు పూలబొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డుమార్గాన ఆయన విజయవాడ వెళ్లారు. కాగా, గవాయ్‌ను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో ఆయన బసచేసిన హోటల్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సీజేఐని కలిసిన వారిలో అడ్మిన్ డీసీపీ సరిత కూడా ఉన్నారు.

హద్దులు దాటి..

ఇసుక అక్రమ రవాణా

మునేటి నుంచి తెలంగాణాకు భారీగా తరలుతున్న ఇసుక

ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నందిగామ డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి మునేటిలోని ఇసుకను తెలంగాణాకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినప్పటికీ రాత్రుళ్లు డొంకమార్గాల ద్వారా తరలిస్తున్నారు. తెలంగాణాలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుండటంతో ఈ అక్రమ రవాణా వేగంగా సాగుతోంది.

- చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా.. డొంకమార్గాల ద్వారా..
- తెలంగాణాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పెరిగిన వేగం
- అక్రమార్కులకు కలిసొచ్చిన డిమాండ్
- రీచ్‌లతో సంబంధం లేకుండా తవ్వకాలు


చిల్లకల్లు పోలీసులు పట్టుకున్న నెంబర్ ప్లేట్ లేని ఇసుక లారీ

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : తెలంగాణాలోని ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుక రూ.7 వేల నుంచి రూ.9 వేలు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు మునేటిపై పడ్డారు. రీచ్‌లతో సంబంధం లేకుండా రాకపోకలకు అనువుగా ఉన్న ప్రాంతాల్లో జేసీబీలతో ఇసుక తవ్వేస్తున్నారు. వత్సవాయి మండలం ఇందుగుపల్లి దగ్గర జోరుగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఆరేడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తెలంగాణాలోని సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. వల్లభి, పెదమండవ, బాణాపురం తదితర గ్రామాల్లో డంపింగ్ చేసి, ఆ గ్రామాల నుంచి ట్రాక్టర్లు, లారీల ద్వారా ఖమ్మం పరిసర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మల్కాపురం, పోలంపల్లి, ఆళ్లూరుపాడు గ్రామాల దగ్గర కూడా తవ్వకాలు జరుగుతున్నాయి. నందిగామ మండలం అంబారుపేట, కంచికచర్ల మండలం గండేపల్లి తదితర ప్రాంతాల్లో కూడా మునేటి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఒడ్డుకు తీసుకొచ్చి మిగతా 6లో..

చెక్‌పోస్టులు ఉన్నా..

జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో సరిహద్దు గ్రామాల వెంబడి పలుచోట్ల ప్రత్యేకంగా చెక్‌పోస్టులు పనిచేస్తున్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటం విశేషం. పోలీసులున్న మార్గాల గురించి ముందే సమాచారం తెలుసుకుంటున్న అక్రమార్కులు ఇతర మార్గాల ద్వారా తెలంగాణాలోకి పంపిస్తున్నారు. వత్సవాయి, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, నందిగామ, వీరులపాడు మండలాలకు తెలంగాణా సరిహద్దుగా ఉండటం, ఇక్కడి గ్రామాల మధ్య చాలా తక్కువ దూరం ఉండటం అక్రమ రవాణాకు సులువైంది. ఒకవేళ పోలీసులు వాహనాలను పట్టుకున్నా.. ఒక్కోసారి నేతల నుంచి తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నాయి.

తెలంగాణా రిజిస్ట్రేషన్ కలిగిన లారీల్లో..

ఇసుక అక్రమ రవాణాకు ఎక్కువగా తెలంగాణా రిజిస్ట్రేషన్ కలిగిన లారీలను వినియోగిస్తున్నారు. డొంకమార్గాల ద్వారా తెలంగాణాలోకి ప్రవేశించాక, అక్కడి పోలీసులు, ఇతర శాఖల అధికారుల నుంచి పెద్దగా అవరోధం ఉండదన్న ఉద్దేశంతో తెలంగాణా రిజిస్ట్రేషన్ వాహనాలను వాడుతున్నారు. ఈనెల 11న ముదిగొండవైపు వెళ్తున్న ఇసుక లారీని సరిహద్దు గ్రామమైన జగ్గయ్యపేట మండలం గండ్రాయి దగ్గర చిల్లకల్లు పోలీసులు పట్టుకున్నారు. ఈ లారీకి ముందు, వెనుక భాగంలో నెంబరు ప్లేట్లు కూడా లేకపోవటం గమనార్హం. ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టుబడినా అవి ఎవరివో అనే వివరాలు తెలియకుండా ఉండేందుకు అక్రమార్కులు ఇలాంటి ఎత్తులు వేసున్నారు. ఈనెల 12న ఆళ్లూరుపాడు నుంచి ఖమ్మంజిల్లా బోనకల్లు వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వత్సవాయి పోలీసులు సరిహద్దు వద్ద పట్టుకున్నారు. శనివారం జరిగిన తనిఖీల్లో కంచికచర్లలో 4, నందిగామలో 2, పెనుగంచిప్రోలులో ఒక లారీని పట్టుకున్నారు. ఇవన్నీ తెలంగాణా రిజిస్ట్రేషన్ కలిగినవే.

లక్ష దీపార్చన



కార్తీక ఏకాదశి సందర్భంగా శత సహస్ర దీపార్చన సేవామండలి ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని శిశు విద్యామందిరంలో శనివారం లక్ష దీపార్చన జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివలింగాకారంలో దీపాలు వెలిగించారు.

చలో సింగపూర్

సింగపూర్‌కు విమాన సర్వీసుల పునరుద్ధరణ

- 140 మందితో రాక.. 123 మందితో పోక
- సర్వీసు ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ
- చంద్రబాబు, లోకేశ్‌కు ప్రయాణికుల కృతజ్ఞతలు


సింగపూర్ విమానాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

(ఆంధ్రజ్యోతి, గన్నవరం) : ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న విజయవాడ-సింగపూర్ విమాన సర్వీసు శనివారం ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వ చొరవతో అంతర్జాతీయ సర్వీసు మొదలు కావడంపై అన్ని వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాకపోకలు సాగించే ఈ సర్వీసును ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మిగతా 6లో..

సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



సింగపూర్‌కు విమానం సర్వీసును ఏర్పాటుచేసిన సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ధన్యవాదాలు. తాడేపల్లిగూడెం నుంచి గన్నవరం మాకు దగ్గరగా ఉంటుంది. ఇంతకు ముందు చెన్నై, హైదరాబాద్ వెళ్లి సింగపూర్ వెళ్లాల్సి వచ్చేది. మొదటిసారి నేరుగా వెళ్లడం హ్యాపీగా ఉంది.

- ప్రయాణికురాలు

రాజకీయాల్లోకి వంగవీటి ఆశకిరణ్
• నేడు తండ్రి రంగ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు
6
అసలు గుట్టు చెప్పండి
పోలీసు కస్టడీకి 'అద్విక' నిందితులు • తాజాగా మరో ఏజెంట్ అరెస్టు

త్వరలో పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

● ప్రస్తుతం తిరుమలగిరి పత్తి మిల్లుకు తోలాలి
● మార్కెటింగ్ ఏడీ రాజబాబు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో నందిగామ యార్డులో పత్తి కొనుగోళ్లు చేపడతామని, అప్పటి వరకు రైతులు పత్తిని జగ్గయ్యపేట సమీపంలోని తిరుమలగిరి సాంబశివ కాటన్ మిల్‌కు తీసుకువెళ్లి మద్దతు ధర పొందాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు తెలిపారు. పత్తి కొనుగోళ్లలో సీసీఐ అనుసరిస్తున్న విధానంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మార్కెటింగ్ అధికారులు స్పందించారు. ఏడీఎం శనివారం హుటాహుటీన నందిగామ వచ్చి యార్డు పరిధిలో పత్తి నిల్వలపై ఆరా తీశారు. వచ్చే బుధవారం నాటికి సీసీఐ ట్రాన్స్‌పోర్టు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పత్తి కొనుగోలు చేస్తుందని చెప్పారు. నిర్దిష్టమైన తేదీ చెప్పాలని కోరగా సమాధానం దా ట వేశారు. సీసీఐ రంగంలోకి వచ్చే తిరుమలగిరి తీసు కెళ్లాలని సూచించారు. నాణ్యత తక్కువగా ఉన్న పత్తిని మిల్లు వద్ద కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తే ఏం చేయాలన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు. మంత్రి అచ్చెన్నాయుడు కేంద్రానికి లేఖ రాశారని, నాణ్యత తక్కువగా ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనాలని కోరినట్లు తెలిపారు. నందిగామ ఏఎంసీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, అమ్మినేని జ్వాలాప్రసాద్ పాల్గొన్నారు.

అండర్-19 ఏపీ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా రాజేష్



జగ్గయ్యపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అండర్ - 19 ఏపీ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా జగ్గయ్యపేటకు చెందిన ఎన్ రాజేష్‌ను బీసీసీఐ నియమించినట్లు కోచ్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. జార్ఖండ్‌లో ఆదివారం నుంచి జరిగే క్రికెట్ పోటీకి ఏపీ క్రికెట్ జట్టుకు రాజేష్ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ బీసీసీఐ ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. కోచ్ బిహారీ ట్రోఫీకి గత ఏడాది స్పిన్నర్‌గా టీంలో చేరిన రాజేష్ తన ప్రతిభతో 34 వికెట్లు తీసి సత్తా చాటారు. బీవీ సాగర్ క్రికెట్ ఆకాడమిలో క్రికెట్‌లో శిక్షణ పొందిన రాజేష్ స్పిన్నర్‌గా రాటుతేలి జాతీయ స్థాయి క్రికెటర్‌గా ఎదిగాడు. ఎమ్మెల్యే తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, చైర్మన్ రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కెప్టెన్‌గా రాజేష్ రాష్ట్రానికి విజయాలు అందించాలని, త్వరలో భారత క్రికెట్ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

క్యాపిటల్ ఆసుపత్రిలో అరుదైన గుండె చికిత్స విజయవంతం



శస్త్రచికిత్స అనంతరం రవళి (ఎడమ వైపు)

పెనమలూరు, నవంబరు15 (ఆంధ్రజ్యోతి) : ఏపీ, తెలంగాణాల్లో ఇప్పటి వరకు ఉన్న ఆట్రియల్ సెప్టల్ డిఫెక్టు లేకుండా ఐసోలేటెడ్ కుడివైపు పాక్షిక క్రమరహిత పల్మనరీ వీనస్ కనెక్షన్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ హేమకృష్ణ సాయి కడియాల తెలిపారు. మచిలీపట్టణానికి చెందిన రవళి (29) అనే గృహిణికి ఇద్దరు సంతానం. క్రమంగా ఆమెకు శ్వాస ఆడకపోవడం, అలసటతో బాధపడుతుండడం జరుగుతోంది. గతంలో ఆమెను హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రిలో చూపించారు. విజయవా డ, చుట్టుప్రక్కల ఆసుపత్రుల్లో ఆమె కు శస్త్ర చికిత్స నిరాకరించారు. దీంతో ఆమె ఆసుపత్రికి చెందిన డాక్టర్ హేమకృష్ణసాయిని సంప్రదించారు. ఇది పెద్దవారిలో వచ్చే అత్యంత సవాలుతో కూడిన, పుట్టుకతో వచ్చే అరుదైన వ్యాధి అని గ్రహించిన డాక్టర్ హేమకృష్ణసాయి క్రమరహిత పల్మనరీ సిరలను ఎడమ కర్ణికకు జాగ్రత్తగా మళ్లించి సర్జరీని విజయవంతంగా ముగించారు. 20 రోజుల ఇంటెన్సివ్ చికిత్స తర్వాత రవళి కోలుకొని సురక్షితంగా డిశ్చార్జి అయినట్లు తెలిపారు. ఈ సర్జరీ ఆసుపత్రి అధునాతన గుండె సంరక్షణ సామర్థ్యాలను, బహుళ విభాగపు విధానాల సామర్థ్యాలను తెలియజేస్తుందని ఎండీ డాక్టర్ మన్నె హరీష్ తెలిపారు.



నాఫ్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్

పంట రుణపరిమితి పెంచాలి : నెట్టెం

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పంట రుణ పరిమితిని పెంచి గ్రామీణ సహకార వ్యవస్థకు చేయూతనివ్వాలని కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ సూచించారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్కాబ్) చైర్మన్, కరీంనగర్ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం కేడీసీసీ బ్యాంకు రీజినల్ కార్యాలయంలో శనివారం నెట్టెం రఘురామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావును నెట్టెం శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. కోఆపరేటివ్ రంగ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. డీసీసీబీ పరిధిలోని సహకార సొసైటీల ఆర్థిక బలోపేతం కోసం చర్యలను వివరించారు. ప్రస్తుతం ఉన్న రూ.40 లక్షల క్రెడిట్ లిమిట్‌ను పెంచాలన్నారు. రైతులకు పంట రుణాల పరిమితి చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు మరింత చేయూత అందించాలన్నారు. అత్యుత్తమ పనితీరుతో గుర్తింపు పొందిన కరీంనగర్ డీసీసీబీకి రావాలని నెట్టెం రఘురాంను రవీందర్‌రావు ఆహ్వానించారు. కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యాం మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని తీసుకొచ్చి వదిలేశాడు!

బస్‌స్టేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి శ్రీకాకుళం జిల్లా నుంచి విజయవాడ బస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి, ఆమె వద్ద బంగారు ఆభరణాలు, నగదు, ఫోన్ తీసుకుని ఆమెను బస్‌స్టేషన్‌లో వదిలేసి పారిపోయాడో ప్రబుద్ధుడు. విధుల్లో ఉన్న కృష్ణలంక పోలీసులు ఆమెను వివరాలు అడిగి తెలుసుకుని స్టేషన్‌కు తీసుకువెళ్లిన సంఘటన శనివారం జరిగింది. శ్రీకాకుళం జిల్లా సీతమ్మపేటకు చెందిన ఓ వ్యక్తి (34) స్థానికంగా కూలి పనులు చేసుకుంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన యువతి (24)ని ప్రేమించినట్లు నటించి వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు. ఇంటిలో పెద్దలు ఒప్పుకోకపోవటంతో శుక్రవారం ఆమె ఇంటిలోని నగదు, బంగారు ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని అతనితో పాటు హైదరాబాద్ వెళ్లి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని బస్సులో విజయవాడకు వచ్చారు. శనివారం తెల్లవారుజామున బస్‌స్టేషన్‌లో కొద్దిసేపు గొడవపడ్డారు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్ తీసుకుని పారిపోయాడు. కృష్ణలంక పోలీసులు ఆమెకు భోజనం పెట్టించి ధైర్యం చెప్పారు. వివరాలు ఆమె చెప్పటంతో సీసీ ఫుటేజీని పరిశీలించి అతని వివరాలు తెలుసుకున్నారు. పారిపోయిన వ్యక్తిని గంట వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకువెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. నగదు, బంగారు ఆభరణాలు యువతికి ఇప్పించారు. ఆమె తల్లిదండ్రులు వచ్చిన తరువాత ఆమెను వారికి అప్పగించారు.

పరిశ్రమలకు పెద్దవరం

● అందుబాటులో ఏపీఐఐసీ భూములు
● గతంలోనే టీడీపీ ప్రభుత్వం కేటాయింపు
● వైసీపీ విధ్వంస పాలనతో వెలవెల
● విశాఖ సదస్సులోని ప్రతిపాదనలకు సానుకూలం



పెద్దవరంలో ఏపీఐఐసీకి కేటాయించి పరిశ్రమలకు అనుకూలంగా ఉన్న భూమి

పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం రూట్‌మ్యాప్ సిద్ధం చేయడంతో అందరి దృష్టి పెద్దవరం ఏపీఐఐసీ భూములపై పడింది. ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుతో పాటు ప్రతిష్ఠాత్మకంగా విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగిన నేపథ్యంలో పెద్దవరం దశ మారబోతోంది.

(ఆంధ్రజ్యోతి, నందిగామ)

సహజ వనరులతో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఉండే పెద్దవరం భూములను గతంలోనే టీడీపీ ప్రభుత్వం గుర్తించింది. కొండలు, గుట్టల నడుమ జనావాసాలకు దూరంగా ఉండడంతో పాటు పరిశ్రమల నీటి అవసరాలను తీర్చేలా కృష్ణానదీ జలాలు పుష్కలంగా ఉన్నాయి. సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పెద్దవరంలోని 1120 ఎకరాల భూమిని సేకరించింది. ఈ భూమిని ఏపీఐఐసీకి అప్పగించి పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పెద్దవరంలో మైనూర్ సర్ప్లస్ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో కొంత భూమినిపేద, మధ్య తరగతి రైతులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. దీంతో ఆ భూములను విడిచి పెట్టి మిగిలిన 515 ఎకరాల భూమిని ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది. సదరు భూమిని ఏపీఐఐసీ అభివృద్ధి చేసింది. పటిష్ఠమైన రోడ్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసింది. మంచినీటి సరఫరాకు పైప్‌లైన్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. ఇండస్ట్రియల్ ప్లాట్లుగా భూమిని తీర్చిదిద్దింది. పలు రాయితీలు కల్పిస్తూ పారిశ్రామిక వేత్తలకు రెడ్‌కార్పెట్ పరిచింది. దీంతో పలువురు పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చారు. పరిశ్రమ సామర్థ్యాన్ని, దాని అవసరాన్ని బట్టి భూములు కేటాయించింది.

ప్రజాప్రతినిధులు ఏం చేయాలంటే..

ఎన్టీఆర్ జిల్లాకు పరిశ్రమలు తీసుకురావడానికి జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సి ఉంది. కనీసం ఐదారు భారీ పరిశ్రమల ఏర్పాటు జరిగితే ఈ ప్రాంతం పూర్తి స్థాయి అభివృద్ధి చెందుతుంది. జగ్గయ్యపేట ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమల స్థాపనకు పెద్దయెత్తున అనుమతులు ఇచ్చింది. ఇంత వరకూ సదరు పరిశ్రమల ఏర్పాటు జరగలేదు. సదరు లైసెన్స్‌దారులను కూడా పిలిపించి పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానించాల్సి ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల దృష్టికి పెద్దవరం భూములను తీసుకెళ్లి పరిశ్రమల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సి ఉంది.

వైసీపీ విధ్వంసకర పాలనతో విఘాతం

అప్పట్లో ఏపీఐఐసీ సుమారు 76 ఎకరాల భూమిని వివిధ పరిశ్రమలకు కేటాయించింది. అయితే వైసీపీ విధ్వంసకర పాలనా విధానాలతో పారిశ్రామిక వేత్తలు పరారయ్యారు. ఏపీఐఐసీ భూములు వెలవెల బోయాయి. కోట్లాది రూపాయల ఏపీఐఐసీ నిధులతో అభివృద్ధి పరిచిన రోడ్లు, విద్యుత్ స్తంభాలు నిరుపయోగంగా మారాయి. చివరకు సదరు భూములలోని మట్టిని వైసీపీ నేతలు అక్రమంగా తవ్వుకొని అమ్ముకున్నారు.

యువత ఎదురుచూపులు

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్న ఆశతో యువత ఎదురుచూస్తోంది. రియల్ ఎస్టేట్ పుంజుకొని భూములకు ధరలు వస్తాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. పెద్దవరం ప్రాంతంలో ఏపీఐఐసీ భూములకు దగ్గరలో క్రక్స్ బయోటెక్ సంస్థ డిస్టిలరీ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. సుమారు వెయ్యి కుటుంబాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ లబ్ధి పొందుతున్నాయి. అదే సంస్థ కొత్తగా ఇథనాల్ పరిశ్రమను కూడా ఏర్పాటు చేసింది. దీని వల్ల మరో ఐదు వందల కుటుంబాలకు ఉపాధి కలగనుంది. ఉపాధి అవకాశాలు రావడంతో ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు పెరిగాయి. ఒక్క పరిశ్రమకే ఇంత మేర ప్రజలకు మేలు జరిగింది. అదే తీరున ఏపీఐఐసీ భూములలోకి పదుల సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటు జరిగితే ఇక ఏ మేర లబ్ధి చేకూరుతుందన్నది అంచనాకు అందని స్థితి. ఇప్పటికే భూములు తీసుకున్న పారిశ్రామికవేత్తలను కదలించడంతో పాటు మిగిలి భూములలో కూడా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది. ఎంఎస్ఎంఈ ద్వారా చిన్న పరిశ్రమలతో పాటు విశాఖ పెట్టుబడుల సదస్సులో కూడా పెద్దవరం భూములపై దృష్టి సారించి ఉంటారని భావిస్తున్నారు.

విదేశీ పర్యాటకుల కదలికలపై పటిష్ట నిఘా

● సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విదేశీ పర్యాటకుల రాకపోకలు, కదలికలపై పటిష్ట నిఘా పెట్టినట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులతో ఇమిగ్రేషన్ వీసా రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాకు పర్యటన నిమిత్తం వచ్చే విదేశీయులు ఏ హోటల్స్‌లో ఉంటున్నారనే విషయాలను ఆయా హోటల్స్ సిబ్బంది తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. విదేశీయుల గోప్యతకు భంగం కలగకుండా భద్రతను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన నిఘా ఏర్పాటుచేయాలని స్పష్టమైన ఆదేశాలను జారీ చేశామన్నారు. ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్-2025పై అవగాహన కల్పించారు. అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత, డీసీపీ బి.లక్ష్మీ నారాయణ, ఏసీపీలు దుర్గారావు, స్రవంతి రాయ్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన క్రీడాకారులకు న్యాయం చేయాలి

● జాతీయ కబడ్డీ జట్టు మాజీ కోచ్ పద్మజాబాల

లబ్బీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతిభావంతులైన కబడ్డీ క్రీడాకారులకు న్యాయం చేయాలని జాతీయ కబడ్డీ జట్టు మాజీ కోచ్ పద్మజాబాల ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కబడ్డీ జట్ల ఎంపికలో జరుగుతున్న అవకతవకలపై శాప్ అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలూ లేవని, శాప్ యంత్రాంగం కొంతమందికి మాత్రమే కొమ్ముకాస్తూ దళారీ వ్యవస్థకు వేదికగా నిలుస్తోందన్నారు. అవకతవకలపై ప్రభుత్వ పెద్దలను సంప్రదించగా సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసినా శాప్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సమస్యలకు పరిష్కారం చూపకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

కాస్ట్ అకౌంటింగ్‌పై ప్రతిభా పరీక్ష

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులకు శనివారం ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా - విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో కాస్ట్ అకౌంటింగ్ అవగాహనపై ప్రతిభా పరీక్ష నిర్వహించారు. మొత్తం 143 పాఠశాలల నుంచి 870 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందజేస్తారు. ప్రథమ బహుమతిగా రూ.1000, ద్వితీయ బహుమతిగా రూ.500 ప్రకటించారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా - విజయవాడ చాప్టర్ సెక్రటరీ సుంకర నాగపూర్ణిమ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి వంగవీటి రంగా కుమార్తె

● నేడు విజయవాడలో తండ్రి విగ్రహానికి ఆశకిరణ్ నివాళి
● అనంతరం మీడియా సమావేశంలో స్పష్టతనిచ్చే అవకాశం



విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహన రంగా తనయ వంగవీటి ఆశకిరణ్ రాజకీయ ప్రవేశం చేయబోతున్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటలకు బందరు రోడ్డులో ఉన్న తన తండ్రి స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తారు. తన రాజకీయ రంగ ప్రవేశానికి సంబంధించి అధికారికంగా స్పష్టతనివ్వడానికి ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారన్న అంశాన్ని ఆమె గుంభనంగా ఉంచారు. కొద్దిరోజులుగా ఆశ తన తండ్రి రంగా వెంట నడిచిన వారితో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్టు ఆమె వారి ముందు తన అభిప్రాయాన్ని చెప్పినట్టు తెలుస్తోంది. రంగా వెంట నడిచిన వారంతా ఆశ రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న నిర్ణయాన్ని స్వాగతించినట్టు సమాచారం. దీంతో ఆశ తన తండ్రి స్ఫూర్తితో రాజకీయాల్లోకి ప్రవేశంతో పాటు ఏ పార్టీలో చేరే అవకాశం ఉందన్న వివరాలను కూడా తెలియపరిచే అవకాశం ఉంది. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఆశకిరణ్ ఇటీవలే విజయవాడ వచ్చారు. విజయవాడ వచ్చిన క్రమంలో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

దళిత మహిళల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలి

మొగల్రాజపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దళిత మహిళల అభివృద్ధికి ప్రత్యే నిధులు ఇవ్వాలని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు డి.రమాదేవి అన్నారు. కులవివక్ష పోరాట సమితి అధ్వర్యంలో మొగల్రాజపురంలోని పూలే అంబేద్కర్ భవనంలో శనివారం మహిళలు-సామాజిక న్యాయంపై సదస్సు జరిగింది. దళిత మహిళల పట్ల వివక్ష కొనసాగుతుండడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్ష ఉద్యమాలతో కొన్ని చట్టాలు వచ్చినా, అభద్రత కొనసాగుతూనే ఉందన్నారు. శ్రామిక మహిళ కన్వీనర్ కె.ధనలక్ష్మి మాట్లడుతూ మహిళల మీద దాడులు పెరుగుతూనే ఉన్నా యన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రమాల్యాద్రి మాట్లాడుతూ కామాంధులకు ఉపయోగపడేలా ప్రభుత్వాలు చేస్తున్న చట్టాలను వ్యతిరేకిస్తూ ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె. శ్రీదేవి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నల్లప్ప, కె.రంగమ్మ, యండి ఆనంద్‌బాబు, తిరుకోట చిరంజీవి, గుండిమెడ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసలు గుట్టు చెప్పండి

● పోలీసు కస్టడీకి 'అద్విక' నిందితులు
● తాజాగా మరో ఏజెంట్ అరెస్టు

విజయవాడ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : రూ.లక్ష ఇవ్వండి..నెలకు రూ.6 వేలు వడ్డీ పొందండి అంటూ పెట్టుబడులు సేకరించి బోర్డు తిప్పేసిన అద్విక ట్రేడింగ్ అండ్ ప్రైవేటు లిమిటెడ్ కేసులో లెక్కలను పూర్తిస్థాయిలో తేల్చడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తాడేపల్లి శ్రీ వెంకట ఆదిత్య, అతడి భార్య సుజాత, ఏజెంట్ బాలకృష్ణను పోలీసులు విజయవాడ జైలు నుంచి శనివారం కస్టడీకి తీసుకున్నారు. ముందుగా వారికి విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం సెంట్రల్ జోన్ ఏసీపీ కార్యాలయంలో విచారించారు. సుమారుగా 50 ప్రశ్నలు వారికి సంధించించారు. క్రైమ్ డీసీపీ పి.తిరుమలేశ్వరరెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ లతాకుమార్, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదరరావు ముగ్గురు నిందితులను విచారించారు. ముఖ్యంగా దుబాయ్‌లో కబానా ట్రేడింగ్ కంపెనీకి మళ్లించిన నిధుల గురించి ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ ఖాతాలో ఎలాంటి నిధులు లేవని చెప్పినట్టు సమాచారం. వాస్తవానికి ఖాతాదారులు, ఏజెంట్ల నుంచి సేకరించిన నిధులను హవాలా మార్గంలో కబానా సంస్థకు మళ్లించాడు. చాలా ప్రశ్నలకు ఆదిత్య అతి తెలివిగా సమాధానాలు ఇచ్చినట్టు తెలిసింది. ఖాతాదారులు, ఏజెంట్లకు అగ్రభాగం చెల్లింపులు చేశానని చెప్పినట్టు సమాచారం. ఈ ముగ్గురిని ఆది, సోమ వారాలు విచారిస్తారు. ఈ కేసులో లెక్కలు తేలాల్సిన మరో రూ.40-50 కోట్లపైనే పోలీసులు దృష్టి పెట్టారు.

మరో ఏజెంట్ అరెస్టు

అద్వికలో పలువురితో పెట్టుబడులు పెట్టించి భారీగా ఆదాయాన్ని వెనుకేసుకున్న ఏజెంట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఒంగోలుకు చెందిన గొంది సురేష్ అద్వికలో రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. కమీషన్ల రూపంలో మొత్తం రూ.3.50 కోట్ల వరకు తీసుకున్నాడు. సురేష్ ఆరు రెట్లు లాభాన్ని పొందాడు. ఈ మొత్తం తిరిగి చెల్లించాలని పోలీసులు పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అతడి నుంచి స్పందన లేకపోవడంతో పోలీసులు అరెస్టు చేశారు.

చెత్తకు బదులుగా నిత్యావసరాలు : కొమ్మారెడ్డి

జగ్గయ్యపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చెత్తకుండీలు, డంపింగ్ కేంద్రాలు లేని రాష్ట్రంగా చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. జగ్గయ్యపేట పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చైర్మన్ రంగాపురం రాఘవేంద్రలతో కలిసి అధికారులతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలును సమీక్షించారు. కొమ్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టించే దిశగా ఆలోచన చేసిందన్నారు. 100 మండలాల్లో స్వచ్ఛ రథం పేరిట ప్రజల నుంచి చెత్తకు ప్రత్యామ్నాయంగా నిత్యావసరాలు అందించబోతున్నామని చెప్పారు. చెత్తను శుద్ధి చేసే ప్రక్రియ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జగ్గయ్యపేటలో అమలు చేస్తున్నామన్నారు. జగ్గయ్యపేట పురపాలక సంఘానికి చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్టు పట్టాభి ప్రకటించారు. 50శాతం సబ్సిడీపై రెండు ఎలక్ట్రిక్ కంపాక్ట్ వాహనాలను, 10 ఎలక్ట్రిక్ ఆటోలను చెత్త సేకరణకు ఉచితంగా అందిస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి కంపోస్ట్ యార్డులో చెత్త శుభ్రం చేశాక ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ సహకారంతో పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. స్వచ్ఛాంధ్ర ర్యాలీలను శివారు ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్యం కలిగించేలా నిర్వహించాలని ఎమ్మెల్యే తాతయ్య అధికారులకు సూచించారు. చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఇస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, కమిషనర్ టి.విక్టర్షారావు, తహసీల్దార్ మనోహర్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాయక్ సోదరుల ఇష్టారాజ్యం

● రిజిస్టర్ బయటకు తీసుకెళ్లి తమకు అనుకూలంగా అటెండెన్స్
● తాము చెప్పిన పని చేయని సెక్యూరిటీ సిబ్బందికి బెదిరింపులు

ఇంద్రకీలాద్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో నాయక్ సోదరుల హవా కొనసాగుతోంది. దేవస్థానంలోని ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ తాము చెప్పిందే వినాలంటూ సెక్యూరిటీ విభాగం సిబ్బందిని ఆదేశిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెప్పింది వినకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు సెక్యూరిటీ గార్డులు వాపోయారు.

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భద్రతా బాధ్యతలను ఏజెల్ సెక్యూరిటీ సంస్థ నిర్వహిస్తోంది. దేవస్థానంలో మొత్తం 150 మంది పని చేస్తున్నారు. వీరిలో ఎస్ఓ ఒకరు, పది మంది సూపరింటెండెంట్‌లు, 76 మంది మహిళా సెక్యూరిటీ సిబ్బంది, 63 మంది పురుషులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో పనిచేస్తున్న నాయక్ సోదరులు మరో ఉద్యోగితో కలిసి ముఠాగా ఏర్పడి తమ హవా కొనసాగిస్తున్నారు. తామే ఎస్ఓలమంటూ, తాము చెప్పిన పని చేయాలని, లేకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుర్గగుడి ప్రాంగణంలోని సెక్యూరిటీ విభాగం కార్యాలయంలో ఉండాల్సిన సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌లను వారు తమ అనుచరులతో బయటకు పంపించి అటెండెన్స్‌ను తారుమారు చేస్తున్నట్లు పలువురు ఉద్యోగులు బహిరంగంగా చెబుతున్నారు. కార్యాలయంలో ఉండాల్సిన రిజిస్టర్‌లను బయటకు ఎందుకు తీసుకువెళుతున్నారని ఆలయ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మల్లికార్జునపేట ఉప్పరవాగు సెంటర్‌లో ఉంటున్న నాయక్ సోదరులు ప్రతిరోజూ అటెండెన్స్ రిజిస్టర్‌లను తమ ఇళ్లకు తీసుకువెళ్లి తమకు అనుకూలంగా రాసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. విధులకు హాజరు కాని సిబ్బందిని హాజరైనట్లు రిజిస్టర్‌లో నమోదు చేసి, వారికి వచ్చే వేతనాన్ని ప్రతి నెలా పంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు సెక్యూరిటీ విభాగంపై పర్యవేక్షణ సక్రమంగా లేకపోవటంతో నాయక్ సోదరుల హవా కొనసాగుతోందని దేవస్థానం ఉద్యోగులు చెబుతున్నారు. దేవస్థానం ఉన్నతాధికారులు స్పందించి దుర్గగుడి ప్రైవేటు సెక్యూరిటీ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు సిబ్బంది, దేవస్థానం ఉద్యోగులు కోరుతున్నారు.

అటెండెన్స్ రిజిస్టర్ బయటకు తీసుకువెళ్లిన వారిపై చర్యలు

దుర్గగుడి ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో అటెండెన్స్ రిజిస్టర్ బయటకు వెళ్లటంపై ఆ విభాగం ఏఈవో ఎన్.రమేష్ బాబును వివరణ కోరగా, రిజిస్టర్ బయటకు తీసుకువెళ్లటం నేరమేనన్నారు. దానిని బయటకు తీసుకువెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రికార్డులు బయటకు తీసుకువెళ్లటంపై విచారిస్తామని, అందుకు బాధ్యులైన వారిపై ఈవోకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు

-ఎన్.రమేష్ బాబు, ఏఈవో

చలో సింగపూర్

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఇండిగో విమానానికి జెండా ఊపి సింగపూర్‌కు ప్రారంభించారు. శనివారం ఉదయం 7.30 గంటలకు 140 మంది ప్రయాణికులతో ఈ విమానం ఇక్కడికి వచ్చింది. అనంతరం 10.30 గంటలకు 123 మంది ప్రయాణికులతో సింగపూర్ వెళ్లింది.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు

సింగపూర్ నుంచి విజయవాడ వచ్చిన ప్రయాణికులు, విజయవాడ నుంచి సింగపూర్ వెళ్తున్న ప్రయాణికులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఫొటోలతో కూడిన మినీ పోస్టర్లను ప్రదర్శించారు. వారిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ ఎయిర్‌పోర్టుకు పూర్వవైభవం : యార్లగడ్డ వెంకట్రావు

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గతంలో విజయవాడ ఎయిర్‌పోర్టుకు వచ్చే విమానాల సంఖ్య తగ్గిందని, ప్రస్తుతం 45 విమానాలు తిరుగుతున్నాయని, రోజూ 4 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. 50 శాతం విమానాలు పెరిగాయని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో సింగపూర్‌కు విమానం తిరిగేదని, వైసీపీ దానిని రద్దు చేసిందని చెప్పారు. తాజాగా కేంద్రమంత్రి రామ్మోహనాయుడు చొరవతో ఇండిగో విమాన సంస్థ ముందుకొచ్చి సింగపూర్‌కు సర్వీసు నడుపుతోందన్నారు. కృష్ణా, గుంటూరు, గోదావరి, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లోనే ఎన్నారైలు ఎక్కువగా ఉన్నారని, వారికి రాకపోకలు సాగించేందుకు దగ్గరగా ఉంటుందన్నారు. విమానాశ్రయానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. రాబోయే 7 నెలల్లో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుందని తెలిపారు.

సంతోషంగా ఉంది : ప్రయాణికుడు

గన్నవరం విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసును ప్రారంభించటం సంతోషం. ఐదేళ్ల తరువాత మళ్లీ సింగపూర్ సర్వీసును ఏర్పాటు చేయటం బాగుంది. ఇంతకుముందు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లి సింగపూర్ వెళ్లాల్సి వచ్చేంది. ఇప్పుడు డైరెక్ట్‌గా సింగపూర్ విమానం ఎక్కడం హ్యాపీగా ఉంది.

సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక నేడు

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ బాలుర, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి కె.దిలీప్ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హజరుకావా లన్నారు.

హద్దులు దాటి..

(5వ పేజీ తరువాయి)

హైదరాబాదుకు తరలిస్తున్నారు.

స్పందించని అధికారులు

ఇసుక అక్రమ రవాణా కట్టడి విషయమై మిగతా ప్రభుత్వ శాఖల అధికారులు పెద్దగా స్పందించట్లేదు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, రవాణా, మైనింగ్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు కేసుల భారం, పని ఒత్తిడితో సతమతమవుతున్న పోలీసులకు ఇసుక అక్రమ రవాణా మరో సమస్యగా మారింది. కాసులకు కక్కుర్తి పడే వారికి లాభదాయకం కాగా, నిజాయితీగా పనిచేసే వారికి మాత్రం ఇదో పెద్ద తలనొప్పిగా మారింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం నిత్యాన్నదాన పథ కానికి మొగల్రాజపురానికి చెందిన వై.అశోక్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరా ళంగా శనివారం అలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. ఏఈవో బి.వెంకటరెడ్డి, టెంపుల్ సూపరింటెండెంట్ వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.



అనాథాశ్రమానికి వీపీ సిద్ధార్థ విద్యార్థుల వితరణ

మొగల్రాజపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం పురస్కరించుకుని వీపీ సిద్ధార్థ విద్యార్థులు సేకరించిన నిత్యావసర వస్తువులను కానూరు అనాథాశ్రమం కార్యదర్శికి శనివారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య మాట్లాడుతూ 440కేజీలు బియ్యం, వంటనూనె, గోధుమ రవ్వ, గోధుమ పిండి, పంచదార, సబ్బులు, బట్టల సబ్బులు, విమ్ సబ్బులు, సర్ఫ్, మినపగుండ్లు , పెసరపప్పు, చింతపండు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ వర్ధంతి



సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

భారతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూపర్ స్టార్ కృష్ణ 3వ వర్ధంతి వేడుకలు శనివారం గురునానక్ రోడ్డులోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో కృష్ణ అభిమానులు ఎస్.చంటి, వీఎల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. తొలుత పార్కులోని కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్మల భవన్‌లో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేత హష్వితకు అభినందనలు



హష్వితను అభినందిస్తున్న లలిత ప్రసాద్, తదితరులు

విజయవాడస్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 5 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కేటింగ్ క్రీడా పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని పి.హష్విత 4 బంగారు పతకాలు సాధించినట్లు వీపీ సిద్ధార్థ కళాశాల క్రీడా విభాగాధిపతి టీవీబీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని హష్వితను కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల కుమారి తదితరులు అభినందించారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్బీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 19వ డివిజన్ లబ్బీపేట వైవీ రావు హాస్పటల్ వద్ద ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 50మందికి మంజూరైన రూ.36లక్షల విలువైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు అండగా ఉంటున్నారని తెలిపారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు భాగం సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కియా ఓనర్‌షిప్ సర్వీస్ క్యాంప్ ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న డైరెక్టర్ రావెళ్ల తారక రస్య

భారతీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కియా అధీకృత డీలర్ సింహ కియా తమ విజయవాడ షోరూమ్‌లో శనివారం ఓనర్‌షిప్ సర్వీస్ క్యాంప్‌ను సింహ మోటార్స్ డైరెక్టర్ రావెళ్ల తారక రస్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రస్య మాట్లాడుతూ శనివారం(15వ తేదీ) నుంచి 23 వరకు నిర్వహించనున్న ఈ క్యాంప్‌లో కస్టమర్ల కోసం కారు బాడీ వాష్, కారు కేర్ సర్వీస్‌లో 20శాతం తగ్గింపు, కాంప్లిమెంటరీ వెహికల్ హెల్త్ చెకప్, యాక్సెసరీస్‌లో 10శాతం తగ్గింపు, కారు ఎక్స్ఛేంజ్ ఉచిత ఎవాల్యూవేషన్ వంటి పలు రకాల ఆఫర్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయాలను కియా కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8688836577, 7799981533 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

ఏసీపీ మోహన్‌బాబు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్పెషల్ ఆఫీసర్ మోహన్‌బాబు

రాణిగారితోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని 17వ డివిజన్ స్పెషల్ ఆఫీసర్, ఏసీపీ మోహన్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం 17వ డివిజన్‌లో ఆశావర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై, సైడ్ కాల్వల్లో చెత్త వేయకుండా ఇంటి ముందుకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చుకోవడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని, ప్రభుత్వం అనేక రాయితీలు ఈ పథకానికి అందజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, వాణి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కొప్పొలు శ్రీనివాస చౌదరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ సందీప్, మేస్త్రీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌లో జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

గుణదల: పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆలయాలు, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛభారత్ నిర్వహణలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిపేందుకు సహకరించాలని మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పాతూరి లోకేశ్వరి కోరారు. స్వచ్ఛ శనివారం కార్యక్రమంలో భాగంగా దాసాంజనేయస్వామి ఆలయ సిబ్బంది ఆలయ పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు.



మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

వివంతలో సందడిగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్



విజయవాడ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని హోటల్ వివంతలో శనివారం సాయంత్రం కేక్ మిక్సింగ్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో పలువురు విదేశీ, ఇతర రాష్ట్రాల వనితలు పాల్గొని సందడి చేశారు. డ్రైఫ్రూట్స్, నట్స్, గ్రెయిన్స్, స్పైసెస్‌కు ఆల్కహాల్‌కు కలిపి మిక్స్ చేశారు. హోటల్ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, చెఫ్ నిర్మల్ సారథ్యంలో కేక్ మిక్స్ చేశారు. మిక్స్ చేసిన ఈ పదార్థాలతో క్రిస్మస్ నాటికి కేక్ తయారు చేస్తామని హోటల్ నిర్వాహకులు తెలిపారు. వేదిక వద్ద యువతీయవకులు స్టెప్‌లతో సందడి చేశారు.



వారోత్సవాలను ప్రారంభిస్తున్న సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

శిశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శిశువుల ఆరోగ్యం పట్ల వైద్యులు, చిన్నారుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావు సూచించారు. జాతీయ నూతన శిశు అవగాహన వారోత్సవాలను నగరంలోని పాత ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నూతనంగా జన్మించిన శిశువులను సంరక్షించుకోవాలన్నారు. శిశు మరణాలను తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారం రోజుల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని, దీనిలో భాగంగానే విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వక్తృత్వ, వ్యాసరచన, స్కిట్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ విభాగం అధిపతి డాక్టర్ అనిల్, ప్రొఫెసర్‌లు డాక్టర్ సునీత, డాక్టర్ రాఘవరావు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ ఇందిరా, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ మంగాదేవి పాల్గొన్నారు.

శివలింగానికి ప్రత్యేక పూజలు



ఉత్పన్న ఏకాదశి సందర్భంగా భారతీనగర్-గురునానక్ కాలనీలోని శివాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా బిర్సా ముండా జయంతి



బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, ఆదివాసుల ఆరాధ్య దైవం బిర్సా ముండా జయంతి కార్యక్రమం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం గురునానక్ కాలనీలోని ఎంపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగింది. టీడీపీ నాయకుడు, నేషనల్ కమిషన్ మాజీ మెంబర్ మాదిగాని గురునాధం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ అధికారి ఎం.ఫణి దూర్జటి అతిథిగా హాజరయ్యారు. ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫణి దూర్జటి మాట్లాడుతూ గిరిజనులు ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం అందించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. మాదిగాని గురునాధం, గిరిజన విద్యావేత్త డాక్టర్ జ్యోతిరావ్ నాయక్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బొప్పన భవకుమార్, డీబీఆర్‌సీ రీజనల్ కో-ఆర్డినేటర్ రమాదేవి, పార్టీ నాయకులు , గిరిజన నాయకులు, పాల్గొన్నారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురంలోని జనశిక్షణా సంస్థాన్ కార్యాలయంలో బిర్సాముండా జయంతి కార్యక్రమం జరిగింది. జనశిక్షణా సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాఖన్నా మాట్లాడుతూ బిర్సాముండా గిరిజన తెగలను ఏకం చేసి బ్రిటీషువారి మీద చేసిన పోరాటాన్ని వివరించారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ పి. వరలక్ష్మి, ప్రోగ్రాం అధికారి డి.కోటేశ్వరరావు, సంస్థాన్ శిక్షణార్థులు, శిక్షకులు , సిబ్బంది పాల్గొన్నారు.

కాస్ట్ అకౌంటింగ్‌పై ప్రతిభా పరీక్ష

విజయవాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థులకు శనివారం ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా- విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో అవేర్‌నెస్ ఆన్ కాస్ట్ అకౌంటింగ్ అంశంపై ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 143 పాఠశాలల నుంచి 870 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. ప్రతి పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి నగదు బహుమతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా- విజయవాడ చాప్టర్ సెక్రటరీ సుంకర నాగపూర్ణిమ, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీబీఎస్‌తో మూర్ఛను నియంత్రించొచ్చు

న్యూరోసర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ బాబ్జీ శ్యాంకుమార్

విజయవాడ: మందులతో మూర్ఛ వ్యాధి నియంత్రణలోకి రానప్పుడు డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) ద్వారా నియంత్రించవచ్చని జీజీహెచ్ న్యూరో సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ బాబ్జీ శ్యాంకుమార్ వెల్లడించారు. నవంబరు 17న జాతీయ ఎపిలెప్సీ డే సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహించే కార్యక్రమంలో మూర్ఛపై ప్రత్యేక అవగాహన కల్పిస్తామని శనివారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు.

అంతరిక్ష పరిశోధన వైపు దృష్టి మరల్చాలి

విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్త సునీల్ పిలుపు



మాట్లాడుతున్న సునీల్, శేషగిరిరావు

మొగల్రాజపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష పరిశోధన వైపు యువతరం దృష్టి మళ్లించాలని, ప్రైవేటు స్టార్టప్ స్పేస్ కంపెనీలకు కూడా మంచి అవకాశాలున్నాయని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(శ్రీహరికోట) డిప్యూటీ డైరెక్టర్(సిస్టం రిలయబిలిటీ) పి.సునీల్ తెలిపారు. శనివారం పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో భౌతికశాస్త్ర విభాగం అంతరిక్ష రంగంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సునీల్ మాట్లాడుతూ, స్పేస్ టూరిజం అభివృద్ధి చెందుతోందన్నారు. భారత్ అంతరిక్ష రంగంలో అగ్రగామిగా ఉందన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం(షార్) అసోసియేట్ డైరెక్టర్ వి.శేషగిరిరావు మాట్లాడుతూ ప్రస్తుతం 12 వేల ఉపగ్రహాలు వివిధ రకాల సేవలు అందిస్తుండగా, వచ్చే నాలుగేళ్లలో ఈ సంఖ్య 68 వేలకు చేరుకోబోతుందన్నారు. శాటిలైట్ డేటా సెంటర్లు రానున్నాయని, కొన్ని దేశాలు చంద్రుడిపై జీపీఎస్ ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను వీసీ డాక్టర్ పీవీరావు, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మేకా రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె

కార్పొరేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సఖి సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ శాఖ 35 సంవత్సరాలు దాటిన స్వయం సహాయక బృందాల మహిళలకు శనివారం పటమట హైస్కూల్ రోడ్డు కనకమేడల రవీంద్ర కుమార్ కల్యాణ మండపంలో ఉచిత వైద్య, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ శనివారం (నవంబరు 15) నుంచి ఈ నెల 20 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశిబిరాలు కొనసాగనున్నాయన్నారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా థైరాయిడ్, హిమోగ్లోబిన్, మూడు రకాల క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ సురేంద్ర, సీడీవోలు ఉమామహేశ్వరి, జగదీశ్వరి, టీఈ సుజాత, 11వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రాజేష్ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో అందుబాటులోకి రాని కంపాక్టర్

● పాతపద్ధతిలోనే చెత్త తరలింపు

ఆటోనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్‌లో సేకరించిన చెత్తను గుంటూరు జిల్లాకు తరలించేందుకు రూ. 1.16 కోట్లతో కొనుగోలు చేసిన చెత్త తరలించే వాహనమైన కంపాక్టర్ ఇంకా అందుబాటులోకి రాలేదు. ఈవాహనాన్ని మూడు రోజుల క్రితం అధికారికంగా ప్రారంభించారు. ఇంకా పాతపద్ధతిలోనే చెత్తను తరలిస్తున్నారు. దీంతో ఆటోనగర్‌లోని అన్ని ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తోన్నాయి. దీనిపై ఇలా కమిషనర్ కె. బాబ్జీని శనివారం ఆంధ్రజ్యోతి వివరణ కోరగా మరో రెండు రోజుల్లో చెత్తతరలింపునకు వినియోగిస్తామని చెప్పారు.


MEGA STAR AS COWBOY
Grand Re-Release
on 21st NOVEMBER
4K 5.1 Digital
SANDHYA 70 MM ఆర్టీసీ క్రాస్ రోడ్స్
Booking Opens Today


DR. NAGESHWAR RAO PUJARI PRESENTS
A WIN ORIGINAL PRODUCTION
రాజు weds రాంబాయి
NOVEMBER 21st RELEASE IN THEATERS
WRITTEN & DIRECTED BY SAILU KAAMPATI
PRODUCED BY VENU UDUGULA, RAHUL MOPIDEVI


GULSHAN KUMAR, BHUSHAN KUMAR & T-SERIES FILMS PRESENTS
TRAILER LAUNCH EVENT
ON 18TH NOV, 5PM ONWARDS @KURNOOL OUT DOOR STADIUM
DRONE SHOW
FIRST TIME EVER IN TELUGU CINEMA & KURNOOL
ANDHRA KING తాలూకా
MAHESH BABU .P
NAVEEN YERNENI Y RAVI SHANKAR
IN THEATRES 28TH NOV WORLDWIDE
BIOPIC OF A FAN


SRI LAKSHMI JYOTHI CREATIONS
WORLDWIDE IN THEATRES NOV 21
ACTION KING ARJUN AISHWARYA RAJESH
మఫ్టీ పోలీస్
WRITTEN & DIRECTED BY DINESH LAKSHMANAN
PRODUCED BY G ARULKUMAR
TAMIL - TELUGU - KANNADA - MALAYALAM


ప్రేమంటే
Thrill-u Praptirasthu!
IN CINEMAS 21ST NOV, 2025 WORLDWIDE


సిస్టర్ రాణి మరియ గారి యదార్థ గాథ:
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్ (క్షమాపణ గాథ) తెలుగు లో...
2024 ఆస్కార్ అవార్డు కోసం నామినేట్ చేయబడిన చిత్రం
THE FACE OF THE FACELESS
ద ఫేస్ ఆఫ్ ద ఫేస్లెస్
2024 సంవత్సర ఉత్తమ క్రైస్తవ చిత్రం
123 అంతర్జాతీయ అవార్డులు
SHAISON P. OUSEPH
SANDRA D'SOUZA RANA
RANJAN ABRAHAM
TRI LIGHT CREATIONS
నవంబర్ 21 విడుదల


ANYUKTH RAM PICTURES
WORLD WIDE RELEASE
DECEMBER 12 2025
CH. RAMA RAO'S
ఘంటసాల THE GREAT
PRODUCER Mrs CH. PHANI
DIRECTOR CH. RAMA RAO
KARRI BALAJI VASU RAO SALURI VENU MURALIDHAR .V DR. SHYAM KUMAR .P


RETRO BLOCKBUSTER
SPIRIT MEDIA AND WAYFARER FILMS PRESENT
DULQUER SALMAAN IN
కాంత
WRITTEN & DIRECTED BY SELVAMANI SELVARAJ
IN CINEMAS NOW





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ట్రైన్ డ్రీమ్స్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 21
అమెజాన్ ప్రైమ్		
ది ఫ్యామిలీ మ్యాన్3	హిందీ సిరీస్	నవంబర్ 21
జియో హాట్‌స్టార్		
ల్యాండ్ మాన్	వెబ్‌సిరీస్	నవంబర్ 17
ది రోజెస్	హాలీవుడ్ మూవీ	నవంబర్ 20
జిద్దీ ఇష్క్	హిందీసిరీస్	నవంబర్ 21

చలికాలంలో చామంతి మొక్కలు ఇలా


చల్లని వాతావరణంలో చామంతి మొక్కలు సులువుగా నాటుకుని గుబురుగా పెరుగుతాయి. వీటికి ఎక్కువగా ఎరువుల అవసరం ఉండదు. చలి కాలంలో చామంతి మొక్కలకు ఎలాంటి సంరక్షణ అందించాలో తెలుసుకుందాం...


- చామంతి మొక్కలను నేలమీద, కుండీల్లో కూడా పెంచవచ్చు. మట్టి.. మరీ పొడిగా లేదా మరీ తడిగా ఉండకూడదు. నీటిని నిల్వ ఉంచే మెత్తటి మట్టి కాకుండా కొద్దిగా ఇసుక మాదిరి ఉండేదాన్ని తీసుకుంటే మొక్క బాగా పెరుగుతుంది. కుండీని సగానికి పైగా మట్టితో నింపి అందులో సేంద్రియ ఎరువులు వేసి బాగా కలపాలి. తరువాత ఒకటి లేదా రెండు చామంతి మొక్కలను కలిపి నాటాలి. అదే నేలమీద అయితే మొక్కల మధ్య కనీసం ఆరు అంగుళాల దూరం ఉండేలా చూసుకోవాలి.
- చామంతి మొక్కలకు రోజూ మూడు లేదా నాలుగు గంటలపాటు ఎండ తగిలేలా చూసుకోవాలి. ఎండ తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే మొక్కలపై నీడ పడేలా ఏర్పాటు చేయాలి. నిరంతరం గాలి వీస్తూ ఉంటే ఎక్కువగా పూలు పూస్తాయి.
- చామంతి మొక్కలకు ఎక్కువగా నీరు పోయకూడదు. కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మట్టిలో నీరు నిలిస్తే మొక్క వేళ్లు కుళ్లి పోయే ప్రమాదం ఏర్పడుతుంది.




- మొగ్గలు వచ్చే సమయంలో కొద్దిగా పొటాషియం, బోన్ మీల్‌లను నీటిలో కలిపి మొక్కలకు అందిస్తే పూలు పెద్దగా పూస్తాయి.
- పదిహేను రోజులకోసారి నీళ్లలో కొద్దిగా వేపనూనె కలిపి మొక్కలపై పిచికారీ చేస్తే క్రిమి కీటకాలు చేరకుండా ఉంటాయి.
- వికసించిన పూలను ఎప్పటికప్పుడు కోస్తూ ఉండాలి. దీనివల్ల పూల ఉత్పత్తి పెరుగుతుంది.
- చలి తీవ్రత పెరిగినప్పుడు, విపరీతంగా మంచు కురుస్తున్నప్పుడు చామంతి మొక్కలకు తగు రక్షణ కల్పించాలి. బాల్కనీలో ఉండే కుండీలను సురక్షిత ప్రాంతానికి తరలించాలి.

అతిథి









మన దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లలో **అంజూ మోడీ** ఒకరు. 'సైరా నరసింహారెడ్డి, రామ్‌లీల, బాజీరావు మస్తానీ' వంటి హిట్ చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసిన ఆమె... ఫ్యాషన్ ప్రపంచంలో వస్తున్న మార్పుల గురించి తన అభిప్రాయాలను 'నవ్య'తో పంచుకున్నారు.

ఆ దుస్తులకే ప్రాధాన్యం ఎక్కువ

ప్రస్తుతం మన దేశ ఫ్యాషన్ రంగంలో ఎలాంటి మార్పులు వస్తున్నాయి?

ఫ్యాషన్ రంగం చాలా వేగంగా మారిపోతోంది. కొత్త తరం... ఇండో-వెస్ట్రన్ లుక్‌కు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తోంది. దీనికి కూడా ఒక కారణం ఉంది. ప్రస్తుత తరం అమ్మాయిలలో చాలామందికి చీరలు ఎలా కట్టుకోవాలో తెలియదు. దాంతో వారు రెడీమేడ్ చీరల వైపు మొగ్గు చూపుతున్నారు. అలాగే... సంప్రదాయానికి ఆధునికతను మేళవించి కొత్త కొత్త డిజైన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక నా విషయానికి వస్తే, నేను జైపోర్ బ్రాండ్‌తో కలిసి డిజైన్ చేస్తున్నా. వారు మార్కెటింగ్, ప్రొడక్షన్ చూసుకుంటారు. నేను పరిశోధనలు, డిజైనింగ్ విభాగాలు చూసుకుంటున్నాను. దీనివల్ల ఒక పెద్ద ప్రయోజనం ఉంది. నేను డిజైన్ చేసిన బట్టలు సమాజంలో అన్ని వర్గాలవారికీ చేరతాయి. ఫలితంగా వస్త్రశ్రేణులకు డిమాండ్ పెరుగుతుంది. డిమాండ్ పెరిగితే నేత పనివారికి మరింత ఉపాధి దొరుకుతుంది. నేసే ప్రతి వస్త్రానికీ ఒక ఆత్మ ఉంటుంది. అది డిజైనింగ్ రూపంలో అందరికీ కనిపిస్తూ ఉంటుంది. అందువల్ల మనం ధరించే బట్టలు మన ఆత్మను ప్రతిబింబిస్తాయి.

> 'సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి చాలా క్లిష్టమైన పాత్రను అద్భుతంగా పోషించారు. ఆయన చాలా ఆలోచనాపరుడు. ఒక విషయాన్ని అనేక కోణాల నుంచి ఆలోచిస్తారు. గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి. దేశంలోనే అగ్రనటుల్లో ఒకరైనా... కించిత్తు గర్వం కూడా ఉండదు. ఆయనకు దుస్తులు డిజైన్ చేయటం ఒక మరపురాని అనుభవం.

రోజూ ఆఫీసులకు వెళ్లే అమ్మాయిలకు ఎలాంటి దుస్తులు నప్పుతాయి?

గతంతో పోలిస్తే ఇప్పుడు ఆఫీసుల్లో పని చేసే అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు వేసుకొనే బట్టలు అందంగా ఉండాలి. అదే సమయంలో సౌకర్యవంతంగా కూడా ఉండాలి. వారి కదిలికలకు అడ్డుపడకూడదు. ఉదాహరణకు చాలామంది మధ్యతరగతి మహిళలు ఆఫీసులకు బస్సు, బైక్‌ల మీద వెళుతుంటారు. అలాంటివారు చురుకుగా కదలాలి. వారు వేసుకొనే దుస్తులు ఆ కదలికలకు తగినట్లుగా ఉండాలి. దాంతోపాటుగా ఆధునికత కూడా ప్రతిబింబించాలి. అందుకే ఈమధ్య ఎక్కువమంది షార్ట్ కుర్తీలు, ట్రౌజర్లు, స్కార్ఫ్‌ల వంటివి ధరిస్తున్నారు. ఇక పండగలు వస్తే సంప్రదాయబద్ధమైన లెహంగాలు, చీరలు కట్టుకుంటున్నారు.

మీరు టాలీవుడ్, బాలీవుడ్‌లలో చాలా సినిమాలకు డిజైనర్‌గా పని చేశారు. మీకు బాగా నచ్చిన నటి ఎవరు?

సినిమాలో... పాత్రలు, సన్నివేశాల ఆధారంగా దుస్తులను డిజైన్ చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు 'రామ్‌లీల' తీసుకుందాం. అందులో దీపిక ఒక అందమైన చలాకీ అమ్మాయిగా నటించింది. ఆమెలో అణువణువూ ఉత్సాహం ఉంటుంది. ఆమెకు డిజైన్ చేసే సమయంలో... ఆ పాత్ర ఎలాంటి దుస్తులు ధరిస్తుందనే ఆలోచనే ఉంటుంది. 'బాజీరావ్ మస్తానీ' చిత్రంలో దీపిక మస్తానీగా నటించింది. ఈ సినిమాలో ఆమె పర్షియాకు చెందిన ఒక ముస్లిం మహిళ. అందువల్ల ఆమెకు డిజైన్ చేసే దుస్తులు కూడా ఆమె పుట్టి పెరిగిన సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలి. అవి కథలో సహజంగా అమరిపోవాలి.

'సైరా నరసింహారెడ్డి' చిత్రానికి డిజైన్ చేసినప్పుడు మీ అనుభవాలు చెప్పండి..?

బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేసిన ఒక రాజు కథ ఇది. ఆ చిత్రంలో నేను... అమితాబ్, చిరంజీవి, నయనతార, తమన్నాలకు డిజైనింగ్ చేశాను. దీనిలో అమితాబ్ గురు వెంకన్న పాత్ర చేశారు. 18వ శతాబ్దంలో రాజ గురువులు ఎలాంటి దుస్తులు ధరించేవారనే విషయంపై పరిశోధన చేసి శాలువాలు మొదలైన వాటితో దుస్తులు డిజైన్ చేశాను. ఇక నయనతారకు నేను డిజైన్ చేసిన డ్రస్సు అత్యంత క్లిష్టమైనది. నా పరిశోధనలలో ఆ సమయంలో కొందరు అమ్మాయిలు చీరను మామూలుగా కట్టుకోకుండా భిన్నంగా కట్టుకొనేవారిని తేలింది. అది మరాఠీవారు కట్టుకొనే పద్ధతికి భిన్నమైనది. మరాఠీ పద్ధతిలో చీర కట్టి, ఎడమ చేతి మీదకు కొంగు వచ్చేలా చేస్తారు. షూటింగ్ సమయంలో ఆ చీర కట్టడానికి నాలుగు గంటలు పట్టేది. కానీ ఆ చీరకట్టు చాలా అందంగా వచ్చింది.

> అబ్బాయిలకు అమ్మాయిలకు ఉన్నన్ని రకాల డిజైన్లు ఉండవు. ఈ విషయంలో వారు దురదృష్టవంతులనే చెప్పాలి. ఇంట్లో కూడా అమ్మాయిల బట్టలు పెట్టుకోవటానికి పది అల్మారాలు ఉంటే.. అబ్బాయిలకు ఒక అల్మారా ఉంటుంది. మామూలు రోజుల్లో ట్రౌజర్స్, షర్ట్స్ వేసుకుంటే... ప్రత్యేక సందర్భాల్లో సూట్స్ తప్ప వారికి ప్రత్యామ్నాయాలు ఏమీ ఉండవు. నాలుగు షర్టులు, నాలుగు ట్రౌజర్స్ ఉంటే చాలనే ఆలోచనా ధోరణే ఉంటుంది. పండగల్లో కుర్తాలు, బంద్‌గాలాల లాంటివి మాత్రమే ఉంటాయి. ఈ మధ్య అబ్బాయిలు కూడా పింక్ లాంటి రంగుల షర్టులు ధరిస్తున్నారు. ఇది ఒక మార్పు అనే చెప్పాలి.

మీరు డిజైన్ చేసేటప్పుడు దక్షిణ భారతం... ఉత్తర భారత దేశానికి చెందిన వ్యక్తులనే విషయం స్ఫురణకు వస్తుందా?

లేదు. నాకు కేవలం పాత్రలు మాత్రమే గుర్తుంటాయి. నేను కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తిరిగాను. అనేకమంది చేనేత కార్మికులను కలిశాను. 24 రకాల చేనేత నైపుణ్యాలను గమనించాను. ఇవన్నీ మనకు ఉన్న వారసత్వ సంపద. దీనిలో ఉత్తర భారతదేశం... దక్షిణ భారత దేశం అనే తేడానే లేదు. ఉదాహరణకు నేను నా దుస్తుల డిజైనింగ్‌లో వెంకటగిరి, గద్వాల్, నారాయణపేట... ఇలా పలు రకాల చేనేతలు ఉపయోగిస్తూ ఉంటాను.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

అవకాశమిస్తే ఆటపాటల్లోనే కాదు రాజకీయాల్లో కూడా యువతులు సత్తాచూపగలరని నిరూపించింది ఓ యువతి. ఆమె ఎవరో కాదు.. బిహార్‌కు చెందిన గాయని, యూట్యూబర్ మైథిలీ ఠాకూర్. ఇటీవల జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ నియోజక వర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలవడమే కాదు... ఈసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్న అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు ఆమె. జానపద గాయనిగా ప్రస్థానం మొదలుపెట్టి పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించుకున్న మైథిలి ప్రస్థానం ఇది.

జానపదం నుంచి జనపథంలోకి



మైథిలి.. బిహార్‌లోని మధుబని జిల్లా బెనిపెట్టిలో 2000 జూలై 25న జన్మించారు. తండ్రి రమేష్ ఠాకూర్ శాస్త్రీయ సంగీతంలో నిష్ణాతుడు, ఉపాధ్యాయుడు. తల్లి పూజ ఠాకూర్ గృహిణి. మైథిలి తాత కూడా సంగీతకారుడే. ఉపాధి కోసం ఢిల్లీకి మకాం మార్చింది మైథిలి కుటుంబం. ఆమె చదువంతా అక్కడే కొనసాగింది. బాల్ భవన్ ఇంటర్నేషనల్ స్కూల్లో పన్నెండో తరగతి వరకు చదువుకున్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ పూర్తిచేశారు. మైథిలికి రిషబ్ ఠాకూర్, అయాచి ఠాకూర్ అనే ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఈ అక్కాతమ్ముళ్లకు సంగీతమంటే చాలా ఇష్టం. వీళ్లకి తాత, తండ్రి మొదటి గురువులు. మైథిలి.. భారతీయ శాస్త్రీయ, భక్తి సంగీతంలో శిక్షణ పొందారు. జానపదాలు పాడడం కూడా నేర్చుకున్నారు. రిషబ్ తబలా వాయిస్తాడు. అయాచికి తాళ వాయిద్యాల్లో ప్రవేశం ఉంది. బాగా పాడతాడు కూడా. పిల్లల సంగీత సాధన కారణంగా పదిహేడుసార్లు ఇల్లు మారాల్సివచ్చిందని, అయిదేళ్ల క్రితమే సొంత ఇల్లు కొనుక్కున్నామని మైథిలి తల్లి చెబుతున్నారు.

అంచెలంచెలుగా ఎదిగి...

భోజ్‌పురి, హిందీ భాషల్లో భక్తి పాటలు, జానపదాలు పాడుతూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు మైథిలి. ఉర్దూ, బెంగాలీ, మరాఠీ, పంజాబీ, తమిళం, ఇంగ్లీష్ భాషల్లో కూడా ఎన్నో పాటలు ఆలపించారు. టీవీలో ప్రసారమయ్యే పలు సింగింగ్ రియాలిటీ షోలలో పాల్గొన్నారు. పదకొండేళ్ల వయసులోనే జీటీవీ సరిగమప లిటిల్ చాంప్స్‌లో ప్రతిభ కనబరచారు. సోనీ టీవీ ఇండియన్ ఐడల్ జూనియర్ పోటీలో సత్తా చాటారు. తరువాత సొంత ఆల్బం 'యా రబ్బా'ను విడుదల చేశారు. 2017లో రైజింగ్ స్టార్ కార్యక్రమంలో రన్నరప్‌గా నిలిచారు. విదేశాల్లో సైతం పాటల ప్రోగ్రామ్‌లు, లిటరేచర్ ఫెస్ట్‌లు నిర్వహించారు. ఆమె బిహార్ సాంస్కృతిక అంబాసిడర్‌గా కూడా పని చేశారు. గతంలో ఎన్నికల కమిషన్.. మైథిలితోపాటు ఆమె తమ్ముళ్లను మధుబని బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించింది. ఆమె 2021లో లోక్‌మత్ సుర్ జ్యోత్స్నా జాతీయ సంగీత పురస్కారాన్ని, ఆపైన భారత ప్రభుత్వం నుంచి అటల్ మిథిలా సమ్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవంలో మైథిలి పాడిన 'మా శబరి' పాటకు పలువురి ప్రశంసలు లభించాయి. శ్రీరామునికి శబరి పండ్లు తినిపించే ఘట్టాన్ని కళ్లముందు నిలిపావంటూ ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు కూడా.



సామాజిక మాధ్యమాల్లో...

మైథిలి సొంతంగా యుట్యూబ్ చానెల్‌ను నిర్వహిస్తున్నారు. అందులో తన తమ్ముళ్లతో కలిసి తులసీదాస్ విరచిత రామచరిత మానస్‌ను ఆలపిస్తున్నారు. మానస్పథ్ అనే ఈ ప్రోగ్రామ్ ఆ అక్కాతమ్ముళ్లకు మంచి పేరు తెస్తోంది. ఇన్‌స్టా, యూట్యూబ్‌లలో కలిపి ఆమెకు కోటికి పైగా ఫాలోయర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో అయితే 1.40 కోట్ల మంది ఆమెను ఫాలో అవుతున్నారు. ప్రస్తుతం మైథిలి అంతర్జాతీయ వేదికల మీద కూడా ప్రదర్శనలు ఇస్తున్నారు. బాలీవుడ్ చిత్రాలకు కూడా పాటలు పాడారు. గత ఏడాది 'ఔరోమ్ మే కహా దమ్ థా' చిత్రంలో ఎంఎం కీరవాణి స్వరపరిచిన 'కిసీ రోజ్' పాట పాడారు.

కేంద్రం మొదటిసారి జాతీయ స్థాయి క్రియేటర్లకు అవార్డులు ప్రకటించినప్పుడు మైథిలి 'కల్చరల్ అంబాసిడర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికయ్యారు.

రాజకీయ ప్రస్థానం...

బీజేపీ తరఫున బరిలోకి దిగిన మైథిలి.. అలీనగర్ నియోజక వర్గం నుంచి పోటీ చేశారు. ఈ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ అక్కడ బీజేపీ గెలవకపోవడం గమనార్హం. ఇటీవలే రాజకీయాల్లోకి వచ్చిన మైథిలి సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్ పర్సన్‌గా నిలిచారు. సాంస్కృతిక పునరుజ్జీవనం, బాలికలు-మహిళల విద్య, ఉపాధి కల్పనలే ప్రధాన అజెండాగా ఆమె ప్రచారం కొనసాగించారు. పాఠశాలల్లో పెయింటింగ్‌ను అదనపు పాఠ్యాంశంగా చేర్చడంతోపాటు అలీనగర్ పేరును సీతానగర్‌గా మార్చాలనే ప్రతిపాదనలను ఆమె ఎన్నికల హామీల్లో వినిపించారు. పోటీ చేసిన మొదటిసారే ఎమ్మెల్యేగా గెలవడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు. 51 ఏళ్ల బిహార్ అసెంబ్లీ ప్రస్థానంలో 25 ఏళ్ల యువతి అడుగుపెట్టడంతో రాజకీయాల్లో నూతన శకానికి నాంది పలికినట్లేనని అక్కడి ప్రజలు చెప్పుకోవడం విశేషం.

అభి'రుచి'

ఒక చిన్న టీ కొట్టు యజమాని తన వంటలతో దేశంలో ప్రముఖులందరినీ ఆకట్టుకోవటం చాలా అరుదైన విషయం. అలాంటి వ్యక్తే... **నాగరాజు వెంకటరామరాజు**. 'పులస రాజుగారు' అని ఎంతోమంది ఆప్యాయంగా పిలుచుకొనే ఈ రాజుగారు... 'రాజుగారి కోడి పులావ్' తొలిసారి వండింది తానేనంటారు. గతంతో పోలిస్తే ఇప్పటి వంటల్లో వచ్చిన మార్పులు, బిర్యానీ... పులావ్‌ల మధ్య తేడాలు తదితర ఎన్నో ఆసక్తికర విషయాలను ఆయన 'నవ్య'తో పంచుకున్నారు.





ఈ 'రాజుగారి కోడి పులావ్'అదుర్స్

"ఒకప్పుడు చదువు రానివారు, చదువుకోనివారు మాత్రమే వంటవాళ్లుగా స్థిరపడేవారు. చదువుకున్నవారు ఉద్యోగాలకు వెళ్లేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. చదువుకున్నవారు కూడా వంట చేయటాన్ని వృత్తిగా ఎంచుకుంటున్నారు. రెస్టారెంట్స్ పెడుతున్నారు. వంటలు వండే విధానంలో, తినే విధానంలో కూడా అనేక మార్పులు వచ్చేశాయి. కొత్త కొత్త మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల పని సులభమయింది. కానీ నా ఉద్దేశంలో వంటల్లో 'ప్రేమ పాళ్లు' తగ్గాయి. గతంలో వంట చేయటానికి... డబ్బులకు లంకె ఉండేది కాదు. వంటను మెచ్చుకుంటే సంతోషపడేవాళ్లం. ఇప్పుడు డబ్బులకే ప్రాధాన్యం. గతంలో వంటల్లో మసాలాలు, నూనెలు ఎక్కువగా వాడేవారు కాదు. అందువల్ల కూర రుచి తెలిసేది. ఉదాహరణకు చికెన్ వండారని అనుకుందాం. చికెన్ రుచి ప్రధానంగా... మిగిలిన రుచులు అదనంగా ఉండేవి. తిన్నవారికి ఆ విషయం తెలిసేది. కానీ ఇప్పుడు కూరల్లో గ్రేవీ ప్రధానమైపోయింది. ఈ గ్రేవీలలో రంగులు కూడా వేస్తున్నారు. రెడ్ గ్రేవీ, ఎల్లో గ్రేవీ, వైట్ గ్రేవీ అని తయారు చేస్తున్నారు. చికెన్, మటన్, ఫిష్... ఇలా ఏదైనా ఈ గ్రేవీలనే వాడేస్తున్నారు. రకరకాల నూనెలు వాడుతున్నారు. వెజిటేరియన్ అయినా, నాన్‌వెజిటేరియన్ అయినా ఇదే సమస్య.

> ఒకప్పుడు పిత్తపరుగులతో కూర వండేవారు. ఇప్పుడు ఎవరూ వండటంలేదు. అలాగే సీరమీను గురించి కూడా ఎవరికీ తెలియదు. దీనికి సంబంధించిన ఒక కథ చెబుతాను. ఒకసారి సూపర్‌స్టార్ కృష్ణ గారు నన్ను పిలిచి... "రాజుగారు.. మీకు సీర మీను కూర చేయటం తెలుసా?" అని అడిగారు. తెలుసని చెప్పాను. వాస్తవానికి అప్పుడు నాకు సీరమీను గురించి తెలియదు. కానీ అంత పెద్ద వ్యక్తికి తెలియదని ఎలా చెబుతా! ఆ తర్వాత దాని గురించి వాకబు చేస్తే దీపావళికి నాలుగు రోజుల ముందు దొరుకుతుందని, ఆ తర్వాత దొరకదని చెప్పారు. దానిని వండటం కూడా ఒక కళ. ఆ ఏడాది భీమవరం, తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ఊళ్లు వెళ్లి ఆ వంటకం నేర్చుకొన్నా. వచ్చి కృష్ణగారికి వండి పెట్టా! ఆ తర్వాత ఆయన చనిపోయేదాకా ప్రతి ఏడాది దీపావళికి సీరమీను కూర చేసి పట్టుకువెళ్లి ఇచ్చేవాడిని.

చేపల పులుసు అంటే...

చేపల పులుసు వండేటప్పుడు చాలామంది చేసే తప్పు... దానిలో గ్రేవీ వేయటం. ఒకప్పుడు చేపల పులుసులో గ్రేవీ ఉపయోగించేవారు కాదు. ఉల్లిపాయలు కూడా ఎక్కువగా వాడేవారు కాదు. కానీ ఇప్పుడు ఈ రెండూ విరివిగా వాడేస్తున్నారు. ఒకప్పుడు కేజీ చేపలకు పావు కిలో ఉల్లిపాయల ముద్ద వేసేవాళ్లం. పప్పునూనె వాడేవాళ్లం. తగినంత కారమే వేసేవాళ్లం. కానీ ఇప్పుడు కేజీ చేపలకు కేజీ ఉల్లిపాయల ముద్ద వేసేస్తున్నారు. దీనివల్ల ఎంత కారం కలిపినా చాలదు. అంతే కాకుండా రుచిగా కూడా ఉండదు. చేపల గురించి మాట్లాడుకుంటున్నాం కాబట్టి కొన్ని విషయాలు తప్పనిసరిగా చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో రకరకాల భౌగోళిక పరిస్థితులు ఉన్నాయి. వాటికి తగ్గట్టుగా వాతావరణం ఉంటుంది. ఈ వాతావరణం ఆధారంగానే అక్కడ వండే పంటలు, పెరిగే చేపలు, ఇతర జంతువులు ఉంటాయి. నా అనుభవంలో గోదావరి నీటికి కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు ఉన్నాయి. గోదావరి నీళ్లతో పులుసు చేస్తే కొద్దిగా పులుపు అబ్బుతుంది. దీనివల్ల మంచి రుచి వస్తుంది. తెలంగాణ ప్రాంతంలో నీళ్లతో చేస్తే ఈ పులుపు రాదు. అంతే కాకుండా చేప ముల్లు లేకుండా పులుసు చేస్తే దానికి రుచి ఉండదు. ఇప్పుడు అందరూ బోన్‌లెస్ వండుకుంటున్నారు. ఇక్కడ మీకు ఒక విషయం చెబుతాను. వానాకాలంలో పులస చేపలు అందుబాటులోకి వస్తాయి. చాలా మంది పులసను మామూలుగానే వండేస్తారు. అలా కాకుండా ముందు... ఈ చేపను మూడు గంటల పాటు ఉడకపెట్టాలి. ఆ తర్వాత ఒక రోజంతా వదిలేయాలి. అప్పుడు దానిలో ఉండే ముల్లు మృదువుగా మారుతుంది. చేపల పులుసు చేసి చివరలో వెన్నపూస వేయాలి. ఇలా చేసిన పులుసు వారం రోజులైనా చెడిపోదు. ఏటా ఇలా చేసిన పులస చేపల పులుసును దుబాయ్, అమెరికా సహా అనేక దేశాలకు పంపుతూ ఉంటాను. ఇప్పటిదాకా ఒక్క రిమార్క్ కూడా రాలేదు.

> ఈ మధ్యకాలంలో బతికివున్న చేపల్ని ఆక్సిజన్ సిలిండర్లు పెట్టి చాలామంది అమ్ముతున్నారు. దీని వెనక ఒక మతలబు ఉంది. చేపలను పట్టిన తర్వాత, వాటిని నీటిలో వేసి ఒక కెమికల్ కలిపితే... అవి ఎంతకాలమైనా బతికి ఉంటాయి. కానీ వాటి రుచి మాత్రం మారిపోతుంది. ఆక్సిజన్ పెట్టి అమ్మే చేపల్లో రుచి ఉండదు. ఇక చేపల పులుసుకు బొచ్చు చేపలు బాగుంటాయి. తెలంగాణ ప్రాంతాల్లో కొర్రమీనులను ఎక్కువగా తింటారు. దీనిలో బోన్ తక్కువగా ఉంటుంది. ఇక్కడ మంచి బొమ్మిడాయలు దొరకవు. ఎక్కువగా దొరికేవన్నీ బురద బొమ్మిడాయిలే.

పులావు... బిర్యానీ...

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జిల్లాల్లో పులావు ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లో బిర్యానీ ఎక్కువగా దొరుకుతుంది. ఈ రెండింటి మధ్య ఉన్న తేడా చాలా మందికి తెలియదు. పులావ్‌లో బియ్యం, మసాలా, నూనె, ఇతర దినుసులు ఒకేసారి వేసి వండేస్తారు. బిర్యానీలో మాత్రం ముందు ఒక పొర కూరగాయలు, ఆపైన చికెన్, ఆ పైన బియ్యం... ఇలా పొరలుపొరలుగా వేసి ఉడికిస్తారు. అంటే వండే పద్ధతిలోనే మౌలికంగా మార్పు ఉంటుంది. నేను మూడున్నర దశాబ్దాల క్రితం హైదరాబాద్ వచ్చినప్పుడు... ఇక్కడవాళ్లకు పులావు గురించి ఎక్కువగా తెలియదు. ఆ సమయంలో నేను నా పేరు మీద 'రాజుగారి కోడి పలావ్'ను వండటం మొదలుపెట్టా!

దీనికి విపరీతమైన ఆదరణ లభించింది. ఒక ఏడాది లోపులోనే హైదరాబాద్ దమ్ బిర్యానీకి సరిసమానమైన పేరును సంపాదించింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దుబాయ్, సింగపూర్, అమెరికా... ఇలా ఎక్కడికి వెళ్లినా ఈ పేరు మీద రెస్టారెంట్స్ కనిపిస్తాయి. ఈ పేరు మీద నాకు ట్రేడ్ మార్కు కూడా ఉంది. అయితే ఆహారం అనేది అందరిదీ. దానిపై ఎటువంటి ఆంక్షలూ ఉండకూడదనేది నా ఉద్దేశం.



క్వార్టర్స్‌కు అర్జున్

● టైబ్రేక్‌కు హరి

● చెస్ వరల్డ్‌కప్

పనాజీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఫిడే వరల్డ్‌కప్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. ఐదో రౌండ్లో అర్జున్ 1.5-0.5తో రెండుసార్లు విజేత లెవాన్ అరోనియన్ (అమెరికా)ను చిత్తుచేశాడు. శుక్రవారం తొలిగేమ్‌ను డ్రాగా ముగించిన అర్జున్.. శనివారం రెండో గేమ్‌లో అరోనియన్‌ను ఓడించాడు. అయితే, మరో తెలుగు ఆటగాడు పెంటేల హరికృష్ణ భవితవ్యం టైబ్రేక్‌కు మళ్లింది. ఐదో రౌండ్లో మెక్సికోకు చెందిన జోస్ మార్టినెజ్‌తో తొలిగేమ్ డ్రా చేసుకున్న హరి.. రెండో గేమ్‌లోనూ ఫలితం రాబట్టలేకపోయాడు. దీంతో స్కోరు 1-1తో సమమవడంతో వీళ్లిద్దరూ ఆదివారం టైబ్రేక్‌లో తలపడనున్నారు.

స్పిన్నర్ల తడాఖా

భారత్ తొలి ఇన్నింగ్స్ 189

హార్మర్‌కు నాలుగు వికెట్లు

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7

తిప్పేసిన జడేజా, కుల్దీప్



జడేజా (4/29)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్ పిచ్ బ్యాటర్లను వణికిస్తోంది. తొలిరోజు పేసర్లకు అనూహ్య బౌన్స్ లభించగా.. రెండోరోజైన శనివారం స్పిన్నర్లకు స్వర్గధామంగా మారింది. దీంతో ఒక్కరోజే ఇరుజట్ల నుంచి ఏకంగా 15 వికెట్లు నేలకూలాయి. అటు మ్యాచ్ ఫలితం కూడా మూడోరోజే తేలడం ఖాయమైపోయింది. భారత బ్యాటింగ్ ఆర్డర్ విఫలమైనా.. వెటరన్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/29) సుడులు తిరిగే బంతులతో సఫారీ బ్యాటర్ల వెన్ను విరిచాడు. దీంతో ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 7 వికెట్లకు 93 పరుగులు చేసింది. క్రీజులో కెప్టెన్ బవుమా (29), బాష్ (1) ఉన్నారు. స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్‌కు 2, అక్షర్ పటేల్‌కు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం పర్యాటక జట్టు 63 పరుగుల ఆధిక్యంలోనే ఉంది. వీలైనంత వేగంగా మిగిలిన 3 వికెట్లను భారత్ పడగొట్టాలి. లేదంటే ఈ పిచ్‌పై 150 పరుగుల లక్ష్యం కూడా కష్టంగానే మారనుంది. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్ 189 రన్స్ వద్ద ముగియడంతో.. 30 పరుగుల ఆధిక్యం దక్కింది. రాహుల్ (39), సుందర్ (29), పంత్ (27), జడేజా (27) ఫర్వాలేదనిపించారు. స్పిన్నర్ సిమోన్ హార్మర్‌కు 4, పేసర్ యాన్సెన్‌కు 3 వికెట్లు దక్కాయి.


హార్మర్ (4/30)

హార్మర్ ధాటికి కుదేల్: ఓవర్‌నైట్ స్కోరు 37/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌ను సఫారీ స్పిన్నర్లు కుదురుకోనీయలేదు. మిడిలార్డర్‌ను హార్మర్ దెబ్బతీశాడు. అయితే తొలిగంట ఆటలో యాన్సెన్ పేస్, కేశవ్ స్పిన్‌ను రాహుల్, సుందర్ దీటుగానే ఎదుర్కొన్నారు. కానీ డ్రింక్స్ బ్రేక్ తర్వాత హార్మర్ వికెట్ల పతనాన్ని ఆరంభించాడు. ముందుగా సుందర్‌ను హార్మర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే గిల్ మెడ నొప్పితో మైదానం వీడాడు. అటు ఓపిగ్గా క్రీజులో నిలిచిన రాహుల్‌ను కేశవ్ పెవిలియన్ చేర్చాడు. ఇక పంత్ తనదైన శైలిలో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో స్కోరులో కదలిక తెచ్చాడు. కానీ లంచ్‌కు కాస్త ముందే పేసర్ బాష్ బౌన్సర్‌కు పంత్ క్యాచ్ అవుటయ్యాడు. 138/4 స్కోరుతో భారత్ రెండో సెషన్‌ను పటిష్టమైన స్థితిలోనే ఆరంభించింది. కానీ హార్మర్ ధాటికి 51 పరుగుల వ్యవధిలోనే చివరి ఐదు వికెట్లను కోల్పోయింది. అయితే 30 పరుగుల తొలి ఇన్నింగ్స్ మాత్రం దక్కింది. కెప్టెన్ గిల్ తిరిగి బ్యాటింగ్‌కు దిగలేదు.

జడ్డూ మాయ: రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికాకు ఏడో ఓవర్‌లోనే ఝలక్ తగిలింది. ఓపెనర్ రికెల్టన్ (11)ను కుల్దీప్ అవుట్ చేయడంతో ఆటగాళ్లు టీ బ్రేక్‌కు వెళ్లారు. ఇక ఆఖరి సెషన్‌లో పిచ్ బ్యాటింగ్‌కు మరింత కష్టంగా మారింది. వికెట్‌పై పగుళ్లు కూడా కనిపించడంతో జడేజా మాయాజాలానికి సఫారీలు విలవిల్లాడారు. ఆరంభంలోనే స్వీప్‌షాట్‌కు వెళ్లి ఓపెనర్ మార్‌క్రమ్ (4).. జడేజాకు దొరికిపోయాడు. దీనికితోడు 17వ ఓవర్‌లో ముల్డర్ (11), జోర్జి (2)లను కూడా అవుట్ చేసిన జడ్డూ.. కాసేపటికే స్టబ్స్ (5)ను బౌల్డ్ చేశాడు. దీంతో ఆ జట్టు 60/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఓవైపు కెప్టెన్ బవుమా మాత్రం ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. మరో ఎండ్‌లో వెరీన్ (9)ను అక్షర్, యాన్సెన్ (13)ను కుల్దీప్ అవుట్ చేయడంతో బవుమాకు సహకారం అందలేదు. రెండో రోజు ఆట కూడా వెలుతురు లేమితో కాస్త ముందుగానే ముగించారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 159

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) యాన్సెన్ 12, రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 39, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 29, గిల్ (రిటైర్డ్ హర్ట్) 4, పంత్ (సి) వెరీన్ (బి) బాష్ 27, జడేజా (ఎల్బీ) హార్మర్ 27, జురెల్ (సి అండ్ బి) హార్మర్ 14, అక్షర్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 16, కుల్దీప్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 1, సిరాజ్ (బి) యాన్సెన్ 1, బుమ్రా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 62.2 ఓవర్లలో 189 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-18, 2-75, 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189. **బౌలింగ్:** యాన్సెన్ 15-4-35-3, ముల్డర్ 5-1-15-0, కేశవ్ 16-1-66-1, బాష్ 11-4-32-1, హార్మర్ 15.2-4-30-4. **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** రికెల్టన్ (ఎల్బీ) కుల్దీప్ 11, మార్‌క్రమ్ (సి) జురెల్ (బి) జడేజా 4, ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 11, బవుమా (బ్యాటింగ్) 29, జోర్జి (సి) జురెల్ (బి) జడేజా 2, స్టబ్స్ (బి) జడేజా 5, వెరీన్ (బి) అక్షర్ 9, యాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 13, బాష్ (బ్యాటింగ్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 35 ఓవర్లలో 93/7. వికెట్ల పతనం:** 1-18, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91.. **బౌలింగ్:** బుమ్రా 6-1-14-0, అక్షర్ 11-0-30-1, కుల్దీప్ 5-1-12-2, జడేజా 13-3-29-4.

1

భారత్ తరఫున టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (92) బాదిన బ్యాటర్‌గా పంత్. సెహ్వాగ్ (90)ను అధిగమించాడు.

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) సైకిల్‌లో 150 వికెట్లు, 2500 పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా జడేజా.

2

టెస్టుల్లో వేగంగా (88 టెస్టులు) 4 వేల రన్స్+300 వికెట్లు తీసిన రెండో ప్లేయర్‌గా జడేజా. ఇయాన్ బోథమ్ (72) ముందున్నాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన నాలుగో ఆల్‌రౌండర్. ఇందులో స్వదేశంలో 2000+ రన్స్, 250+ వికెట్లు ఉండడం విశేషం.



ఆస్పత్రిలో గిల్

భారత కెప్టెన్ గిల్ తొలి టెస్టు మిగిలిన ఆటలో బరిలోకి దిగేది సందేహంగా మారింది. రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌లో 3 బంతులనే ఎదుర్కొన్న గిల్ మెడనొప్పితో మైదానం వీడాడు. హార్మర్ ఓవర్‌లో గిల్ స్లాగ్ స్వీప్ షాట్‌తో బౌండరీ సాధించాడు. కానీ వెంటనే మెడ పట్టేయడంతో తల తిప్పలేకపోయాడు. ఫిజియో వచ్చి పరిశీలించినా నొప్పి తగ్గకపోవడంతో గిల్ క్రీజు వీడాడు. కొన్ని గంటల తర్వాత మెడకు పట్టీతో కనిపించిన గిల్‌ను స్ట్రెచర్‌పై పడుకోబెట్టి అంబులెన్స్‌లో తీసుకెళ్లారు.

లక్ష్యసేన్‌కు నిరాశ

కుమమొటో: జపాన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ లక్ష్యసేన్ పోరాటానికి సెమీఫైనల్లో తెరపడింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఏడో సీడ్ లక్ష్య 19-21, 21-14, 12-21తో స్థానిక షట్లర్ కెంటా నిషిమొటో చేతిలో ఓటమి పాలయ్యాడు.

సెమీస్‌కు మనమ్మాయిలు

అంధుల టీ20 ప్రపంచకప్

ముంబై: ఆరంభ మహిళల అంధుల టీ20 ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ 10 వికెట్ల తేడాతో యూఎస్‌ఏపై గెలిచి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మొదట యూఎస్‌ఏ 20 ఓవర్లలో 60/8 స్కోరుకే పరిమితమైంది. ఛేదనలో భారత్ 3.3 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 61 రన్స్ చేసి గెలిచింది.

ఏటీపీ ఫైనల్స్ టైటిల్‌ఫైట్‌కు సిన్నర్

ట్యూరిన్: సీజన్ ముగింపు టోర్నీ, ప్రతిష్ఠాత్మక ఏటీపీ ఫైనల్స్ టెన్నిస్ టోర్నీలో టాప్ ఆటగాడు జానిక్ సిన్నర్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. సెమీఫైనల్లో సిన్నర్ 7-5, 6-2తో అలెక్స్ డి మినార్‌ను ఓడించాడు. మరో స్టార్ ఆటగాడు కార్లోస్ అల్కారజ్, ఫెలిక్స్ అగర్ మధ్య జరిగే మరో సెమీస్ విజేతతో సిన్నర్ ఫైనల్లో తలపడతాడు.

రాజస్థాన్‌కు జడేజా.. చెన్నైకి శాంసన్

రస్సెల్‌ను వదులుకున్న కోల్‌కతా

● లఖ్‌నవూకు షమిని అమ్మిన సన్‌రైజర్స్

● మినీ వేలానికి 77 మంది క్రికెటర్లు



శాంసన్
రస్సెల్

ముంబై: ఐపీఎల్‌లో ఊహించని సంచలనాలు చోటుచేసుకొన్నాయి. మినీ వేలానికి ముందు ఫ్రాంచైజీలు అనూహ్య నిర్ణయాలతో అభిమానులను ఆశ్చర్యపరిచాయి. రాబోయే సీజన్ కోసం టాప్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ట్రేడింగ్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు అమ్మేయడం.. బదులుగా ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్‌ను తీసుకోవడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు కోల్‌కతా నైట్‌రైడర్స్ తమ ప్రధాన ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్‌ను వదిలేయడం గమనార్హం. ఇలా.. 10 ఫ్రాంచైజీలు మొత్తంగా 77 మంది ఆటగాళ్లను విడుదల చేసినట్టు ఐపీఎల్ శనివారం ప్రకటించింది. వీళ్లంతా వచ్చేనెల 16న అబుదాబిలో జరిగే మినీ వేలానికి అందుబాటులో ఉంటారు. గతేడాది జరిగిన మెగా వేలంలో ఆయా ఫ్రాంచైజీలు ఆటగాళ్లను భారీ ధరకే రిటైన్, కొనుగోలు చేశాయి. అయితే, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్థిరమైన జట్టును తయారు చేసే ఆలోచనతోనే మినీ వేలంలో ఆ లోటుపాట్లను పూడ్చుకోవాలని ఫ్రాంచైజీలు చూస్తున్నాయి. కాగా, ట్రేడింగ్‌లో భాగంగా జడేజాకు చెన్నై చెల్లిస్తున్న రూ. 18 కోట్ల ఫీజు కంటే తక్కువగా... అంటే రూ. 14 కోట్లకు అతడిని రాజస్థాన్ దక్కించుకొంది. లీగ్ ఆరంభంలో రెండు సీజన్లు రాజస్థాన్‌కు ప్రాతినిథ్యం వహించిన జడ్డూ కెరీర్ చివర్లో మరోసారి అక్కడికే చేరాడు. 12 ఏళ్లపాటు అతడు చెన్నై తరపున ఆడాడు. ఇక.. శాంసన్‌కు ప్రస్తుతమున్న రూ. 18 కోట్లనే చెన్నై చెల్లించనుంది. సంజూను కెప్టెన్ ధోనీకి వారసుడిగా తీసుకొస్తున్నారనే ఊహాగానాలున్నాయి. పేసర్ మహ్మద్ షమిని సన్‌రైజర్స్ రూ. 10 కోట్లకు లఖ్‌నవూకు ట్రేడ్ చేసింది. సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్‌ను ముంబై ప్రస్తుత ఫీజు రూ. 30 లక్షలకు లఖ్‌నవూకు అమ్మేసింది.

ప్రక్షాళన దిశగా కోల్‌కతా: జట్టును పునర్‌నిర్మించాలనుకొంటున్న కోల్‌కతా నైట్‌రైడర్స్ వెంకటేష్ అయ్యర్ (రూ. 23.75 కోట్లు), రస్సెల్ (రూ. 12 కోట్లు)తోపాటు డికాక్, మొయిన్ అలీ, నోకియా, గుర్బాజ్‌ను విడుదల చేయగా.. పేసర్ మయాంక్ మార్కండేను ముంబైకి ట్రేడ్ చేసింది. దీంతో రూ. 64.3 కోట్ల భారీ మొత్తంతో కోల్‌కతా వేలానికి సిద్ధమైంది. అయితే, రహానె, నరైన్, వరుణ్, రింకూ.. ఇలా కోర్ టీమ్‌ను రిటైన్ చేసుకొన్న నైట్‌రైడర్స్‌లో 13 ఖాళీలు ఏర్పడ్డాయి. మరోవైపు బౌలింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాలనుకొంటున్న చెన్నై.. ట్రేడింగ్‌లో శాంసన్‌ను తీసుకొన్నా కూడా రూ. 43.4 కోట్లతో వేలానికి వెళ్లనుంది. పేసర్ పతిరన, కాన్వే, రచిన్ రవీంద్ర, రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్, దీపక్ హుడా, తెలుగు క్రికెటర్ రషీద్‌లను వదిలేసింది. జడేజాతోపాటు సామ్ కర్రాన్‌ను రూ. 2.4 కోట్లకు రాజస్థాన్‌కు అమ్మేసింది.


ఢిల్లీకి రాణా: ఆల్‌రౌండర్ నితీశ్ రాణాను ఢిల్లీ రూ. 4.2 కోట్లకు రాజస్థాన్ నుంచి ట్రేడింగ్‌లో దక్కించుకొంది. డుప్లెసి, ఫ్రేజర్ సహా ఆరుగురిని ఢిల్లీ విడుదల చేసింది. కీపర్ డోనోవాన్ ఫెరీరాను రూ. కోటికి రాజస్థాన్ రాయల్స్‌కు అమ్మేసింది. కరీమ్, కేజ్రోలియా, కొట్జీ, షనక్, మహిపాల్‌ను గుజరాత్ టైటాన్స్ రిలీజ్ చేయగా.. రూథర్‌ఫోర్డ్‌ను ముంబైకి అమ్మేసింది. షమి, జంపా, రాహుల్ చాహర్‌తో పాటు 8 మందిని సన్‌రైజర్స్ హైదరాబాద్.. స్టార్ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్, ఇన్‌గ్లిస్ సహా ఐదుగురిని పంజాబ్ కింగ్స్.. హసరంగ, తీక్షణ, ఫరూఖీ సహా 8 మందిని రాజస్థాన్.. టోప్లే, కర్ణ్‌శర్మ, ఆంధ్ర పేసర్ పీఎస్ఎన్ రాజు సహా 9 మందిని ముంబై.. ఆకాశ్‌దీప్, బిష్ణోయ్, మిల్లర్‌లను లఖ్‌నవూ.. లివింగ్‌స్టోన్, ఎన్‌గిడి, మయాంక్ అగర్వాల్‌లను బెంగళూరు విడుదలజేశాయి.

ఫ్రాంచైజీల వద్ద మిగిలిన మొత్తం

● కోల్‌కతా	రూ. 64.30 కోట్లు
● చెన్నై	రూ. 43.40 కోట్లు
● సన్‌రైజర్స్	రూ. 25.50 కోట్లు
● లఖ్‌నవూ	రూ. 22.95 కోట్లు
● ఢిల్లీ	రూ. 21.80 కోట్లు
● బెంగళూరు	రూ. 16.40 కోట్లు
● రాజస్థాన్	రూ. 16.05 కోట్లు
● గుజరాత్	రూ. 12.90 కోట్లు
● పంజాబ్	రూ. 11.50 కోట్లు
● ముంబై	రూ. 2.75 కోట్లు

బిజినెస్ ప్లస్

వెండిపైనా రుణాలు



2026 ఏప్రిల్ 1 నుంచి అందుబాటులోకి

నోటిఫికేషన్ జారీ చేసిన ఆర్‌బీఐ

ఇంట్లో బోలెడన్ని వెండి నగలు, నాణేలు ఉన్నాయి. బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) వద్ద వీటిని కుదువ పెట్టి రుణాలు తీసుకోవచ్చా? ప్రస్తుతానికైతే లేదు. అయితే వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇందుకు అవకాశం ఏర్పడనుంది. ఇందు కోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (గోల్డ్ అండ్ సిల్వర్ లోన్స్) డైరెక్షన్స్, 2025 పేరుతో నోటిఫికేషన్ విడుదల చేసింది. పసిడి, వెండి రుణాల మంజూరులో పారదర్శకత, నియంత్రణ కోసం ఆర్‌బీఐ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌తో వెండి నగలు, నాణేలు కుదువ పెట్టేటప్పుడు వాటికి సరైన విలువ కూడ లభిస్తుందని భావిస్తున్నారు.

రుణ పరిమితులు

- రూ.2.5 లక్షల వరకు వెండి నగలు, నాణేల విలువలో 85% వరకు
- రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షల లోపు రుణాలైతే విలువలో 80% వరకు
- తీసుకునే రుణం రూ.5 లక్షలకు మించి ఉంటే విలువలో 75% వరకు

విలువ లెక్కింపు విధానం

గత నెల రోజుల్లో వెండి సగటు ధర లేదా క్రితం రోజు ముగింపు ధర.. వీటిలో ఏది తక్కువైతే దాని ఆధారంగా వెండి నగలు, నాణేల విలువ లెక్కకడతారు. ఈ ధరలను ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) నుంచి లేదా ఏదైనా గుర్తింపు పొందిన కమోడిటీస్ ఎక్స్ఛేంజీ నుంచి తీసుకుంటారు. నగలైతే అందులోని విలువైన రత్నాలు, రాళ్ల విలువను పరిగణనలోకి తీసుకోరు.

రుణం తీర్చిన 7 రోజుల్లో వెనక్కు..

బంగారం లేదా వెండి ఆభరణాలు, నాణేలు హామీగా పెట్టి తీసుకున్న రుణాలను తీర్చివేసిన ఏడు పని దినాల్లో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, గృహ రుణ కంపెనీలు వాటిని కుదువ పెట్టిన వారికి తిరిగి ఇవ్వాలి. ఈ విషయంలో ఏ మాత్రం ఆలస్యం చేసినా రోజుకు రూ.5,000 చొప్పున వాటి యజమానులకు నష్ట పరిహారంగా చెల్లించాలి.

రెండేళ్లలో క్లెయిమ్ చేయకపోతే వేలానికి

తీసుకున్న రుణాన్ని ఖాతాదారుడు నిర్ణీత కాలంలోగా చెల్లించక పోతే బ్యాంకులు కుదువపెట్టిన బంగారం, వెండి ఆభరణాలు, నాణేలను వేలం వేసి తమ సొమ్ము రాబట్టుకోవచ్చు. కాకపోతే ఈ వేలం వేసి రాబట్టిన ధర మార్కెట్ ధరలో 90 శాతం కంటే తక్కువ ఉండకూడదు. కుదువ పెట్టి రెండేళ్లయినా క్లెయిమ్ చేయని బంగారం, వెండి నగలు, నాణేలను అన్‌క్లెయిమ్డ్‌గా వర్గీకరించి, వాటి యాజమానుల ఉనికిని కనుగొనేందుకు బ్యాంకులు ప్రత్యేక ప్రయత్నాలు చేయాలి.

ఈ రుణాలు ఎవరిస్తారంటే..

వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ బ్యాంకులు, పట్టణ, గ్రామీణ సహకార బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు.. బంగారం, వెండి ఆభరణాలు, నాణేల తాకట్టు రుణాలు ఇవ్వవచ్చు. అయితే శుద్ధమైన బంగారం, వెండి కడ్డీలు గోల్డ్ లేదా సిల్వర్ ఈటీఎఫ్‌లు, మ్యూచువల్ ఫండ్స్‌పై మాత్రం ఈ తరహా రుణాలు లభించవు.

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీంతో వెండి ఆభరణాలు, నాణేలు స్థానిక వ్యాపారుల వద్ద కుదువ పెట్టి అధిక వడ్డీలకు రుణం తీసుకునే బాధ తగ్గనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,080 ▼	1,14,650 ▼	1,75,100 ▼
విజయవాడ	1,27,500 ▼	1,19,000 ▼	1,59,000 ▼
విశాఖపట్నం	1,27,800 ▼	1,17,150 ▼	1,75,000 ▼
రాజమండ్రి	1,25,070 ▼	1,14,650 ▼	1,56,000 ▼
ప్రొద్దుటూరు	1,24,400 ▼	1,14,450 ▼	1,59,300 ▼
ముంబై	1,24,794 ▼	1,14,311 ▼	1,59,367 ▼



టాటా మోటార్స్ నుంచి సరికొత్త సియెర్రా

22 ఏళ్ల తర్వాత మళ్లీ మార్కెట్లోకి

ముంబై: టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ).. సరికొత్త ఎస్‌యూవీ సియెర్రాను ఆవిష్కరించింది. ఈ నెల 25న కంపెనీ అధికారికంగా సియెర్రాను మార్కెట్లోకి విడుదల చేయనుంది. సరికొత్త లుక్, డిజైన్‌తో రూపొందించిన ఈ ఎస్‌యూవీ.. హ్యుండయ్ క్రెటా, మారుతి గ్రాండ్ విటారా, హోండా ఎలివేట్‌కు గట్టి పోటీనిస్తుందని అంచనా వేస్తున్నారు. 1991లో తొలిసారిగా టాటా మోటార్స్ సియెర్రాను మార్కెట్లోకి తీసుకురాగా 2003లో ఈ కారు ఉత్పత్తిని నిలిపివేసింది. భారతీయుల మనసును చూరగొన్న ఈ ఎస్‌యూవీని 22 ఏళ్ల తర్వాత మళ్లీ వినియోగదారుల అభిరుచులు, కలలకు అనుగుణంగా మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు టాటా మోటార్స్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ డిజైన్ హెడ్ మార్టిన్ ఉలారిక్ తెలిపారు. ఈ ఎస్‌యూవీ ధర రూ.17 లక్షల నుంచి రూ.22 లక్షల మధ్యన ఉండొచ్చని అంచనా.

ఈ నెలాఖరులోపు చేయాల్సిన పనులేమిటంటే..



రాంబాబు గొండాల

జీఎస్‌టీ కింద నమోదైన వ్యాపారస్తులకు నవంబరు నెల చాలా ముఖ్యమైనది. గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి సంబంధించి ఏవైనా సర్దుబాట్లు చేయాలన్నా, గత ఆర్థిక సంవత్సరంలో దాఖలు చేసిన రిటర్నుల్లో జరిగిన పొరపాట్లు సరిదిద్దాలన్నా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన ముఖ్య విషయాలు మీకోసం.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్..

జీఎస్‌టీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) అనేది ఒక నిర్దిష్ట గడువులోపు తీసుకోవాలనే నిబంధన ఒకటి ఉంది. ఐటీసీ నియమ నిబంధనల ప్రకారం ఇన్వాయిస్ లేదా డెబిట్ నోట్ ఏ ఆర్థిక సంవత్సరంలో తీసుకుంటారో.. సంబంధిత ఐటీసీని తదుపరి సంవత్సరం నవంబరు 30 లోపు తీసుకోవాలి. అంటే 2024-25 ఆర్థిక సంవత్సరంలో పొందిన ఇన్వాయిస్‌లు లేదా డెబిట్ నోట్స్‌కు సంబంధించి ఏదైనా ఐటీసీ తీసుకోకుండా మిగిలి ఉంటే ఆ మొత్తాన్ని ఈ నవంబరు 30లోపు తీసుకోవాలి. కాబట్టి వ్యాపారస్తులు తాము గత ఆర్థిక సంవత్సరంలో పొందిన ఇన్వాయిస్‌లను జాగ్రత్తగా గమనించి అర్హత ఉండి తీసుకోని ఐటీసీ ఏమైనా మిగిలి ఉంటే ఆ మొత్తాన్ని ఈ నెలాఖరు లోపు తీసుకోవచ్చు. అయితే ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయకుండా ఐటీసీని తీసుకోలేరు. కాబట్టి నవంబరు 30వ తేదీని తుది గడువుగా దృష్టిలో పెట్టుకుని జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయటం ద్వారా మిగిలిపోయిన ఐటీసీని తీసుకోవచ్చు.

క్రెడిట్ నోట్..

అలాగే గత ఆర్థిక సంవత్సరంలో జరిపిన సరఫరాలకు సంబంధించి ఏదైనా క్రెడిట్ నోట్ జారీ చేసినట్లయితే సంబంధిత క్రెడిట్ నోట్ విలువను తదుపరి సరఫరాలలో తగ్గించుకోవటానికి తుది గడువు నవంబరు 30. కాబట్టి ఏదేనీ క్రెడిట్ నోట్‌కు సంబంధించిన విలువను తగ్గించకుంటే సంబంధిత రిటర్న్ దాఖలు చేయటం ద్వారా నవంబరు 30 లోపు క్రెడిట్ నోట్ విలువను సర్దుబాటు చేసుకోవటం ద్వారా ఇంతకు ముందు ఎక్కువ కట్టిన ట్యాక్స్‌ను తగ్గించుకోవచ్చు.

జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో పొరపాట్లు ఉన్నా..

ఒక నెలలో జరిపిన సరఫరాల వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపాలన్న విషయం తెలిసిందే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దాఖలు చేసిన జీఎస్‌టీఆర్-1 రిటర్నుల్లో చూపాల్సిన వివరాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే ఆ పొరపాట్లు సరిదిద్దుకోవటానికి కూడా గడువు తేదీ నవంబరు 30. ఇంకా జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌తో పాటుగా మరికొన్ని రిటర్నులకు సంబంధించిన పొరపాట్లకు సంబంధించిన సవరణలకు గడువు తేదీ కూడా ఈ నెల 30నే.

ఇక్కడ మరొక ముఖ్య విషయం ఏమిటంటే.. పైన చెప్పిన ప్రతి అంశానికి సంబంధిత నియమ నిబంధనలు వర్తిస్తాయి. అంతేకాకుండా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రిటర్న్ ఒకవేళ నవంబరు 30 కంటే ముందే దాఖలు చేస్తే పైన చెప్పిన అన్ని సందర్భాలకు నవంబరు 30కి బదులుగా వార్షిక రిటర్న్ దాఖలు చేసిన తేదీనే గడువు తేదీగా తీసుకోవాల్సి ఉంటుంది.

ఎలక్ట్రానిక్ క్రెడిట్ రివర్సల్

ఈ నెలాఖరు లోపు చేయాల్సిన మరొక ముఖ్యమైన పని, ఇంతకు ముందు రివర్స్ చేసి తిరిగి క్లెయిమ్ చేయటానికి అర్హత ఉన్న ఐటీసీ బ్యాలెన్స్‌ను 'ఎలక్ట్రానిక్ క్రెడిట్ రివర్సల్ అండ్ రీ-క్లెయిమ్డ్ స్టేట్‌మెంట్' లో చూపటం. ఈ నెలాఖరు లోపు ఈ పని చేయని వారు బ్యాలెన్స్ క్రెడిట్‌ను కోల్పోతారు. కాబట్టి అందరు తమ ఖాతాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వివరంగా చెప్పాలంటే.. జీఎస్‌టీకి సంబంధించి నవంబరు నెల చాలా ముఖ్యమైనది. కాబట్టి వ్యాపారస్తులు తమ ఆడిటర్లతో క్షుణ్ణంగా చర్చించి గత ఆర్థిక సంవత్సర లావాదేవీలకు సంబంధించి ఎలాంటి పెండిగ్‌లు లేకుండా చూసుకోవాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	610	విజయవాడ	625
వరంగల్	612	గోదావరి	620
చిత్తూరు	653	విశాఖపట్నం	605
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	120
కర్నూలు	117	నెల్లూరు	125
విశాఖపట్నం	110	అనంతపురం	125
గోదావరి	111		

ఐసీఎల్ ఫిన్‌కార్ప్ రూ.100 కోట్ల ఎన్‌సీడీ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఐసీఎల్ ఫిన్‌కార్ప్.. సెక్యూర్డ్ రిడీమబల్ నాన్ కన్వర్టబల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.100 కోట్ల సమీకరించనున్నట్లు ప్రకటించింది. ఈ ఎన్‌సీడీ ఇష్యూ ఈ నెల 17న ప్రారంభమై 28న ముగియనుందని సంస్థ సీఎండీ కేజీ అనిల్ కుమార్ వెల్లడించారు. క్రిసిల్ బీబీబీ మైనస్ రేటింగ్ కలిగిన ఈ ఎన్‌సీడీ ఇష్యూ 13,24,36,60,70 నెలల కాలపరిమితులతో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఒక్కో ఎన్‌సీడీని రూ.1,000 ముఖ విలువతో జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. 10.50 శాతం నుంచి 12.62 శాతం వడ్డీ రేటును ఈ ఎన్‌సీడీలకు ఐసీఎల్ ఆఫర్ చేస్తోంది. ఈ ఇష్యూ బేస్ పరిమాణం రూ.50 కోట్లుగా ఉండగా గ్రీన్ షూ ఆప్షన్ కింద మరో రూ.50 కోట్లు సమీకరించనుంది. సంస్థ సేవల విస్తరణతో పాటు వృద్ధికి ఎన్‌సీడీ ద్వారా సమీకరించిన మొత్తాలను వినియోగించనున్నట్లు ఐసీఎల్ ఫిన్‌కార్ప్ తెలిపింది.

భారత ఆర్మీ నుంచి ఐడియా ఫోర్జ్‌కు రూ.100 కోట్ల ఆర్డర్లు

ముంబై: భారత సైన్యం నుంచి రూ.100 కోట్లకు పైగా విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు డ్రోన్ల తయారీ సంస్థ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ లిమిటెడ్ వెల్లడించింది. తమ కొత్త ఉత్పత్తులైన టాక్టికల్ యూఏవీ (అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్) 'జోల్ట్'కు రూ.75 కోట్లు, ఆల్ టెర్రెయిన్ వీటోల్ డ్రోన్ 'స్విచ్ వీ2'కు రూ.30 కోట్ల ఆర్డర్లు దక్కాయని సంస్థ తెలిపింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బెంగళూరులో జరిగిన ఏరో ఇండియాలో కంపెనీ ఈ రెండు అత్యాధునిక డ్రోన్లను విడుదల చేసింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్‌ను ప్రారంభించింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగంలో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ టీఆర్‌ఐ బెంచ్ మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ముగింపు తేదీ ఈ నెల 24.

బంధన్ హెల్త్‌కేర్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. హెల్త్‌కేర్ ఫండ్‌ను తీసుకువచ్చింది. హెల్త్‌కేర్, ఫార్మా, ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టే ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ముగింపు తేదీ ఈ నెల 24.

బీజేపీకి 90% స్ట్రైక్ రేట్ ఎలా సాధ్యం?

» దేశ చరిత్రలో ఎన్నడూ ఇలా జరగలేదు: కేసీ వేణుగోపాల్

» బిహార్ ఫలితాలు ఓట్ చోరీకి నిదర్శనం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, నవంబరు 15: 'బిహార్ ఫలితాలపై సమీక్షిస్తున్నాం. దేశ చరిత్రలో ఓ రాజకీయ పార్టీ (బీజేపీ)కి 90% స్ట్రైక్ రేట్ అనేది ఎప్పుడూ సాధ్యం కాలేదు. ఈసీ మొదట్నుంచీ పక్షపాతంతో వ్యవహరించింది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత లేదు. డేటాను సేకరిస్తున్నాం. ఒకటి, రెండు వారాల్లో కచ్చితమైన ఆధారాలతో వస్తాం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కోశాధికారి అజయ్ మాకెన్, బిహార్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు తదితర సీనియర్ నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం సమావేశమై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం తర్వాత వేణుగోపాల్ మీడియాతో మాట్లాడారు. ఈసీపై ఆరోపణలు గుప్పించారు. బీజేపీని ఈసీ కాపాడుతోందన్నారు. మెషీన్ రీడబుల్ ఓటర్ల జాబితాలను అందించడానికి నిరాకరించడం, పోలింగ్ ప్రక్రియల నుంచి సీసీటీవీ ఫుటేజీని తొలగించడం ద్వారా సిగ్గు లేకుండా ఈసీ అన్ని పరిధులు దాటిందని దుయ్యబట్టారు. 'ఏ సందేహం లేదు. బిహార్ ఎన్నికల ఫలితాలు ప్రధాని, కేంద్ర హోంమంత్రి, ఎన్నికల సంఘం అమలు చేసిన భారీ స్థాయి ఓట్ చోరీనే ప్రతిబింబిస్తున్నాయి' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్ని పరాజయాలు ఎదురైనా కాంగ్రెస్ ఎన్నడూ కనుమరుగు కాలేదని మహారాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రమేశ్ చెన్నితాల చెప్పారు. కాంగ్రెస్ అంతం అవుతుంది లేదా ముక్కలవుతుందన్న వాదనకు అసలు అర్థమే లేదని వ్యాఖ్యానించారు.

కుల విషాన్ని తిరస్కరించిన బిహార్ ఓటర్లు: మోదీ

సూరత్, నవంబరు 15: ప్రతిపక్షాలు చిమ్మిన 'కులతత్వ విషాన్ని' బిహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధాని మోదీ అన్నారు. ఇది దేశానికి శుభ సూచకమని చెప్పారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘన విజయం సాధించడాన్ని పురస్కరించుకొని గుజరాత్‌లోని సూరత్‌లో అక్కడ నివసిస్తున్న బిహారీలు శనివారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. కులాల పేరు చెప్పి విజయం సాధించాలనుకున్న నాయకుల ప్రయత్నాలను బిహార్ ప్రజలు వమ్ముచేశారని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై మోదీ విమర్శల బాణాలు సంధించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలతో కలిసి పనిచేసిన కాంగ్రెస్‌లోని జాతీయవాద నాయకులు 'నామ్‌ధార్' (రాహుల్ గాంధీ) చర్యలను చూసి విచారంలో మునిగిపోయారని వ్యాఖ్యానించారు. దశాబ్ద కాలంగా కాంగ్రెస్ ఎదుర్కొంటున్న వరుస పరాజయాలను చూసి ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సి ఉందని చెప్పారు. దళితులు ఆధిక్యం ఉన్న 38 నియోజకవర్గాలకుగానూ 34 ఎన్‌డీఏకు దక్కాయని గుర్తు చేశారు. దళితులు ప్రతిపక్షాలను తిరస్కరించారనడానికి ఇదే రుజువని చెప్పారు.

రాజ్యసభలో ఎన్‌డీఏకు పెరగనున్న సీట్లు

న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘనవిజయంతో, రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో కూటమి బలం పెరగనుంది. ఈ గెలుపుతో మోదీ ప్రభుత్వ పదవీ కాలం ముగిసే వరకు.. బిహార్ నుంచి ఖాళీ అయ్యే అన్ని రాజ్యసభ స్థానాలనూ కూటమి కైవసం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. భవిష్యత్తులో ఆర్జేడీకి రాజ్యసభలో ప్రాతినిధ్యం దక్కకపోవచ్చు. బిహార్‌లో 16 రాజ్యసభ స్థానాలుండగా, ప్రస్తుతం ఆర్జేడీ ఐదు సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తోంది. అయితే, ఇద్దరు ఆర్జేడీ ఎంపీలతో సహా ఐదుగురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం వచ్చే ఏడాదితో ముగియనుంది. రాజ్యసభలో ఒక్క స్థానాన్ని గెలుచుకోవాలంటే 42మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. మహాగఠ్ బంధన్ వద్ద 35 ఎమ్మెల్యే సీట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో 5ఎంపీ స్థానాలు ఎన్డీయే ఖాతాలో చేరే అవకాశం ఉంది.

25 మంది మంత్రులు పోటీ చేస్తే ఒక్కరికే ఓటమి

పట్నా, నవంబరు 15: బిహార్‌లో పోటీ చేసిన 25 మంది రాష్ట్ర మంత్రుల్లో ఒక్కరు తప్ప మిగిలిన వారంతా విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలు తారాపూర్, లఖిసరాయ్ నియోజకవర్గాల నుంచి గెలిచారు. వీరిద్దరూ బీజేపీకి చెందిన వారే. మొత్తంగా బీజేపీ నుంచి పోటీ చేసిన 15 మంది మంత్రులు ఎన్నికల్లో విజయం సాధించారు. జేడీయూ నుంచి 9 మంది గెలిచారు. కాగా, మంత్రి సుమిత్‌కుమార్ జేడీయూ తరఫున చకాయ్ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా ఓటమి పాలయ్యారు. ఆర్జేడీ అభ్యర్థి సావిత్రీ దేవీ చేతిలో దాదాపు 13వేల ఓట్ల తేడాతో ఈయన ఓడిపోయారు. ఐదేళ్ల క్రితం ఎన్నికల్లో ఈమెపై సింగ్ విజయం సాధించారు.

కర్ణాటకలో క్యాబినెట్ విస్తరణకు రాహుల్ ఓకే

బెంగళూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణకు సీఎం సిద్దరామయ్యకు అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఢిల్లీకి వెళ్లిన సిద్దరామయ్య.. శనివారం సాయంత్రం రాహుల్ గాంధీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. బిహార్ ఎన్నికల ప్రస్తావన తర్వాత రాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై చర్చించారు. దీంతో మంత్రివర్గ విస్తరణ జరుపుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. ఈ విషయం గురించి పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో చర్చించాలని రాహుల్ సూచించారు.

అయ్యప్ప భక్తులూ.. పారాహుషార్!

» నదీ స్నానం చేసే సమయంలో జాగ్రత్త

» ముక్కులోకి నీళ్లు పోకుండా చూసుకోండి

» బ్రెయిన్ ఫీవర్ కేసులతో కేరళ అప్రమత్తం

» ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసిన ఆరోగ్య శాఖ



పథనంతిట్ట(కేరళ), నవంబరు 15: శబరిమల అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తులకు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ శనివారం ప్రత్యేక అడ్వైజరీ జారీ చేసింది. రాష్ట్రంలో అమీబిక్ మెనింజోఎన్‌సైఫలిటిస్ (బ్రెయిన్ ఫీవర్) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నదీ స్నానాలు చేసే సమయంలో ముక్కులోకి నీరు పోకుండా చూసుకోవాలని పేర్కొంది. ఇప్పటికే చికిత్స పొందుతున్నవారు తమ ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులు, మందులు వెంట తీసుకెళ్లాలని, యాత్రకు వచ్చేవారు రోజువారీగా వాడే మందులు నిలిపివేయకూడదని కోరింది. నిదానంగా నడవాలని, దారిలో అక్కడక్కడా విశ్రాంతి తీసుకోవాలని, అలసట, ఛాతీ నొప్పి, ఊపిరి ఆడకపోవడం, నీరసం వంటి సమస్యలు ఎదురైనప్పుడు సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో తక్షణ వైద్య సహాయం తీసుకోవాలని స్పష్టం చేసింది. అత్యవసర పరిస్థితుల్లో 04735 203232 నంబరులో సంప్రదించాలని సూచించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17 నుంచి శబరిమలలోని అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు తెరుచుకోనున్నాయి.

భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ...

- వేడి చేసిన నీటినే తాగాలి. ఆహారం తీసుకొనే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. పండ్లను బాగా కడిగిన తర్వాత తినాలి. మూత పెట్టని, నిల్వ ఉన్న ఆహారం తీసుకోవద్దు.
- బహిరంగ మలవిసర్జన నిషేధం. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలి. వ్యర్థాలను చెత్త డబ్బాల్లో మాత్రమే పడేయాలి.
- యాత్రకు రావడానికి కొద్ది రోజుల ముందునుంచి భక్తులు నడక వంటి తేలికపాటి వ్యాయమాలు చేయాలి.
- పంపా నుంచి సన్నిధానం వరకూ అత్యవసర వైద్య కేంద్రాలతో పాటు భక్తుల కోసం ప్రత్యేక అంబులెన్స్ సేవలు. పంపాలో 24 గంటలు పని చేసే కంట్రోల్ సెంటర్ ఏర్పాటు.
- పథనంతిట్ట జనరల్ ఆస్పత్రిలో అత్యవసర కార్డియాలజీ సేవలు, క్యాథ్ ల్యాబ్ ప్రారంభం.
- యాత్రికులకు అవగాహన కల్పించేందుకు మలయాళంతో పాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో బ్యానర్లు, బోర్డులు సిద్ధం.

శాంపిల్ తీస్తుండగా పేలుడు

నౌగావ్ పోలీస్‌స్టేషన్ పేలుడులో 9 మంది మృతి.. మృతుల్లో పోలీసులు, ఒక నాయబ్ తహసీల్దార్

ఫరీదాబాద్‌లో స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు ఇక్కడ నిల్వ



పేలుడులో చనిపోయినవారికి నివాళి అర్పిస్తున్న మనోజ్ సిన్హా

శ్రీనగర్, నవంబరు 15: జమ్ముకశ్మీర్‌లోని నౌగావ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకున్న పేలుడులో మృతుల సంఖ్య 9కి పెరిగింది. ఇటీవల బయటపడిన ఫరీదాబాద్ ఉగ్రవాద మాడ్యూల్‌పై దర్యాప్తు జరుపుతున్న పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఇస్రార్ అహ్మద్‌షా, ఒక నాయబ్ తహసీల్దార్ (మేజిస్ట్రేట్)తో కలిపి మొత్తం 9 మంది మరణించారని, 32 మంది గాయపడ్డారని జమ్ముకశ్మీర్ డీజీపీ నళినిప్రభాత్ శనివారం తెలిపారు. బాధితుల్లో అధికంగా పోలీస్, ఫోరెన్సిక్ అధికారులే ఉన్నట్లు చెప్పారు. ఈ ఘటన వెనుక ఉగ్రవాద కోణం లేదని కేంద్రం ప్రకటించింది. ఘటనపై జమ్ముకశ్మీర్ ఎల్జీ దర్యాప్తునకు ఆదేశించారు.

ఏం జరిగింది?

ఇటీవల హరియాణాలోని ఫరీదాబాద్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేదించిన జమ్ముకశ్మీర్ పోలీసులు.. అక్కడి అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ముగ్గురు వైద్యులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అందులో ఒకడైన ముజమ్మిల్ గది నుంచి స్వాధీనం చేసుకున్న 360 కిలోల పేలుడు పదార్థాలను నౌగావ్ పోలీస్ స్టేషన్‌లో భద్రపర్చారు. దర్యాప్తులో భాగంగా గురువారం నుంచి ఆ పేలుడు పదార్థాల నుంచి వివిధ రకాల శాంపిల్స్ సేకరిస్తున్నారు. నాయబ్ తహసీల్దార్ ముజాఫిర్ అహ్మద్ ఖాన్ సమక్షంలో రాష్ట్ర దర్యాప్తు ఏజెన్సీ ఇన్‌స్పెక్టర్ ఇస్రార్ అహ్మద్ షా నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.20 గంటల సమయంలో శాంపిల్ సేకరిస్తుండగా అది ఒక్కసారిగా పేలిపోయిందని డీజీపీ నళిని ప్రభాత్ తెలిపారు. 'నిబంధనల ప్రకారం ఫోరెన్సిక్, కెమికల్ ఎగ్జామినేషన్ కోసం రెండు రోజులుగా శాంపిల్స్ సేకరిస్తున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఫోరెన్సిక్ లేబోరేటరీ సిబ్బంది ఆ పనిలో ఉండగా దురదృష్టవశాత్తూ పేలుడు సంభవించింది. ఈ ఘటన విషయంలో ఇతర ఏ రకమైన ప్రచారాలను నమ్మొద్దు' అని సూచించారు. మొదటి పేలుడు సంభవించిన వెంటనే పోలీసులు, ఇతర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఆ వెంటనే పోలీస్ స్టేషన్‌లో నిల్వ ఉంచిన మరికొన్ని పేలుడు పదార్థాలు కూడా పేలిపోవటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని అధికారులు తెలిపారు. పోలీసులకు సహాయం చేయటానికి వచ్చిన ఒక టైలర్ కూడా ఈ పేలుడులో ప్రాణాలు కోల్పోయాడు.

మృతులు వీరే...

పేరు	హోదా
ముజాఫిర్ అహ్మద్	నాయబ్ తహసీల్దార్
ఇస్రార్ అహ్మద్	పోలీస్ ఇన్‌స్పెక్టర్,స్పెషల్ బ్రాంచ్
జావేద్ రాథర్	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
అర్షిద్ అహ్మద్ షా	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
ఐజాజ్ అఫ్జల్ మిర్	సెలక్షన్ గ్రేడ్ కానిస్టేబుల్
అహ్మద్ అమిన్ మిర్	కానిస్టేబుల్
షౌకత్ అహ్మద్ భట్	కానిస్టేబుల్
సుహైల్ రాథర్	చౌకీదార్
మొహమ్మద్ షఫ్రే	టైలర్

దర్యాప్తునకు ఆదేశం: ఎల్జీ

నౌగావ్ పోలీస్‌స్టేషన్ పేలుడుపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శనివారం ప్రకటించారు. పేలుడులో పోలీస్, ఇతర అధికారులను కోల్పోవటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక కుట్రకోణం ఏమీ లేదని కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే తెలిపారు. ఈ పేలుడు ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. భద్రతా సిబ్బంది ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారనేది ఈ ఘటన గుర్తుచేస్తోందని శనివారం ఎక్స్‌లో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పేలుడు కేంద్ర ప్రభుత్వానికి మేల్కొలుపు లాంటిదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. నౌగావ్ పేలుడపై జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తంచేశారు.

డేటా భద్రతచట్టాన్ని నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 15: దేశంలో తొలిసారి వ్యక్తిగత సమగ్ర వివరాల(డేటా) చట్టాన్ని నోటిఫై చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 13న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదించిన రెండేళ్ల తర్వాత, వ్యక్తుల గోప్యతను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించిన 8సంవత్సరాల తర్వాత దీనిని నోటిఫై చేయడం గమనార్హం. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ)గా పేర్కొనే ఈ చట్టానికి సంబంధించిన నియమాలు, నిబంధనలు కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం వ్యక్తిగత డేటాను నిర్వహించే కంపెనీలకు కొన్ని బాధ్యతలతోపాటు నియమాలను కూడా పేర్కొంది. అదేవిధంగా వినియోగదారుల హక్కులను పేర్కొనాలని తెలిపింది. దీనికిగాను ఆయా కంపెనీలకు 18 మాసాల గడువు విధించింది. డేటా నిర్వహణ, నిలుపుదల, సమ్మతి, పిల్లలకు సంబంధించిన వివరాల భద్రత, ఆడిట్ వంటి వివరాల విషయంలో ఆయా కంపెనీలు గోప్యతను పాటించాల్సి ఉంటుంది. రెండు వేర్వేరు నోటిఫికేషన్లను విడుదల చేసిన కేంద్రం.. దీనిలో భాగంగా రూల్ 17(1) ప్రకారం నలుగురు సభ్యులతో కూడిన డేటా ప్రొటెక్షన్ బోర్డు(డీపీబీ)ను ఏర్పాటు చేసింది. దీని కేంద్ర కార్యాలయం దేశ రాజధాని ప్రాంతంలో ఉంటుంది. ఏదైనా వ్యక్తిగత వివరాలు బయటకు వెల్లడించినా, నియమాలు ఉల్లంఘించినా 72 గంటల్లో డీపీబీకి సమాచారం ఇచ్చే వెసులుబాటు ఉంటుంది. కాగా, ఈ చట్టంలోని నిబంధన23(2)పై పలువురు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి కారణాలు చెప్పకుండానే పౌరుల వ్యక్తిగత వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. అంతేకాదు, పుట్టుస్వామి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విస్మరించారని ఢిల్లీకి చెందిన శ్వేతా వెంకటేశన్ తెలిపారు.

స్మార్ట్‌గా 'ఉగ్ర' కుట్ర!





నిఘా సంస్థలు వాడే టెక్నాలజీతో పరస్పరం మెయిల్ సంభాషణ

న్యూఢిల్లీ, నవంబరు 15: ఢిల్లీ బాంబు పేలుడులో ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ నడిపిన 'డాక్టర్ మాడ్యుల్'లోని సభ్యులు తమ డిజిటల్ ఆధారాలు దొరక్కుండా జాగ్రత్తపడినట్టు నిఘా వర్గాలు తెలిపాయి. దీని కోసం...ఒక ఈమెయిల్‌ను సృష్టించి, పాస్‌వర్డ్‌ను అందరి దగ్గర ఉంచుకున్నారు. మెయిల్ రాసి, దానిని ఎవరికైనా పంపితే ట్రాక్ చేయడం తేలిక. కానీ, ఆ మెయిల్‌ను ఎవరికీ పంపకపోతే డ్రాఫ్ట్‌లోకి అది చేరుతుంది. ఈ మాడ్యుల్‌లోని సభ్యులు తమ వద్ద ఉన్న పాస్‌వర్డుతో మెయిల్ ఓపెన్ చేసి డ్రాఫ్ట్‌లో తమకోసం ఉంచిన సందేశాన్ని చదువుకుంటారు. సాధారణంగా నిఘా సంస్థలు ఈ టెక్నాలజీని వాడతాయి. కాగా, ఢిల్లీ పేలుడు నేపథ్యంలో పోలీసులతో పాటు దర్యాప్తు సంస్థలు హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీపై దృష్టి సారించాయి. ఇప్పటికే ఐదుగురిని అనుమానం మీద అదుపులోకి తీసుకోగా, శుక్రవారం రాత్రి మరో ముగ్గురిని హరియాణాలోని నుహ్, ధౌజ్‌ల్లో అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అల్ ఫలాహ్ వర్సిటీకి చెందిన మొహమ్మద్, ముస్తాకీమ్ అనే ఇద్దరు వైద్యులు, లైసెన్స్ లేకుండా ఎరువుల వ్యాపారం చేస్తున్న దినేశ్ అనే వ్యక్తి ఉన్నారు. ఈ వైద్యులు ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ, ఉగ్ర కుట్ర సూత్రధారి ముజమ్మిల్‌లకు సన్నిహితులని గుర్తించారు. వీరిలో ఒకరు పేలుడు జరిపిన రోజున ఢిల్లీలోనే ఉన్నాడని, ఎయిమ్స్‌లో ఇంటర్వ్యూ కోసం వచ్చినట్లు తెలిసింది. దినేశ్ బాంబుల తయారీ కోసం ఎరువులు అమ్మాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలో జనీసూర్ ఆలం అనే ఎంబీబీఎస్ విద్యార్థిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఇతను అల్ ఫలాహ్ వర్సిటీలో చదువుతున్నట్టు గుర్తించారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో ఒక వైద్యుడిని దర్యాప్తు సంస్థలు అదుపులోకి తీసుకున్నాయి. ఇతడు గతంలో అల్ ఫలాహ్‌లో పనిచేశారు.

షహీన్ నేతృత్వంలోనే 'మాడ్యుల్'

ఉగ్ర కుట్రలో అరెస్టయిన మహిళా వైద్యురాలు షహీన్ షాహిద్.. అల్ ఫలాహ్ యూనివర్సిటీ కేంద్రంగా నడిచిన తీవ్రవాద మాడ్యూల్‌కు నాయకత్వం వహించారని, ఈ గ్రూపులోని వైద్యుల మధ్య అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు ఆమె తరచుగా జోక్యం చేసుకొనే వారని దర్యాప్తు అధికారులు చెబుతున్నాయి.

ఉగ్ర కుట్ర బయటపడిపోవడంతో తప్పించుకునే ప్రయత్నం చేసిన ఆత్మాహుతి బాంబరు ఉమర్ నబీ ఈ క్రమంలో పలు మొబైళ్లను వాడాడు. కారు బాంబుపేలుడుకు ముందురోజు అతడు ఫరీదాబాద్‌లోనే ఉన్నట్టు తెలిపే సీసీ కెమెరా ఫుటేజీ తాజాగా పోలీసుల చేతికి అందింది. ఫరీదాబాద్‌లోని ఓ షాపులో ఉమర్ నబీ ఫోన్ చార్జింగ్ పెట్టడం దానిలో కనిపించింది. ఆ సమయంలో అతడు ఒత్తిడిలో ఉన్నట్టు అనిపించాడు. ఢిల్లీలోకి ప్రవేశించడానికి ముందే తన ఫోన్లను అతడు మాయంచేయడంగానీ లేక నిర్వీర్యం చేయడంగానీ చేసి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా, పుల్వామాలోని ఉమర్ ఇంటిని అధికారులు కూల్చివేశారు.

ఫరీదాబాద్‌లో సీసీ కెమెరాకు చిక్కిన ఉమర్

లాలూ కుటుంబంలో బిహార్ ఫలితాల చిచ్చు

» రాజకీయాలకు గుడ్‌బై చెప్పిన లాలూ కుమార్తె రోహిణి

» కుటుంబంతో సంబంధాలు కూడా తెంచుకుంటున్నట్లు వెల్లడి



పట్నా, నవంబరు 15: బిహార్ ఎన్నికల ఫలితాలు ఆర్జేడీ అధినేత లాలూ కుటుంబంలో చిచ్చు రేపాయి. లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. అంతేకాదు కుటుంబంతో సంబంధాలు కూడా తెంచుకుంటున్నట్లు ఆమె ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. సంజయ్ యాదవ్, రమీజ్ ఆదేశాల మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. విమర్శలన్నింటికీ తాను బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. హర్యానాకు చెందిన ఆర్జేడీ రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్.. తేజస్వీ యాదవ్‌కు అత్యంత సన్నిహితుడు ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించినందుకు తేజస్వీ, సంజయ్ యాదవ్, రమీజ్ తనను తిట్టి, కొట్టడమే కాకుండా ఇంటి నుంచి గెంటేశారని రోహిణి ఆరోపించారు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికలకు ముందు తన సోదరుడైన తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని రోహిణి తప్పుబట్టారు. అయితే ఇటీవలి ఎన్నికల సమయంలో మాత్రం ఆమె తన మరో సోదరుడైన తేజస్వీ తరఫున ప్రచారం చేశారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన రోహిణి ఆచార్య లాలూ స్నేహితుడైన విజయ్‌సింగ్ కుమారుడు సమరేశ్‌సింగ్‌ను పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. లాలూకు కిడ్నీ ఇవ్వడం ద్వారా రోహిణి గతంలో వార్తల్లో నిలిచారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సరన్ నుంచి ఆర్జేడీ తరఫున పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

కేంద్ర మాజీ మంత్రి ఆర్‌కే సింగ్‌పై బీజేపీ వేటు

పట్నా, నవంబరు 15: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తిరుగుబాటు నేతలపై బీజేపీ దృష్టి సారించింది. ఎన్డీయే ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి రాజ్‌కుమార్(ఆర్‌కే) సింగ్‌ను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం శనివారం సస్పెన్షన్ ఉత్తర్వులతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆర్‌కే సింగ్‌తో పాటు ఎమ్మెల్సీ అశోక్‌కుమార్ అగర్వాల్, ఆయన భార్య కతిహార్ మేయర్ ఉషా అగర్వాల్‌ను కూడా బీజేపీ సస్పెండ్ చేసింది. వీరు తమ కుమారుడు సౌరభ్ అగర్వాల్‌ను వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) తరఫున కతిహార్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం తార్‌కిషోర్ సింగ్‌పై పోటీకి నిలిపారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆర్‌కే సింగ్ 2014లో బీజేపీలో చేరి ఆరా లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండు సార్లు ఎన్నికయ్యారు. గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరిపై ఇటీవల వచ్చిన నేరారోపణలతో పాటు భగల్పూర్‌లో అదానీ గ్రూపుతో ప్రభుత్వం కుదుర్చుకున్న పవర్ ప్లాంట్ ఒప్పందంపై కూడా ఆర్‌కే సింగ్ బహిరంగ విమర్శలు చేసి పార్టీ అధిష్ఠానానికి ఆగ్రహం కలిగించారు.

'సర్' మార్చిన తలరాత?

174 నియోజకవర్గాల్లో తొలగించిన ఓట్ల కంటే గెలిచిన అభ్యర్థుల మెజారిటీ తక్కువే!

» 91 సీట్లలో ఓడిన సిట్టింగులు.. అందులో 75 మంది మహాగఠ్‌బంధన్ అభ్యర్థులే..

» 'సర్'పై విశ్లేషణతో 'ది క్వింట్' కథనం



న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే అంచనాలకు మించి 202 సీట్లు సాధించింది. మహాగఠ్‌బంధన్ కూటమి దారుణంగా చతికిలపడింది. ఇటీవల బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)' కూడా ఈ ఫలితాలకు కారణమని విశ్లేషిస్తూ 'ది క్వింట్' కథనం ప్రచురించింది. 'సర్'తో చాలా వరకు ఎన్డీయేకే ప్రయోజనం చేకూరిందని పేర్కొంది. ఈ కథనం మేరకు.. 174 నియోజకవర్గాల్లో 'సర్'తో తొలగించిన ఓట్ల కంటే అభ్యర్థులకు తక్కువ మెజారిటీ వచ్చింది. ఇందులోని 91 స్థానాల్లో సిట్టింగ్‌లు ఓటమి పాలయ్యారు. వీటిలో గతంలో మహాగఠ్‌బంధన్ గెలుచుకున్నవి 75కాగా, ఎన్డీయే గెలుచుకున్నవి 14 మాత్రమే. ఇతర చిన్న పార్టీలు గెలిచినవి 2 స్థానాలు. అదే ఈసారి మహాగఠ్‌బంధన్‌కు 15 మాత్రమే వస్తే, ఎన్డీయే 75 సీట్లు గెలుచుకుంది. ఇతరులకు ఒక్కసీటే దక్కింది. అంటే 'సర్'తో ఓట్లు తొలగించిన నియోజకవర్గాల్లో చాలా వరకు ఎన్డీయేనే చేజిక్కించుకుందని విశ్లేషకులు పేర్కొన్నారు. మరోవైపు బిహార్ ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌కు ఓట్ల శాతం పెద్దగా ఏమీ తగ్గలేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఎన్డీయే కూటమికి 41.4 శాతం, మహాగఠ్‌బంధన్‌కు 38.8 శాతం, ఇతరులకు 19.8శాతం ఓట్లు వచ్చాయి. ఈసారి ఎన్డీయే కూటమికి 46.9 శాతం (5.5శాతం ఎక్కువ), మహాగఠ్‌బంధన్‌కు 37.9 శాతం (0.9శాతం తక్కువ), జనసురాజ్ పార్టీకి 3.3శాతం (కొత్తగా ఏర్పాటైనది), ఇతరులకు 12.0శాతం ఓట్లు (7.9శాతం తక్కువ) ఓట్లు వచ్చాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి మహాగఠ్‌బంధన్‌కు తగ్గిన ఓట్లు ఒకశాతం లోపే. గతంలో చిన్న పార్టీలకు పోలైన ఓట్లు ఎన్డీయేకు పడ్డాయి. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో బిహార్‌లో నకిలీ, తప్పుడు ఓట్లు తొలగించడం వల్లే ఎన్డీయే ఘన విజయం సాధించిందని కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇన్నాళ్లూ ఆర్జేడీ, కాంగ్రెస్ ఆ తప్పుడు ఓట్లతోనే విజయం సాధిస్తూ వచ్చాయని ఆరోపించారు. అందుకే 'సర్' ప్రక్రియను కాంగ్రెస్, వామపక్షాలు, ఆర్జేడీ, ఇతర ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని వ్యాఖ్యానించారు.

ప్రజాసేవలో గెలుపోటములు తప్పవు: ఆర్జేడీ

పట్నా, నవంబరు 15: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఆర్జేడీ శనివారం తొలిసారిగా స్పందించింది. ఓటమికి నిరాశ చెందడం లేదని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయం ఎక్స్‌లో హిందీ భాషలో పోస్టు పెట్టింది. "ప్రజాసేవ విరామంలేని ప్రక్రియ, ముగింపులేని ప్రయాణం. ఎగుడుదిగుడులు తప్పవు. ఓడినప్పుడు నిరాశ చెందడం, గెలిచినప్పుడు గర్వపడడం ఉండదు. రాష్ట్రీయ జనతాదళ్ పేదల పార్టీ. వారి గొంతును వినిపిస్తునే ఉంటుంది" అని పేర్కొంది.

ఎస్ఐఆర్ పూర్తైన తర్వాత కూడా 3 లక్షల మంది ఓటర్లను చేర్చాం

అందుకే బిహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్ల నుంచి 7.45 కోట్లకు పెరిగింది: ఈసీ

న్యూఢిల్లీ, నవంబరు 15: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ముగిసి, తుది జాబితాను ప్రకటించిన తర్వాత.. మళ్లీ 3లక్షల మంది ఓటర్లను అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాల్లో చేర్చామని ఎన్నికల సంఘం(ఈసీ) అధికారులు వెల్లడించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులైన ఓటర్లను నామినేషన్ల గడువు ముగిసే తేదీకి 10రోజుల ముందు వరకు ఓటరు జాబితాలో చేర్చవచ్చని తెలిపారు. "బిహార్‌లో ఎస్ఐఆర్ పూర్తై తుది జాబితా ప్రకటించినప్పుడు 7.42కోట్ల మంది ఉన్న ఓటర్లు.. పోలింగ్ ముగిసే సమయానికి 7.45కోట్లకు ఎలా పెరిగారు" అంటూ కాంగ్రెస్ చేసిన సోషల్ మీడియా పోస్టుపై ఈసీ అధికారులు ఈ మేరకు వివరణ ఇచ్చారు. బిహార్‌లో సెప్టెంబరు 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించారు. దీని ప్రకారం బిహార్‌లో 7.42కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే, రెండు దశల పోలింగ్ పూర్తైన తర్వాత చేసిన ప్రకటనలో మొత్తం ఓటర్ల సంఖ్యను ఈసీ 7.45కోట్లుగా ప్రకటించింది. బిహార్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. మొదటి దశ పోలింగ్‌కు నామినేషన్ల తుది గడువు అక్టోబరు 17, రెండో దశ తుది గడువు అక్టోబరు 20. అంటే.. తుది ఓటరు జాబితా ప్రకటించిన 10 రోజుల్లోనే ఎన్నికల సంఘం మళ్లీ 3లక్షల మంది ఓటర్లను చేర్చిందన్న మాట.

3 తప్పులు.. ఓటమి తిప్పలు

ఆర్జేడీ, కాంగ్రెస్ చేసిన వ్యూహాత్మక పొరపాట్లతో మహాగఠ్ బంధన్ కూటమికి దెబ్బ

పట్నా, నవంబరు 15: బిహార్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్ చేసిన మూడు ప్రధాన వ్యూహాత్మక తప్పిదాలు మహాగఠ్‌బంధన్ కూటమి ఓటమికి దారితీశాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. సామాజిక సమీకరణాలను అంచనా వేయడంలో విఫలం కావడం, ప్రచార తీరు సరిగా లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల ఓటర్లను పట్టించుకోకపోవడం గట్టిగానే ప్రభావం చూపాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈసారి గెలిచి సీఎం కావడం ఖాయమనుకున్న తేజస్వీ యాదవ్ ఆశలు ఆవిరయ్యాయని అంటున్నారు. నిపుణుల విశ్లేషణల మేరకు.. మహాగఠ్ బంధన్ కూటమి అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాల అంచనాల్లో విఫలమైంది. యాదవ వర్గానికి చెందిన వారికి పెద్ద సంఖ్యలో సీట్లు ఇవ్వడం.. ఓబీసీలు, ఈబీసీలు, దళితుల్లో ఆందోళన కలిగించింది. ప్రత్యామ్నాయంగా ఆ ఓట్లన్నీ ఎన్డీయే వైపు మళ్లాయి. ఎన్నికలకు ముందే తేజస్వియాదవ్‌ను కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కూడా ప్రభావం చూపింది. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి ప్రచారం మొదట్లో ఓటు చోరీ చుట్టూనే తిరిగింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై ఇరు పార్టీల శ్రేణులు తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేశాయి. కానీ క్షేత్రస్థాయిలో దీని ప్రభావం లేదని పార్టీ శ్రేణులు చెప్పినా అధినేతలు వినిపించుకోలేదు. చివరికి పోలింగ్ దగ్గరపడ్డాక ఒక్కసారిగా ఓటుచోరీని వదిలేసి, స్థానిక అంశాలు, సంక్షేమ హామీలు ఇచ్చారు. బిహార్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్జేడీకి మంచి పట్టు ఉండేది. కానీ ఈసారి పట్టణ ప్రాంతాల ఓటర్లు, చదువుకున్న యువతను ఆకట్టుకునే దిశగానే హామీలు ఇవ్వడం, గ్రామీణ ప్రాంతాలపై దృష్టిపెట్టకపోవడం ప్రభావం చూపింది. పంటలకు కనీస మద్దతు ధరల పెంపుపై ఆశలు పెట్టుకున్న రైతులకు మహాగఠ్ బంధన్ నుంచి ఆ దిశగా హామీ రాలేదు.

బిహార్ అసెంబ్లీలో సగం మందికిపైగా నేరచరితులే

న్యూఢిల్లీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీకి ఎన్నికైన 243 మంది కొత్త ఎమ్మెల్యేలలో 130 మంది (53%)కి నేర చరిత్ర ఉంది. వీరిలో 102 మందిపై తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. కొత్త ఎమ్మెల్యేలలో కేవలం 29 మంది మహిళలే (12%) ఉన్నారు. గత అసెంబ్లీలో 26 మంది మహిళా ఎమ్మెల్యేలుండగా ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు పెరిగారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్లను పరిశీలించిన ఏడీఆర్ రూపొందించిన నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. శనివారం ఏడీఆర్ విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. 2020 అసెంబ్లీకి ఎన్నికైన వారిలో 163 మంది (68శాతం)పై క్రిమినల్ కేసులు ఉండగా.. ఈసారి 130 మందిపై క్రిమినల్ కేసులున్నాయని తెలిపింది. పార్టీల వారీగా చూస్తే అత్యధికంగా బీజేపీ ఎమ్మెల్యేలలో 54 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. జేడీయూలో 31, ఆర్‌జేడీలో 18, ఎల్‌జేపీ రామ్‌విలాస్‌లో 11, కాంగ్రెస్‌లో 4, ఎంఐఎంలో ఐదుగురు ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులున్నాయి. ఎమ్మెల్యేలలో ఆరుగురిపై హత్య కేసులు, 19 మందిపై హత్యాయత్నం కేసులు, 9 మందిపై మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్నట్లు ఏడీఆర్ పేర్కొంది.



బాబుపై విశ్వాసంతోనే పెట్టుబడుల వెల్లువ

» సీఆర్‌డీఏకు 46 ఒప్పందాలు : మంత్రి నారాయణ

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరగడం వల్లనే అంచనాలకు మించి పెట్టుబడులు వెల్లువెత్తాయని పురపాలక మంత్రి పి.నారాయణ చెప్పారు. సీఐఐ సదస్సులో రెండో రోజైన శనివారం 'సుస్థిర నగరాలు: ఫ్రమ్ విజన్ టు ఇన్వెస్ట్‌మెంట్' అనే అంశంపై ప్లీనరీ నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఆర్‌డీఏకు సంబంధించి రెండు రోజుల్లో మొత్తం 46 ఒప్పందాలు జరిగాయని చెప్పారు. అంతకుముందు ప్లీనరీలో మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి నగరాన్ని ఆర్థికంగా, పర్యావరణపరంగా ప్రజలకు సురక్షితమైన, సుస్థిరమైన రాజధానిగా అభివర్ధించారు. కొత్తగా అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును నిర్మించబోతున్నామన్నారు.



ప్రకృతి వ్యవసాయంలో ఏపీకి ప్రపంచస్థాయి గుర్తింపు తథ్యం

» ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రాధాన్యం: అచ్చెన్న



విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాల కారణంగా ప్రకృతి వ్యవసాయంలో ఏపీకి ప్రపంచస్థాయి గుర్తింపు లభించడం తథ్యమని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సీఐఐ సదస్సులో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ సీఐఐ సదస్సు విజయవంతమైందని ఆనందం వ్యక్తంచేశారు. రసాయనాలు లేని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండడంతో ఈ తరహా సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తొమ్మిదేళ్ల కిందట సీఎం చంద్రబాబు ముందుచూపుతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించారని గుర్తుచేశారు. రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషించే ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

13.25 లక్షల కోట్లు!

613 ఒప్పందాలు

16 లక్షల ఉద్యోగాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో 2019-24 మధ్య తిరోగమన విధానాలతో పారిశ్రామికరంగం స్తంభించింది. కొత్త పరిశ్రమలు రాకపోగా.. ఉన్నవాటినీ తరిమివేశారు. ఇలాంటి తరుణంలో గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించింది. చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడ్డాక.. గత సర్కారు సృష్టించిన విధ్వంసాన్ని పారిశ్రామికవేత్తలు మరచిపోయి.. తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పించేందుకు చాలానే శ్రమించాల్సి వచ్చింది. చంద్రబాబు, మంత్రి లోకేశ్ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లినప్పుడు.. రాష్ట్రంలో సుస్థిర పాలన ఉందని.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం చేపడుతున్నామంటూ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పాదుగొల్పేందుకే సమయమంతా వెచ్చించాల్సి వచ్చింది. పెట్టుబడులను సాధించే లక్ష్యంతో సింగపూర్, అమెరికా తదితర దేశాల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ రోడ్‌షోలు నిర్వహించారు. పెట్టుబడుల రక్షణకు తాము చేపడుతున్న చర్యలు, కల్పిస్తున్న వసతులు, ఇస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను ముఖతా వివరించారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్యంతో సదస్సు చేపడుతున్నామని.. పెట్టుబడులతో తరలి రావాలని ఆహ్వానించారు.

కేంద్రం మద్దతుతో ఊపు

విశాఖ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు లభించడంతో మరింత ఉత్సాహంగా.. పెట్టుబడుల రక్షణకు, సుస్థిర ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహకాలకు రూపమిచ్చింది. మంత్రులు లోకేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్, పి.నారాయణ, బీసీ జనార్దనరెడ్డి, ఎం.రాంప్రసాదరెడ్డి విశాఖలోనే మోహరించి.. సదస్సుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు అవసరమైన వసతులన్నీ కల్పించారు. తమ తమ శాఖల పరిధిలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను విశదీకరించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సదస్సులో స్వయంగా పాల్గొన్నారు. ఢిల్లీ తరహాలో రాష్ట్రంలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుల కోసం ప్రత్యేక వేదిక రూపకల్పనకు సూచించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఇందుకు విశాఖ రుషికొండ అనువైనదని పీయూష్‌కు సూచించారు. ఇంకోవైపు.. కూటమి ప్రభుత్వ సమష్టితత్వం ఈ సదస్సులోనూ ప్రస్ఫుటమైంది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరపు ప్రతినిధిగా రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి అదానీ, రెన్యూ, యాక్సిస్, చింతా, హీరో, రిలయన్స్, బజాజ్ వంటి సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. జగన్ హయాంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన లులూ గ్రూపు తదితర సంస్థలు తిరిగి రాష్ట్రానికి రావడమే గాక రూ.వేల కోట్ల విలువైన పెట్టుబడులకు ఎంవోయూలు చేసుకోవడం విశేషం. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పాదుగొల్పడానికి.. వారికివ్వాల్సిన ప్రోత్సాహకాలు ఎప్పటికప్పుడు ఆటోమేటిగ్గా అందించడానికి ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను తెరుస్తున్నట్లు సీఎం ప్రకటించారు. దీని నుంచి నిర్దిష్ట సమయంలో పరిశ్రమల ఖాతాల్లో నేరుగా రాయితీల సొమ్ము జమయ్యే సౌకర్యం కల్పించారు.

సదస్సు జరిగిందిలా..

విశాఖ సదస్సులో 45 దేశాలకు చెందిన 4,975 మంది పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో అంతర్జాతీయ ప్రతినిధులు 640 మంది, దేశీయ ప్రతినిధులు 1135 మంది, దౌత్యవేత్తలు 185 మంది, ఎంవోయూల భాగస్వాములు 1,575 మంది ఉన్నారు. రాష్ట్ర అధికారులతో కలిపితే ఈ సంఖ్య 5,587కి చేరింది. రెండ్రోజుల సదస్సులో 41 సెషన్స్ జరిగాయి. 190 మంది ప్రసంగించారు. ఇందులో ప్లీనరీ సెషన్లు 26, రాష్ట్ర సెషన్లు 11, దేశీయ సదస్సులు 4 జరిగాయి. ముఖ్యమంత్రి 24 ద్వైపాక్షిక సమావేశాల్లో, 16 బిజినెస్ భేటీల్లో పాల్గొన్నారు. ఎంవోయూల కార్యక్రమాలకూ హాజరయ్యారు.

ఇవీ భారీ పెట్టుబడుల ఒప్పందాలు

శాఖ	ఇన్వెస్టర్	పెట్టుబడి	ఉద్యోగాలు
ఇంధన శాఖ	ఏబీసీ క్లీన్‌టెక్, యాక్సిస్ ఎనర్జీ	1,10,250	13,500
ఇంధన శాఖ	ఎకోరాన్ ఎనర్జీ	38,250	7,000
ఇంధన శాఖ	చింతా గ్రీన్ ఎనర్జీ	30,000	6,000
ఇంధన శాఖ	రెన్యూ	25,000	10,000
ఇంధన శాఖ	హీరో ఫ్యూచర్	15,000	15,400
ఇంధన శాఖ	ఫోర్‌స్క్వేర్ గ్రీన్‌ఎనర్జీ	10,205	1,750
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్	44,000	3,000
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	గ్రీన్‌కో ఏఏజీ అల్యూమినియం	35,000	టీబీడి
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	వారీ గ్రూప్	20,000	2,000
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	ఏజీల్	19,000	1,800
ఇండస్ట్రీస్ అండ్ కామర్స్	ఇండియన్ బులియన్ అండ్ జ్యూయలర్స్	15,000	100
మౌలిక సదుపాయాలు	యుమెండిస్ టెక్నాలజీస్	92,000	52,000
మౌలిక సదుపాయాలు	జీఎంఆర్-చీఐఏఎల్	20,000	1,80,000
మౌలిక సదుపాయాలు	కార్బోనటిక్	19,100	8,000
మౌలిక సదుపాయాలు	క్రౌన్ ఎల్ఎన్‌జీ	10,640	-
మౌలిక సదుపాయాలు	యునైటెడ్ పెట్రో గ్రూప్	7,600	12,000
ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్	10,603	3,000
ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	హైపర్‌నెక్స్	10,000	2,000
ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	యీమాక్	9,000	19,500
ఏపీసీఆర్‌డీఏ	మణిపాల్ గ్రూప్	15,000	1,000
ఏపీసీఆర్‌డీఏ	బెర్జయ గ్రూప్	8,300	-
పర్యాటక శాఖ	స్టామెడ్ హోల్డింగ్స్	1,060	1,200
ఆహారోత్పత్తి	రిలయన్స్ కన్స్యూమర్స్	1,622	4,500
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్	ఏసీఈ కాకినాడ హిల్స్ సిటీ	1,625	10,000

నాయుడుపేటలో వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్లాంట్

» సోలార్ సెల్, మాడ్యూల్స్ తయారీ

» ప్రోత్సాహకాలు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాయుడుపేటలోని మల్టీప్రొడక్ట్ సెజ్‌లో మరో ప్రఖ్యాత పరిశ్రమ ఏర్పాటు కానుంది. రూ.1,743 కోట్ల పెట్టుబడితో, 415 మందికి ఉద్యోగాలను కల్పించే సోలార్ సెల్స్, మాడ్యూల్ తయారీ ప్లాంట్‌ను వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేటు లిమిటెడ్ స్థాపించేందుకు రాష్ట్ర పరిశ్రమల శాఖ అనుమతులు ఇచ్చింది. ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వోల్ట్‌సన్ ఒక్కో దశలో ఒక్కో గిగావాట్ సెల్, గిగావాట్ మాడ్యూల్స్ చొప్పున మొత్తంగా రెండు దశల్లో రెండు గిగావాట్ల సెల్, మాడ్యూల్స్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. తొలిదశను 2027లో, రెండో దశను 2029లో పూర్తి చేస్తుంది. ఈ సంస్థకు రోజుకు 1.5 ఎంఎల్‌డీ నీటిని, 40 మెగావాట్ల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రోత్సాహక విధానం మేరకు 2029 దాకా స్థిర మూలధనం రూ.1,504 కోట్లకు సంపూర్ణ ప్రోత్సాహకాలను అందిస్తారు. యూనిట్ రూపాయి చొప్పున పదేళ్లపాటు విద్యుత్‌ను సబ్సిడీ ధరకు ఇస్తారు. స్టాంప్‌డ్యూటీని పూర్తిగా మినహాయిస్తారు.

ఏ శాఖలో ఎన్ని పెట్టుబడులు?

ప్రభుత్వ శాఖ	ఒప్పందాలు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉద్యోగాలు
ఇంధనం	63	5,33,351	26,6722
పరిశ్రమలు	193	2,80,384	51,9083
మౌలిక వసతులు	38	2,01,758	30,6649
ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	107	1,59,467	29,6315
ఏపీసీఆర్‌డీఏ	41	48,711	4,1625
పర్యాటక శాఖ	112	21,036	1,05,804
ఆహార తయారీ సంస్థలు	38	13,008	47,390
పురపాలక శాఖ	8	4,944	12,150
టెక్స్‌టైల్	7	4,490	8,450
ఆరోగ్యం	3	4,208	24,000
విద్య	2	4,359	3,000
బహుళ సంస్థలు	1	50,000	-
మొత్తం	613	13,25,716	16,31,188

(విశాఖలో గిగావాట్ సామర్థ్యంతో ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు టిల్‌మాన్‌తో ఒప్పందం కుదిరింది).

ఐదేళ్లలో రూ.50లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

ఇందుకోసం మరిన్ని సదస్సులు పెట్టుకుందాం: సీఎం

టీంవర్క్‌తోనే విశాఖ సమిట్ సూపర్‌హిట్

ప్లానింగ్‌తో నిర్వహించి విజయవంతం చేశారంటూ మంత్రులు, అధికారులకు అభినందన, అవార్డులు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సును జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు చెప్పారు. రానున్న ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ముస్ముందు మరిన్ని సదస్సులు నిర్వహించుకుని విజయవంతం చేద్దామన్నారు. సదస్సు ముగిసిన అనంతరం మంత్రులు, అధికారులు, ఉద్యోగులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బాగా పనిచేశారంటూ అవార్డులు అందించి ప్రశంసించారు. విశాఖ సదస్సు 45 దేశాల్లో చర్చనీయాంశమైందని, ఇది మంత్రులు, అధికారుల టీం వర్క్ వల్లే సాధ్యమైందన్నారు. ప్రతిదీ ప్లానింగ్‌తో నిర్వహించి విజయవంతం చేశారని అభినందించారు. సదస్సు సందర్భంగా మంత్రి లోకేశ్ మన సంస్కృతి, నాగరికతకు అద్దం పట్టేలా మంగళగిరి చీరలను పలువురు విదేశీ మహిళా ప్రతినిధులకు బహూకరించారని.. వారంతా ఆ చీరలు ధరించి సదస్సుకు రావడం అభినందనీయమని చెప్పారు.



సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సందర్భంగా వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మంత్రులు లోకేశ్, నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత, సవిత, సంధ్యారాణి, కందుల దుర్గేశ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, సీఎస్ విజయానంద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడిరామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ఇతర అధికారులు

ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దాం

» ఉద్యోగాల కోతపై భయాలు అవసరం లేదు

» 'క్వాంటం'లో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుంది

» సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్రకటించిన లోకేశ్

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవం మనల్ని నడిపించకూడదని, మనమే ఏఐ విప్లవానికి నాయకత్వం వహిద్దామని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండోరోజైన శనివారం 'ఏఐ, ఉద్యోగాలు భవిష్యత్తు- అంతరాలను, అవకాశాలను మార్చడం' అనే అంశంపై నిర్వహించిన సెషన్‌లో మంత్రి కీలకోపన్యాసం చేశారు. ఏఐ విప్లవంలో భాగస్వాములయ్యేందుకు మూడు విధాలుగా సన్నద్ధమవుదామని పిలుపునిచ్చారు. రీ-స్కిల్లింగ్, రీ-డిఫైనింగ్, రీ-ఇమేజినింగ్ అని మూడు 'ఆర్' ఫార్ములాను ఆయన ప్రతిపాదించారు. రీ-స్కిల్లింగ్‌లో భాగంగా ఏఐ సాంకేతికతలో ప్రస్తుతం అన్నిరంగాల్లో ఉన్న నిపుణుల నైపుణ్యాలను మెరుగుపరచాలని అన్నారు. అందులో భాగంగా ఏపీ ప్రభుత్వం నైపుణ్యం అనే ప్లాట్‌ఫాంను తయారు చేసిందని చెప్పారు. రీ-డిఫైనింగ్‌లో భాగంగా ఏఐ, మానవ మేధస్సు సహకారంతో ఉత్పత్తి రంగంలో మార్పులు తీసుకురావాలన్నారు. రీ-ఇమేజింగ్‌లో అసమానతలను సంప్రదాయ కోణంలో కాకుండా ఏఐ కోణంలో చూడాలని తెలిపారు. మనుషుల్లో అసమానతలకు ఏఐ కారణం కాకూడదని, వాటిని తొలగించే వారధి కావాలని ఆకాంక్షించారు. ఏఐ కారణంగా రానున్న రోజుల్లో ఉద్యోగాల కోత వంటి భయాలు అవసరం లేదని, దీని వల్ల ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు, భయాలకు వచ్చే ఐదేళ్లలో ఏపీ ఒక సమాధానంగా నిలుస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో 'ఏఐ ఈజ్ రెడీ ఫర్ ఏజెంటిక్ ఏఐ' అనే నివేదికను ఆవిష్కరించారు. అనంతరం రానున్న ఐదేళ్లలో 30వేల మంది యువతకు నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, సీఐఐ భాగస్వామ్యంతో విజయవాడలో మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటుపై ఎంవోయూ చేసుకున్నారు.



భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, సీఐఐ భాగస్వామ్యంతో విజయవాడలో మోడల్ కెరీర్ సెంటర్ ఏర్పాటుకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒప్పందం. చిత్రంలో సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమాని, భారత్ బయోటెక్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా

'క్వాంటం పాలసీ- 2025' విడుదల

క్వాంటం రంగంలో ప్రపంచంలోనే భారత్ టాప్‌లో నిలుస్తుందని, ఈ రంగంలో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్రం సంసిద్ధంగా ఉందని లోకేశ్ అన్నారు. 'ఆత్మనిర్భర్ క్వాంటం- ఆంధ్రప్రదేశ్‌లో స్వదేశీ క్వాంటం స్టాక్ నిర్మాణం' అనే అంశంపై నిర్వహించిన చర్చలో మంత్రి మాట్లాడారు. క్వాంటం కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టాలెంట్, నమ్మకం అనే నాలుగు పిల్లర్లపై అమరావతి క్వాంటం వ్యాలీ ఆధారపడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా క్వాంటం పాలసీ- 2025ను ఆవిష్కరించారు. ఏటా 15 వేల మంది విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణ ఇస్తామని సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. అమరావతి క్వాంటం వ్యాలీ, క్వాంటం పాలసీ గురించి ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్ వివరించారు. అనంతరం లోకేశ్ సమక్షంలో 25 సంస్థలతో ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించి ఒప్పందాలు చేసుకుంది.

దేశానికి టెక్ రాజధానిగా ఏపీ

'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)-వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్-ఇన్నోవేషన్-ఇన్‌క్లూజన్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో నిర్వహించిన సదస్సులో లోకేశ్ పాల్గొన్నారు. దేశానికి టెక్ రాజధానిగా ఏపీకి అభివృద్ధి చేస్తామని చెప్పారు. 2029 నాటికి ఏపీని ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా మారుస్తామని తెలిపారు. ఈ రంగంలో 20 వేలకు పైగా స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలు, 10 ప్రధాన రంగాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త... కేవలం నినాదం కాదని, అభివృద్ధికి కొత్త నమూనా అన్నారు. దీని కోసమే ఏపీ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ-2024ను ప్రవేశపెట్టామని లోకేశ్ పేర్కొన్నారు. కాగా, మంత్రి సమక్షంలో పలు సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నారు. ఏపీ వాగ, స్టార్టప్ యూఏఈ, క్వాంటం ఏఐ, స్టార్టప్ రన్‌వే, ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు.



వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్ అంశంపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

ఏపీలో సైబర్ రెజిలియన్స్ కేంద్రం



డబ్ల్యుఈఎఫ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం.. ఇంధన రంగానికి రక్షణ: సీఎం చంద్రబాబు

ఏపీ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ పిలుపు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటుచేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండో రోజైన శనివారం ఇంధన భద్రత, విద్యుత్తు రంగంలో అధునాతన టెక్నాలజీ వినియోగం కోసం సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటుకు వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఈఎఫ్)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇంధన రంగంలో అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థలను కూడా తయారు చేసుకోవాలని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు డబ్ల్యుఈఎఫ్ ముందుకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. సైబర్ రెజిలియన్స్ కేంద్రం విద్యుత్తు వ్యవస్థల రక్షణకు పనిచేస్తుందని తెలిపారు. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలను ఆయన కోరారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ విద్యుత్ ఉత్పత్తి దిశగా భారీ పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు.

పర్యాటకంలో 17,973 కోట్ల పెట్టుబడులు

» 104 ఒప్పందాలు.. 98 వేల మందికి ఉపాధి: మంత్రి కందుల దుర్గేశ్



విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగంలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి భాగస్వామ్య సదస్సులో రూ.17,973 కోట్ల పెట్టుబడులతో 104 ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు. వీటి ద్వారా హోటళ్లలో కొత్తగా 10,690 గదులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ ఒప్పందాల వల్ల ప్రత్యక్షంగా 34,406 మందికి, పరోక్షంగా 63,470 మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. శనివారం 'తీర ప్రాంతం-పర్యాటక రంగ అభివృద్ధి' అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. గత 15 నెలల్లో రూ.12 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తాజా ఒప్పందాలతో రూ.30 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. కోస్తా తీరంలో మూడు పర్యాటక సర్క్యూట్లను గుర్తించామని, వాటి అభివృద్ధికి ప్రైవేటు భాగస్వామ్యం తీసుకుంటామని తెలిపారు. సుందరమైన బీచ్‌లు, సాహస క్రీడలు, క్రూయిజ్ టూరిజం, వెల్‌నెస్ సెంటర్లు వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. నదుల్లో క్రూయిజ్‌లు నడిపే అవకాశాలు పరిశీలిస్తున్నామన్నారు. మైస్ (మీటింగ్‌లు, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్స్‌లు, ఎగ్జిబిషన్‌లు) కేంద్రంగా విశాఖను అభివృద్ధి చేస్తామన్నారు. ర్యాపిడో సహాయ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ.. పర్యాటకులకు అన్ని వసతులు కల్పించేలా పర్యాటక శాఖతో కలిసి వన్ టికెట్-వన్ క్లిక్ విధానం అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం మంత్రి సమక్షంలో పలువురు ఇన్వెస్టర్లు ఒప్పందాలు చేసుకున్నారు.

టూరిజం పారిశ్రామికవేత్తల కోసం 'ఏఐ' వేదిక

పర్యాటక రంగంలో రూ.10 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు స్కూల్ ఆఫ్ టూరిజం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ప్రాజెక్ట్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ సీఈవో లాస్య ఓడూరు మాట్లాడుతూ టూరిజం పారిశ్రామికవేత్తల కోసం ఏఐ ఆధారిత ఆన్‌లైన్ వేదికను శనివారం ఆవిష్కరించామన్నారు. పర్యాటకంలో మంచి అవకాశాలు ఉండే ప్రాజెక్టులు, ఆలోచనలు, డిజైన్లకు సంబంధించిన సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ తరహా ఏఐ వేదిక అందుబాటులో ఉంచడం ఇదే మొదటిసారని అన్నారు.



● క్లింటన్ హైదరాబాద్‌కు ఎందుకొచ్చారో తెలుసా...

- రిక్ రోసో, అమెరికా

"1999లో నేను అమెరికా-ఇండియా బిజినెస్ కౌన్సిల్‌లో ఉన్నప్పుడు చెన్నై లో విదేశీ పెట్టుబడుదారుల ఫోరం నిర్వహించాం. ఒక సంవత్సరం తరువాత నేను, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ హైదరాబాద్ వచ్చాం. చంద్రబాబు వ్యాపార సామర్థ్యం ఒక్కటే కాదు...దేశంలో మొ దటి హెచ్‌ఐవీ క్లినిక్ ప్రారంభించడం క్లింటన్‌ను ఎంతో ఆకట్టుకుంది. హైదరాబాద్‌ను ఎలా మార్చగలనో చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. ఆ తరువాత ఐదేళ్లకు మళ్లీ హైదరాబాద్ వచ్చినప్పుడు ఆయన కృషి కళ్లారా చూశాను. ఇప్పుడు మొదటసారిగా విశాఖ వచ్చాను. ఐదేళ్ల తరువాత విశాఖ వికసిస్తోందని ఊహించడం కష్టం కాదు. ఆంధ్ర లిఫ్ట్‌అప్‌కు సిద్ధంగా ఉందని నమ్ముతున్నాను. ధన్యవాదాలు సీఎం సార్."



● చేనేత జాకెట్‌తో ఆకట్టుకున్న లోకేశ్

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఐఐ సదస్సు వేదికగా మంత్రి లోకేశ్ చేనేతను ప్రమోట్ చేశారు. సదస్సులో రెండు రోజులూ ఆయన షర్ట్‌పై చేనేత జాకెట్లు ధరించారు. దీంతోపాటు సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలందరినీ మంగళగిరి నేతన్నలు తయారు చేసిన శాలువాలతో ఆయన సత్కరించారు. తాను ధరించిన చేనేత జాకెట్ వివరాలను శనివారం 'ఎక్స్'లో పంచుకున్నారు. 'ఈ జాకెట్ మిలన్ లేదా ముంబైలో తయారైంది కాదు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పులగుర్త అనే చిన్న గ్రామంలో తయారు చేసింది' అని లోకేశ్ పేర్కొన్నారు. కాగా, శనివారం ఓ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ చేనేత పనివారు తనకు ఆత్మబంధువులని వ్యాఖ్యానించారు.



చేనేత జాకెట్ ధరించిన మంత్రి లోకేశ్

సూపర్ హిట్

సీఐఐ భాగస్వామ్య సదస్సుల్లో ఇదే బెస్ట్



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఐఐ భాగస్వాముల సదస్సు సూపర్ హిట్ అయిందని, సీఐఐ చరిత్రలో ఇంత బాగా సదస్సు జరగడం ఇదే తొలి సారి అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విశాఖలో రెండు రోజులు జరిగిన సదస్సులో 613 ఎంవోయూలు చేసుకున్నామని, వాటి ద్వారా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. ఎంవోయూలన్నీ నిబద్ధత గల పెట్టుబడిదారులతో చేసుకున్నవేనని, వీటన్నింటినీ మూడేళ్లలో వందశాతం సాకారం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రెండు రోజుల సదస్సు ముగింపు సందర్భంగా శనివారం సీఎం మీడియాతో మాట్లాడారు. ఎంవోయూలు చేసుకున్న పరిశ్రమలకు వీలైనంత తొందరలోనే అన్ని అనుమతులు లభించేలా చేసి, పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చూస్తామని తెలిపారు. ఒకసారి కమిట్ అయిన తర్వాత తమ మంత్రులు, అధికారులే వెంటబడి మరీ వారిని తీసుకొస్తారని సరదాగా అన్నారు. సదస్సుకు ముందు ప్రభుత్వం ఎంవోయూలు కుదుర్చుకునేందుకు భారీ కసరత్తు చేసిందని, కేంద్రం కూడా పూర్తిస్థాయిలో సహకరించిందన్నారు. భారీ పరిశ్రమలకు మౌలిక సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. పరిశ్రమలు వచ్చేకొద్దీ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకొంటాయని, ప్రభుత్వానికి జీఎస్టీ, ఇతర రూపాల్లో ఆదాయం వస్తుందని వివరించారు. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించడంలో విశాఖ సదస్సు విజయవంతమైందని, ఏకంగా 4,975 మంది ప్రతినిధులు పాల్గొనడం ఒక రికార్డు అని తెలిపారు. మొత్తం 41 సెషన్స్ నడిచాయని, తాను స్వయంగా 24 ద్వైపాక్షిక చర్చల్లో భాగస్వామినయ్యానని చెప్పారు. భవిష్యత్తు తరం పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే ఉద్దేశంతో 500 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశామని,వారిని దృష్టిలో ఉంచుకునే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

జనవరినాటికి క్వాంటమ్ కంప్యూటర్ సిద్ధం

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన క్వాంటమ్ మిషన్‌ను అందిపుచ్చుకునేలా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీతో కలిసి జనవరిలో అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్‌ను సిద్ధం చేస్తున్నాం. రానున్న రెండేళ్లలో క్వాంటమ్ కంప్యూటర్లను అమరావతి నుంచి ఉత్పత్తి చేస్తాం."

వైసీపీ తప్పులు పునరావృతం కాకూడదని..

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 17 నెలల కాలంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగాం. వీటి ద్వారా 16.31 లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుంది. విశాఖ సదస్సు ద్వారానే రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. 2019-2024 ఓ బ్యాడ్ పీరియడ్. ఇండస్ట్రీని ప్రమోట్ చేయకపోయినా ఫర్వాలేదుగానీ వాటిని విధ్వంసం చేశారు. సోలార్ రంగంలో విద్యుత్తు పీపీఏలను రద్దు చేసి ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. పారిశ్రామికవేత్తలు కోర్టుకు వెళ్లారు. చివరికి కరెంటు వాడుకోకుండానే, రూ.9 వేల కోట్లు ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చింది. సింగపూర్‌కంపెనీలను కూడా ఇబ్బంది పెట్టారు. మేం వచ్చిన తర్వాత వాటిని మళ్లీ తీసుకొ చ్చే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో తలెత్తిన పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఈసారి ఎస్క్రో అకౌంట్, దానికి సావరిన్ పవర్స్ వంటివి ఇస్తున్నాం. ప్రభుత్వం కేవలం కస్టోడియన్‌లా ఉంటుంది."

మీ డ్రెస్‌ల కంటే చీరలే అందం
చంద్రబాబు చమత్కారం

ఆస్ట్రేలియా నుంచి సదస్సు కోసం వచ్చిన ఒక మహిళా ప్రతినిధి శుక్రవారం చీర కట్టుకున్నారు. శనివారం ప్యాంట్ షర్ట్ వేసుకున్నారు. ఆమె ముగింపు సభలో వేదికపై కూర్చోగా చంద్రబాబు ఆమెను చూస్తూ...'మీరు మీ దేశపు డ్రెస్‌లో కంటే..మా చీరలోనే అందంగా ఉన్నా'రంటూ చమత్కరించారు. అనంతరం విదేశీ మహిళలందరికీ చంద్రబాబు మంగళగిరి చేనేత చీరలను బహుమతిగా ఇచ్చారు. ఇవి చాలా సౌకర్యవంతంగా ఉంటాయని వివరించారు.

గేర్ మార్చాం..

"ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారాం. పరిశ్రమలకు ఏం అవసరమో వాటిపై దృష్టి సారించాం. గ్రీన్ ఎనర్జీ లేకుంటే గూగుల్ రాదు. ఇదంతా ఓ లింకు. అందుకే గ్రీన్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి సారించాం. సూపర్ సిక్స్ అమలు చేసుకుంటూ వచ్చాం.. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా చేస్తానని చెప్పా. అలాగే చేసి చూపిస్తున్నాను. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పా. ఇప్పటికే 24 లక్షల ఉద్యోగాలకు గ్యారంటీ ఇచ్చే పరిస్థితికి వచ్చాం. ఐదేళ్లలో 500 బిలియన్ యూఎస్ డాలర్లు పెట్టుబడులు రావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. దానివల్ల 50 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. పదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు.. కోటి మందికి ఉద్యోగాలు రావాలన్నది లక్ష్యం. ఐటీ వల్ల కొన్ని ఉద్యోగాలు పోయినా ప్రత్యామ్నాయంగా ఇతర రంగాల్లో ఉపాధి కల్పనపై దృష్టి పెడుతున్నాం."

అభివృద్ధి వికేంద్రీకరణ

"రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణపై దృష్టి పెట్టాం. ఇచ్చాపురం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం. అదే సమయంలో ఈస్ట్ నుంచి వెస్ట్‌కు కూడా అభివృద్ధి చేస్తున్నాం. ఉత్తరాంధ్రలో మిట్టల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతోంది. దీనికి చరిత్రలో లేనంత త్వరగా అనుమతులు తీసుకొచ్చాం. నేరుగా ప్రధానితో మాట్లాడి అవసరమైన అనుమతులు తీసుకొచ్చాం. లులూ మాల్ విశాఖలో 2028కి పూర్తవుతుంది. ప్రతి పరిశ్రమ ఎన్ని ఉద్యోగాలు ఇస్తుందనే అంశంపై స్పష్టత తీసుకుంటున్నాం. అలాగే పరిశ్రమలను ఎంఎస్ఎంఈలతో ఎలా అనుసంధానం చేయాలన్న ఆలోచన కూడా చేస్తున్నాం. గతంలో కుటుంబానికో ఐటీ నిపుణుడు అన్నాం. ఇప్పుడు ప్రతి కుటుంబానికో ఎంటర్‌ప్రెన్యూర్.. అనేది లక్ష్యం."

102 పార్కులు ఖరారు.. త్వరలో మరో 77

"175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఇప్పటికే 102 పార్కులను ఖరారు చేశాం. ఇంకో 72 జనవరికి ఖరారవుతాయి. స్పెషల్ ఎకనామిక్ జోన్లు.. మెగా పార్కులు.. ప్రైవేటు పార్కులను అనుసంధానం చేస్తున్నాం. ఎస్ఈజెడ్, మెడ్‌టెక్ పార్కు కలిగిన విశాఖలో ప్లగ్ ప్లే సౌకర్యం కల్పించాం. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. శ్రీసిటీలో 240 యూనిట్లు ఉన్నాయి. దానికోసం ఇంకో 4వేల ఎకరాలు ఇస్తున్నాం. లక్షాయాభైవేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఇప్పటికే 31 దేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టారు. రానున్న రోజుల్లో 50 దేశాల నుంచి ఇక్కడ పరిశ్రమలు పెట్టాలన్నది లక్ష్యం. ఇదొక వినూత్నమైన పారిశ్రామిక అభివృద్ధి మోడల్."

జగన్ 'ఎంవోయూ'లనూ ఫాలోఅప్ చేస్తున్నాం : సీఎం

జగన్ 2023లో విశాఖలో పెట్టిన భాగస్వామ్య సదస్సులో 13 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని చెప్పారని, అవి ఎన్ని వచ్చాయని విలేకరులు అడిగి ప్రశ్నకు.. అప్పట్లో పెట్టుబడులు పెట్టేవారిని తరిమేశారని, అప్పట్లో ఎంవోయూలు చేసుకున్నవారిలో ఎవరైనా ముందుకొస్తే ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. అప్పట్లో పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని తిట్టేసి వెళ్లిపోయారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రైవేటు ఇండస్ట్రీస్ పార్కుల ఏర్పాటుకు ఎవరైనా ముందుకొస్తే వారిని ప్రోత్సహిస్తున్నామని, ల్యాండ్ పూలింగ్‌కు ముందుకొచ్చినా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వపరంగా చాలా ఆదుకున్నామన్నారు. ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీలు లాభాల్లో ఉంటే పబ్లిక్ సెక్టార్ రంగంలో నష్టాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. సమర్థ నిర్వహణ ఉండాలని, స్టీల్‌ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో నష్టాల్లో నడవడానికి వీల్లేదని, ఆ బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రూ.8 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు రాష్ట్రంలోకి వచ్చాయని వివరించారు. భాగస్వామ్య సదస్సు రెండో రోజు శనివారం విదేశీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. వచ్చే ఏడాది నవంబరులో మళ్లీ విశాఖలోనే సదస్సు నిర్వహిస్తామని, కుటుంబాలతో వచ్చి అరకు వెళ్లి కాఫీని ఆస్వాదించాలని కోరారు.



అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ వస్త్ర పరిశ్రమ ఆవరణలో మొక్కను నాటి నీరు పోస్తున్న కేంద్రమంత్రి పీయూష్ గోయల్, పక్కన ఎంపీ సీఎం రమేశ్, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి తదితరులు

మహిళల సాధికారతకు బ్రాండిక్స్ చేయూత!

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రశంసలు

అనకాపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఇండియా వస్త్ర పరిశ్రమతో గ్రామీణ ప్రాంతాల మహిళలు ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పియూష్ గోయల్ తెలిపారు. ఇలాంటి సంస్థలను దేశంలో మరిన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ ఇండియా అపరెల్ సిటీని ఆయన సందర్శించారు. ఆయనకు ఉద్యోగినులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల సంస్థలో ఉత్పత్తులు ప్రపంచస్థాయిలో ఉండటం గొప్ప విషయమన్నారు. పరిశ్రమలోని వివిధ విభాగాలను సందర్శించి దుస్తుల తయారీ విధానాన్ని మంత్రి పరిశీలించారు. ఆయనకు బ్రాండిక్స్ ఇండియా భాగస్వామి దొరస్వామి సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఏడో తరగతి వరకు చదువుకున్న సుమారు 20 వేల మంది గ్రామీణ ప్రాంతాల మహిళలకు శిక్షణ ఇచ్చి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వాతావరణంలో ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ట్రంప్ ప్రకటించిన అదనపు టారిఫ్‌ల కారణంగా సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను లిఖిత పూర్వకంగా మంత్రికి అందజేశారు. దీంతో టారిఫ్‌ల వల్ల వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం బ్రాండిక్స్ ప్రాంగణంలో కేంద్ర మంత్రి మొక్కలు నాటారు.

ఏఐ వర్సిటీ ఏర్పాటులో భాగస్వాములవ్వండి

ఎల్జీ కెమ్ ప్రతినిధులను కోరిన సీఎం చంద్రబాబు



ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబులిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో సమావేశమైన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటులో భాగస్వాములు కావాలని 'ఎల్జీ కెమ్' కంపెనీ ప్రతినిధులను సీఎం చంద్రబాబు కోరారు. ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబులిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో సీఎం సమావేశమయ్యారు. కాకినాడ లేదా మూలపేటలో ఎల్జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకురావాలని ప్రతిపాదించారు. జేఎస్‌డబ్ల్యుతో కలిసి ఎల్జీ కెమ్ ఏర్పాటుచేయాలని భావించిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సహకారం అందిస్తామని చెప్పారు. ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలుందన్నారు. డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్.. ఇలా అన్ని రంగాల్లో ఏపీ ముందుకు వెళుతోందని సీఎం వివరించారు. అబుధాబీ తరహాలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుపై యున్జోకో సానుకూలంగా స్పందించారు.



సక్సెస్ పార్టనర్‌కు సీఎం అభినందనలు

విశాఖ వేదికగా జరిగిన భాగస్వామ్య సదస్సు విజయవంతమవడంలో పార్టనర్‌లుగా వ్యవహరించిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా నిర్వహించిన ఈ సదస్సు ఊహించినదానికంటే విజయవంతమైంది. ఇందులో కీలక భాగస్వామ్యం వహించిన ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పనబాక రచనను ప్రత్యేకంగా అభినందిస్తూ జ్ఞాపికను అందజేశారు.

విశాఖలో మరో డేటా సెంటర్

రాష్ట్ర ప్రభుత్వంతో ఐరిష్ కంపెనీ ఒప్పందం

2 వేల కోట్ల పెట్టుబడి, 14 వేల మందికి ఉద్యోగాలు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఐర్లాండ్ కంపెనీ 'డీఎంసీ' ముందుకువచ్చింది. ఒప్పందం అనంతరం సంస్థ సీఈవో జో పాల్ వివరాలను వెల్లడించారు. రూ.2 వేల కోట్లతో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వాన్ని 250 ఎకరాలు కోరగా సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో సుమారు 14 వేల మందికి ఉద్యోగ అవకాశాలను లభిస్తాయన్నారు. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో ఈ ప్రాజెక్టును చేపడతామన్నారు. డేటా సెంటర్లకు ఏపీ కేంద్రంగా మారేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు బాగున్నాయని ప్రశంసించారు. గతంలో సీఎం చంద్రబాబును దావోస్‌లో కలిశామని, ఆయన ఆహ్వానం మేరకు విశాఖకు వచ్చామని చెప్పారు. ఇప్పటికే ఐర్లాండ్‌లో డేటా సెంటర్ల ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామని, ఇతర దేశాలకు విస్తరించే ప్రక్రియలో భాగంగానే ఏపీని ఎంచుకున్నామన్నారు. ప్రభుత్వం స్థలం కేటాయించిన మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేస్తామని పేర్కొన్నారు.





సీఎం సమక్షంలో శ్రీకాకుళంలో విమానాశ్రయ ఏర్పాటుపై ఒప్పంద పత్రాలతో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, చిత్రంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళంలో విమానాశ్రయం

సీఎం సమక్షంలో ఎంఓయూ

ఉత్తరాంధ్రలో మరో కొత్త విమానాశ్రయం రానుంది. ఇప్పటికే భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జిల్లాలో మరో విమానాశ్రయానికి ప్రతిపాదించగా.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా దీనికి అంగీకరించింది. శనివారం సీఐఐ సదస్సులో సీఎం చంద్రబాబు సమక్షంలో ఆ సంస్థతో ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంవోయూ కుదుర్చుకుంది.

విమానరంగం గ్రోత్ హబ్‌గా ఏపీ

మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత్ ఏవియేషన్

పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏవియేషన్ రంగం గ్రోత్ హబ్‌గా ఏపీ మారబోతుందని పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. సీఐఐ సదస్సులో శనివారం మాట్లాడుతూ ఇకపై విమాన ప్రయాణం సామాన్యులకు అందుబాటులోకి వస్తుందన్నారు. సీఐఐ సదస్సు విజయవంతం వెనుక సీఎం చంద్రబాబు కృషి ఉందన్నారు. 75 ఏళ్ల వయసులో చంద్రబాబు ఉత్సాహం, పనిలో నిబద్ధత తనలాంటి వారికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత ఏవియేషన్ రంగం ప్రపంచంలో మూడో అతి పెద్ద మార్కెట్‌గా అవతరించిందన్నారు. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 164కు పెరిగిందన్నారు. ప్రయాణికుల సంఖ్య మూడు రెట్లు పెరిగిందన్నారు. దేశంలో మరిన్ని ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నామన్నారు. ఎక్స్‌ప్రెస్ డెలివరీ ద్వారా 24 గంటల్లో వస్తువులు చేరవేసేలా ఎయిర్‌కార్గో మోడల్‌ను మెరుగుపరచడంపై దృష్టి సారించామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, కొత్త ఎయిర్‌లైన్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ, దేశీయ కనెక్టివిటీని మరింత పెంచడానికి ఎయిర్‌లైన్స్‌తో చర్చిస్తున్నామన్నారు. అంతకుముందు సీఐఐ ఏపీ అండ్ ఫౌండర్ ఫ్లూయింట్ గ్రిడ్ లిమిటెడ్ సీఈవో మురళీకృష్ణ, ఎయిర్‌పోర్ట్స్ జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ జీబీఎస్ రాజు మాట్లాడారు.

సెమీ కండక్టర్ పరిశ్రమలకు విశాఖ సానుకూలం

క్వాల్కమ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పీఆర్ చిదంబరం



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ముందుకువచ్చిన నేపథ్యంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమలకు విశాఖ కీలకంగా మారబోతోందని క్వాల్కమ్ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పీఆర్ చిదంబరం అన్నారు. ఇక్కడ సెమీకండక్టర్ పరిశ్రమల స్థాపనకు ఎకో సిస్టమ్ సానుకూల అంశంగా పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సెమీకండక్టర్ పరిశ్రమకు విశాఖ కేరాఫ్‌గా మారుతుందనడంలో అనుమానం లేదన్నారు. ఇప్పటివరకూ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల తయారీకి మాత్రమే సెమీ కండక్టర్ల అవసరం ఉండేదని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శకంతో సెమీకండక్టర్ పరిశ్రమ సూపర్‌పవర్‌గా మారి ఐటీ, కమ్యూనికేషన్ రంగాన్ని శాసించే స్థితికి వస్తుందన్నారు.



సదస్సుకు హాజరవుతున్న మహిళా పారిశ్రామికవేత్తలు

గిరిజన కళాకారులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న విదేశీ ప్రతినిధులు





సదస్సు ప్రాంగణంలో ప్రతినిధుల కోలాహలం



రాయలసీమకు రేమండ్



రాయలసీమలో రేమండ్ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో రేమండ్ గ్రూపు ఇంజనీరింగ్ బిజినెస్ ఎండీ గౌతమ్ మియానీ, మంత్రి టీజీ భరత్ ఉన్నారు

- రూ.1,201 కోట్లతో మూడు ప్రాజెక్టులు
- అపారెల్, ఆటో, ఏరోస్పేస్ రంగాల్లో పెట్టుబడులు
- పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన
- 2027 నాటికి పూర్తిచేయాలన్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో రూ. 1,201 కోట్ల పెట్టుబడులతో అపారెల్, ఆటో, ఏరోస్పేస్ రంగాల్లో మూడు ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నట్లు రేమండ్ గ్రూపు శనివారం ప్రకటించింది. వీటికి సంబంధించిన పనులకు శనివారం సీఐఐ సదస్సు వేదికపై నుంచి మంత్రి టీజీ భరత్‌తో కలసి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాయలసీమకు అనేక రంగాల్లో భారీ ప్రాజెక్టులు తీసుకువస్తున్నామని చెప్పారు. కియా మోటార్స్ ఉందని, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీలు నెలకొల్పుతున్నామన్నారు. విమానాల తయారీకి చాలా డిమాండ్ ఉందని, ఆ రంగంలో రేమండ్ పెట్టుబడులు పెట్టడం అభినందనీయమని చెప్పారు. శంకుస్థాపన చేసిన ఈ పరిశ్రమలను 2027 డిసెంబరుకల్లా పూర్తి చేయాలన్నారు. రేమండ్ గ్రూపు ఇంజనీరింగ్ బిజినెస్ ఎండీ గౌతమ్ మియానీ మాట్లాడుతూ, రాప్తాడులో రూ. 497 కోట్లతో అపారెల్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్, అనంతపురం జిల్లా గుడిపల్లిలో రూ. 441 కోట్లతో ఆటో కాంపోనెంట్ తయారీ కర్మాగారం, అదే జిల్లాలో టేకులోడు వద్ద రూ. 262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా మొత్తం 6,500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

క్రూయిజ్‌ను రెగ్యులర్‌గా నడపండి

- కార్డెలియాకు సీఎం చంద్రబాబు సూచన



సీఎంతో సమావేశమైన కార్డెలియా సంస్థ ప్రతినిధి

విశాఖలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఉందని, ఏడాదికి రెండుసార్లు చెన్నై నుంచి ఇక్కడికి వస్తున్న కార్డెలియా సంస్థకు చెందిన క్రూయిజ్ షిప్‌ను రెగ్యులర్‌గా నడపాలని సీఎం చంద్రబాబు సంస్థ ప్రతినిధులను కోరారు. సీఐఐ సదస్సుకు వచ్చిన వారితో సీఎం చర్చించారు. విశాఖపట్నం-కాకినాడ-భీమునిపట్నం మీదుగా క్రూయిజ్ టూరిజం ప్రారంభించాలని కోరారు. ఈ చర్చల్లో మంత్రి కందుల దుర్గేశ్, ఏపీటీడీసీ ఎండీ, సీఈఓ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

బయో ఫెర్టిలైజర్ యూనిట్లు పెట్టండి

ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘానీని కోరిన సీఎం



ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘానీని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో బయో ఫెర్టిలైజర్, బయో స్టిమ్యులెంట్ యూనిట్లు ఏర్పాటుచేయాలని ఇఫ్కో సంస్థ చైర్మన్ దిలీప్ ననూభాయ్ సంఘానీని సీఎం చంద్రబాబు కోరారు. భాగస్వామ్య సదస్సు రెండో రోజు శనివారం ఇఫ్కో చైర్మన్‌తో భేటీ అయ్యి, పలు అంశాలపై చర్చించారు. గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఆధారిత ఫెర్టిలైజర్ ప్లాంట్ల ఏర్పాటు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ముందుకురావాలని సీఎం కోరారు. ఇఫ్కోతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు వెల్లడించారు.

3 ప్రాజెక్టులు.. మూడేళ్లలో పూర్తి

సీఎంతో అట్మాస్పియర్ కోర్ దక్షిణాసియా ఎండీ భేటీ



అట్మాస్పియర్ కోర్ గ్రూపు ఎండీ సలీల్ పాణిగ్రాహిని సత్కరిస్తున్న సీఎం

ప్రముఖ గ్లోబల్ హాస్పిటాలిటీ గ్రూపు అట్మాస్పియర్ కోర్ గ్రూపు ఎండీ సలీల్ పాణిగ్రాహి, దక్షిణాసియా ఎండీ సౌవగ్య మహాపాత్రతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. తిరుపతి, విశాఖపట్నం, అమరావతిలో అట్మాస్పియర్ కోర్ చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. గండికోటలో అడ్వెంచర్ రిసార్ట్స్ అరకు, అనంతగిరిలో హిల్ రిసార్ట్స్ ఏర్పాటుకు ఆలోచించాలని, బొబ్బిలి, విజయనగరం కోటలను పర్యాటకంగా ఎలా అభివృద్ధి చేయొచ్చనే చెప్పాలని సీఎం వారిని కోరారు. రుషికొండలో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్ నిర్మించేందుకు అట్మాస్పియర్ కోర్ ప్రతినిధులు ఆసక్తి వ్యక్తంచేశారు.

ప్రవాసాంధ్రులు పెట్టుబడులతో రావాలి

- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు



విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని, పెట్టుబడులతో ముందుకురావాలని ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్‌టీ, సాధికారిత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా శనివారం 'వికసిత్ భారత్ 2047-ప్రవాసాంధ్రుల భాగస్వామ్యం' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. ప్రవాసాంధ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రత్యేక వ్యవస్థ ద్వారా అన్ని రకాల అనుమతులు త్వరితగతిన మంజూరు చేస్తుందని చెప్పారు. చాంపియన్స్ గ్రూపు చైర్మన్ సూరపనేని సుధాకర్‌బాబు మాట్లాడుతూ, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం అన్నారు. ఫైడేటా సెంటర్ చైర్మన్ ముప్పనేని కల్యాణ్ మాట్లాడుతూ, ప్రవాసాంధ్రుల కోసం ప్లగ్ అండ్ ప్లే విధానంలో వసతులు కల్పించాలన్నారు.

హెల్తియం మెడ్‌టెక్ 300 కోట్ల పెట్టుబడులు

- మొదటిదశలో విజయవాడలో రూ. 50 కోట్లు



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ. 300 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు హెల్తియం మెడ్‌టెక్ లిమిటెడ్ కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సీఐఐ ప్రాంగణంలో ఆ సంస్థ గవర్నమెంట్ అఫైర్స్ హెడ్ మయాంక్ రోహత్గీ దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. దేశంలోనే అతిపెద్ద మెడ్‌టెక్ కంపెనీగా గుర్తింపు పొందిన తాము వైద్యపరికరాలు, సర్జికల్స్ తయారీలో ఏపీలో పెట్టుబడులు పెడుతున్నామని చెప్పారు. మొదటిదశలో విజయవాడలో రూ.50 కోట్లు, తర్వాత మరో 150 కోట్లు పెట్టుబడి పెడతామన్నారు. శ్రీసిటీలో తమ ప్లాంటు ఉందని, అక్కడ మౌలిక వసతులు అనుకూలంగా ఉండడంతో అక్కడ మరో రూ.వంద కోట్లతో రెండో ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. తమ పెట్టుబడులతో 300 మంది ప్రత్యక్షంగానూ, మరో 300 మందికి పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు.

● అదరహో.. అరకు కాఫీ



అరకు కాఫీ స్టాల్

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన సీఐఐ సదస్సుకు హాజరైన ప్రతినిధులు అరకు కాఫీ రుచికి ఫిదా అయ్యారు. ప్రాంగణంలోని హాల్-2లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను రెండు రోజుల్లో సుమారు ఐదు వేల మంది సందర్శించారు. అరకు కాఫీ ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. కాఫీ ఫ్లేవర్‌ను ఆస్వాదించారు. కాఫీ తోటల పెంపకం, గింజల సేకరణ, పౌడర్ తయారీ దశల్లో సేంద్రియ విధానాలనే పాటిస్తున్నట్లు నిర్వాహకులు వివరించారు. సదస్సు జరిగిన రెండురోజుల్లో సుమారు మూడు వేలమంది అరకు కాఫీ రుచి చూసినట్టు నిర్వాహకులు తెలిపారు. కాఫీ రుచిచూసిన అనేకమంది విదేశీ ప్రతినిధులు కాఫీ పౌడర్‌ను కొనుగోలు చేసి తీసుకువెళ్లారు.

జపాన్ నోట.. తెలుగు మాట!

పెట్టుబడుల సదస్సులో జపాన్ రాయబారి తెలుగు ప్రసంగం

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జపాన్‌తో భారత్ వాణిజ్య సంబంధాలపై ఆ దేశ రాయబారి ఓనో కిచ్చి.. తెలుగులోనే ప్రసంగం ప్రారంభించడంతో సదస్సులో వారంతా ఆశ్చర్యపోయారు. 'ఈ రోజు సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడాన్ని నేను చాలా గౌరవంగా భావిస్తున్నాను. ఈ అద్భుతమైన కార్యక్రమం ద్వారా జపాన్, భారత్ కంపెనీలు పరస్పర సహకారం అందిపుచ్చుకోవడంపై ఎంతో సంతోషిస్తున్నాను' అని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. 'నన్ను ఆహ్వానించినందుకు మీకు కృతజ్ఞతలు' అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేసి, తెలుగులో ఇదే తన మొదటి ప్రసంగమని తెలిపారు. జపాన్, ఏపీ మధ్య వాణిజ్య సంబంధాలు ఈ సదస్సు ద్వారా మరింత బలోపేతమవుతాయని పేర్కొన్నారు.

● విందు.. భలే పసందు!



విశాఖ భాగస్వామ్య సదస్సులో విందు ఆరగిస్తున్న ప్రతినిధులు

రెండు రోజుల భాగస్వామ్య సదస్సులో అతిథులు అదిరిపోయే రుచులను తనివితీరా ఆస్వాదించారు. ప్రాంగణంలో అధికారులు, మీడియా, డెలిగేట్స్‌కు వేర్వేరుగా భోజన ఏర్పాట్లు చేశారు. మెయిన్ కోర్సులో స్టిర్ ఫ్రైడ్ డైస్డ్ ఫిష్ విత్ బ్లాక్ బీన్స్, గోంగూర మాంసం, చిట్టి ముత్యాల కోడి పులావ్, టమాటా వెల్లుల్లి రసం, పప్పుచారు, అవది వెజ్ పులావ్, కొత్తిమీర అన్నం, మసాలా దాల్ కిచిడీ, పంజాబీ దాబా స్టైల్ దాల్ తడ్కా, పనీర్ జల్‌ఫ్రీజీ కాటేజ్ చీజ్ కర్రీ, ఎగ్జాటిక్ స్టిర్ ఫ్రైడ్ వెజిటబుల్, వోక్ టాస్డ్ సింగపూర్ నూడిల్స్, సబ్జీ కొల్హాపురి, క్రీమ్ కార్న్ స్పినాక్ విత్ పెప్పర్, బంగాళదుంప వేపుడు, బీరకాయ శనగపప్పు కర్రీ, అసోర్టెడ్ ఇండియన్ బ్రెడ్ వంటి వాటికి ప్రతినిధులు ఫిదా అయ్యారు.

● 'ఆహా'..ర డెలివరీ రోబో!



సీఐఐ ప్రాంగణంలో రోబో

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో జనం మధ్య తిరుగుతూ ఆహారాన్ని అందించిన రోబో అందరినీ ఆకర్షించింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆహార డెలివరీ చేసే రోబో ఇది. జీఎంఆర్ ఇన్నోవెక్స్, ఒట్టోనొమి సంస్థ దీనిని అభివృద్ధి చేశాయి. ఇది విమానాశ్రయ టెర్మినల్స్‌లోని బోర్డింగ్ గేట్ల వద్ద ప్రయాణికులకు నేరుగా ఆహార పానీయాలను డెలివరీ చేస్తుంటుంది. క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయడం ద్వారా విమానాశ్రయంలోని రెస్టారెంట్ల నుంచి కావాల్సిన ఆహారాన్ని ప్రయాణికులు ఆర్డర్ చేస్తారు. అంతే.. రోబో వారున్న ప్రదేశానికి డెలివరీ చేస్తుంది. దేశంలో మొదటిగా హైదరాబాద్‌లోనే ఈ సేవలు ప్రారంభించినట్లు జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు.

● లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలు చేస్తాం



సదస్సులో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

గుమ్మిడి సంధ్యారాణి

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్ష మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సీఐఐ సదస్సులో 'లింగ సమానత్వ స్పందన: సమగ్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం' అనే అంశంపై శనివారం జరిగిన చర్చాగోష్ఠిలో ఆమె మాట్లాడారు. మహిళల అభివృద్ధికి సీఎం ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ, డిజిటల్ గవర్నెన్స్‌ను ఆకళింపుచేసుకుని ముందుకువెళ్లాలని మహిళలను కోరారు.

హత్య కోణంలోనే దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

అనంతపురం జిల్లాలోనే మకాంవేసి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీశ్, ఇతర పోలీసు అధికారులు, రైల్వే పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు, వైద్య నిపుణులతో ఆయన చర్చించారు. ఈ క్రమంలో సీఐ సతీశ్ మృతిపై ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. అనంతరం తాడిపత్రి సమీపంలోని ఘటనా స్థలానికి వెళ్లి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సతీశ్ బరువు, ఎత్తుకు సమానంగా ఉన్న రెండు బొమ్మలను వేగంగా వెళుతున్న రైలు నుంచి కిందకు తోయించి 'సీన్ రీ కన్‌స్ట్రక్షన్'కు ప్రయత్నించారు. ఈ దృశ్యాలను వీడియో తీశారు.

పోస్టుమార్టంలో ఏం గుర్తించారు?

సతీశ్ కుమార్ మృతిపై అనుమానాలు తలెత్తుతున్న నేపథ్యంలో అనంతపురం జిల్లాకు వచ్చిన సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ శనివారం అనంతపురంలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు వైద్య నిపుణులతో చర్చించారు. సీటీ స్కాన్‌లో, పోస్టుమార్టంలో ఏం గుర్తించారు? ఎక్కడెక్కడ గాయాలు ఉన్నాయి? ఇది హత్యేనా? ప్రమాదం వల్ల జరిగిందా? అని అనేక కోణాల్లో ఆరా తీసినట్లు తెలిసింది. ఫోరెన్సిక్ అధికారుల బృందాన్ని, రైల్వే పోలీసులను సైతం ఆయన పిలిపించి మాట్లాడారు. అనంతరం, ఘటనా స్థలానికి చేరుకున్న సీఐడీ డీజీ, డీఐజీ, ఎస్పీ, ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, గుంతకల్లు రైల్వే డీఎస్పీ శ్రీనివాసాచారి తదితరులు సతీశ్ మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతదేహం ఎక్కడ పడింది? రైల్వే ట్రాక్‌కు ఎంత దూరంలో పడింది? వంటి వివరాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా పోలీసులు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేయించారు.

వారే హత్య చేయించారా?

గుంతకల్లు జీఆర్పీ సీఐ సతీశ్ కుమార్ శుక్రవారం తెల్లవారుజామున గుత్తి జీఆర్పీ పరిధిలోని కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో మృతి చెందారని జీఆర్పీ పోలీసులు తెలిపారు. పరకామణి కేసులో సాక్ష్యం చెప్పేందుకు గురువారం రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో(నంబర్ 12794) గుంతకల్లు నుంచి తిరుపతికి బయలుదేరారని, శుక్రవారం ఉదయం కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో కేఎం నంబరు 373/9-11 సమీపంలో అనుమానస్పద రీతిలో మృతి చెందారని తెలిపారు. సతీశ్ సోదరుడు హరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేశారని, హత్యగా భావిస్తూ.. తాడిపత్రి పోలీస్ సబ్ డివిజన్‌కు కేసును బదలాయించినట్లు తెలిపారు. మరో పోలీసు బృందం గుంతకల్లులో పర్యటించి విచారించింది. పరకామణి చోరీ కేసు నిందితులే హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. రైల్వే రిజర్వేషన్ చార్టును సేకరించి, ఏ-1 బోగీలో సతీశ్ కుమార్‌తోపాటు ప్రయాణించిన వారి జాబితాను పరిశీలించారు. రైల్వే స్టేషన్ సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లోని ఏ1 బోగీని పరిశీలించడానికి మరో బృందం వెళ్లింది. ఆ బోగీలో సతీశ్ కుమార్‌పై దాడి జరిగి ఉంటే రక్త నమూనాలు లభించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా, సీటీ స్కాన్, పోస్టుమార్టమ్‌లలో సతీశ్ కుమార్ పుర్రె ఛిద్రం కావడంతోపాటు ఛాతీ ఎముకలు(రిబ్స్) కూడా విరిగిపోయినట్లు గుర్తించారు.



అనంతపురం జిల్లా కోమలి గ్రామ సమీపంలోని ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐడీ డీజీ అయ్యన్నార్, ఎస్పీ జగదీశ్ తదితరులు

వేరే సీటు వద్ద సతీశ్ లగేజీ?

సతీశ్ ఏ1 బోగీలోని 29వ బెర్త్‌ను రిజర్వు చేసుకున్నారు. కానీ ఆయన లగేజీ బ్యాగ్‌ను 11వ సీటు వద్ద గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు సతీశ్ తన భార్యకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఆ రాత్రి సుమారు నాలుగు సార్లు తన భార్యకు ఫోన్ చేయగా... ఆమె లిఫ్ట్ చేయలేదని తెలుస్తోంది. దీంతో ఆయన 'నాట్ ఫీలింగ్ కంఫర్ట్' అనే సంక్షిప్త సందేశాన్ని తన భార్యకు పంపించారని ప్రచారం జరుగుతోంది.

బోగీలో రక్తపు మరకలు?

సతీశ్ కేసును రేణిగుంట జీఆర్పీఎఫ్ డీఎస్పీ హర్షిత నేతృత్వంలోనూ విచారిస్తున్నారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో సతీశ్ ఏ1 కోచ్‌లో ఎక్కారు. గుంతకల్లులో ఆరుగురు దిగిపోగా, సతీశ్‌తో పాటు మరో ఆరుగురు ఎక్కినట్టు తెలిసింది. 29వ నెంబరు బెర్త్‌లో సతీశ్ కూర్చున్నట్టు సమాచారం. దీనిపై టీటీఈ పాపారావు, లోకో పైలెట్ జగదీశ్‌లను విచారించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు బెడ్ రోలర్స్‌ను కూడా విచారిస్తున్నట్టు తెలిసింది. రైలు తిరుపతికి చేరుకోగానే ఈ కోచ్‌ను శుభ్రం చేసిన ఐదుగురు పారిశుధ్య కార్మికులు, గార్డును విచారించారు. కోచ్‌లో రక్తం మరకలున్నట్లు వారు చెప్పారని తెలిసింది. మరోవైపు సతీశ్ సర్వీస్ రివాల్వర్ ఎక్కడుందో ఆరా తీస్తున్నట్లు సమాచారం. కాగా.. ఆయన అంత్యక్రియలు శనివారం కర్నూలు జిల్లా పత్తికొండలో అధికార లాంఛనాలతో జరిగాయి. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర తదితరులు నివాళులర్పించారు. శ్మశాన వాటికలో రైల్వే పోలీసులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలను నిర్వహించారు.

'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్

- ఫ్రాన్స్ నుంచి వచ్చిన వెబ్‌సైట్ అడ్మిన్
- కూకట్‌పల్లిలో అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు



హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్త సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను నిమిషాల వ్యవధిలో పైరసీ చేసి తమ సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్న 'ఐ బొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనకు సంబంధించి మూడు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.3 కోట్లను ఫ్రీజ్ చేశారు. కొత్త సినిమాలను థియేటర్లలో ప్రదర్శించే సమయంలోనే రికార్డ్ చేసి, వాటిని 'ఐ బొమ్మ' వెబ్‌సైట్‌లో పెడుతున్నారని, పైరసీ కారణంగా 2023లో భారత సినీ పరిశ్రమకు రూ.22,400 కోట్లు నష్టం వాటిల్లగా.. ఒక్క తెలుగు సినీ పరిశ్రమే 2024లో రూ.3,700 కోట్లు నష్టపోయిందని తెలుగు ఫిలిం ఇండస్ట్రీ యాంటీ పైరసీ టీమ్ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైం అధికారులు దర్యాప్తు చేసి పైరసీ ముఠాకు చెందిన ఐదుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీ సంఖ్యలో పైరేటెడ్ సీడీలను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో కీలక వ్యక్తి, పట్నాకు చెందిన అశ్వినీ కుమార్, ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు 'ఐ బొమ్మ' అడ్మిన్ ఇమ్మడి రవికి సంబంధించి వివరాలు రాబట్టారు. అతడి కదలికలపై 3నెలలుగా నిఘా పెట్టారు. కొంత కాలంగా ఆయన కరేబియన్ దీవుల్లో ఉంటూ 'ఐ బొమ్మ' వెబ్‌సైట్ నిర్వహిస్తున్నాడని తెలుసుకున్నారు. ఇటీవల ఆయన ఫ్రాన్స్ నుంచి కూకట్‌పల్లిలోని ఇంటికి వచ్చినట్లు గుర్తించారు. వెంటనే, దాడి చేసి అరెస్ట్ చేశారు. అనంతరం నాంపల్లి కోర్టుకు తరలించారు. అతడి నుంచి పోలీసులు కీలక సమాచారం సేకరించారు. అతడికి సహకరించిన, నెట్‌వర్క్‌లో ఉన్న మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. త్వరలో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

సర్వర్లు హ్యాక్ చేసి...: 'ఐ బొమ్మ'లో ఐ అంటే రవి ఇంటి పేరు ఇమ్మడి అని పోలీసులు గుర్తించారు. గడిచిన ఆరేళ్లుగా సదరు వెబ్‌సైట్‌లో పైరసీ చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్నాడని, ఈ కాలంలో వేలాది సినిమాలను అప్‌లోడ్ చేశాడని దర్యాప్తులో భాగంగా గుర్తించారు. హైఎండ్ టెక్నాలజీని ఉపయోగించి సినిమా ప్రసారం చేసే సంస్థల సర్వర్లు హ్యాక్ చేసేవాడు. డీసీఐ పరికరాలు, హార్డ్ డిస్కులు, మెయిల్స్‌లో ఉన్న సినిమాను చోరీ చేస్తున్నాడు. ఇందు కోసం రవి హ్యాకర్లకు లక్షలు చెల్లిస్తున్నాడని పోలీసులు తాజాగా గుర్తించారు. 'మమ్మల్ని ఆపలేరు.. వెతకలేరు' అంటూ రవి గతంలో పోలీసులకు సవాల్ విసిరాడు. కానీ పోలీసులు వ్యూహాత్మకంగా అరెస్టు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.